


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 279

సోమవారం 30-12-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | WARANGAL | KHAMMAM | MAHABOOBNAGAR | KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM




**ఫ్రీ పాలసీ! మీరేం చేయాలి?**

క్రెడిట్, డెబిట్ కార్డులపై ఉచిత బీమా కవరేజీల గురించి కథనం - ప్రాఫిట్ ప్లస్



**గ్రెటా ది గ్రేట్..**

ప్రపంచ ప్రజల మన్ననలు పొందుతున్న టీనేజీ పర్యావరణవేత్త - ఫ్యామిలీలో



# చేనేతకు ఫ్యాన్.. నో 'యాక్షన్'.. మాస్టర్ ప్లాన్

### ట్విట్టర్‌లో నెటిజన్ల ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ జవాబులు

- సినిమాల్లో నటించేంత తీరిక లేదు.. ప్రస్తుతం ఫుల్‌టైమ్ జాబ్ చేస్తున్నా
- పౌరసత్వ సవరణ చట్టం అమలుపై త్వరలో కేబినెట్ నిర్ణయం
- పెరిగిన ద్రవ్యోల్బణం, నిరుద్యోగంపై కేంద్రం బదులివ్వాలి
- ఏపీ సీఎం జగన్ 6 నెలల పాలన ఒక 'మంచి ప్రారంభం'
- మంత్రి పదవి కన్నా పార్టీ పదవే నాకు విలువైంది..
- కాళేశ్వరం పూర్తయితే హైదరాబాద్‌కు నీటి కొరత ఉండదు
- 2020లోనే ఫార్మాసిటీ, టీహబ్, 'కాళేశ్వరం' పరుగులు

**"హైదరాబాద్‌ను టూరిస్ట్ డెస్టినేషన్‌గా మార్చేందుకు ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాం. చార్మినార్, గోల్కొండలకు ప్రపంచ వారసత్వ హోదా సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నాం.**

ప్రస్తుతం ఫుల్ టైమ్ జాబ్ చేస్తున్నానని, తనకు సినిమాల్లో నటించేంత సమయం లేదని మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు స్పష్టంచేశారు. ఆదివారం ట్విట్టర్ వేదికగా 'ఆస్క్ కేటీఆర్ హ్యాష్ ట్యాగ్'పై మంత్రి ప్రజలతో సంభాషించారు. ఈ సందర్భంగా ఓ నెటిజన్ 'సామాజిక సందేశం ఇచ్చేందుకు మీరు సినిమాల్లో నటించొచ్చు కదా?' అని అడిగిన ప్రశ్నకు కేటీఆర్ పైవిధంగా బదులిచ్చారు. దీంతో పాటు ఆయన పలు అంశాలు, ప్రభుత్వ ప్రాధాన్యాలు, వ్యక్తిగత అంశాలు, అభిరుచులపైనా ప్రజలకు సమాధానాలిచ్చారు. ఈ హ్యాష్‌ట్యాగ్ చాలా సేపు దేశంలో ట్విట్టర్ ట్రెండింగ్‌లో నంబర్‌వన్‌గా నిలిచింది. ప్రస్తుత రాజకీయాలు, సమకాలీన అంశాలపై కూడా కేటీఆర్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. - మరిన్ని వివరాలు 2లో



### అరాచకం, అస్థిరతలపై
## అసహనం..

- వ్యవస్థలో లోపాలుంటే యువత ధైర్యంగా నిలదీస్తోంది
- వచ్చే దశాబ్దాలన్నీ యువతరానివే
- మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ



### జార్ఖండ్ 11వ సీఎంగా
## హేమంత్ సోరెన్

- కేబినెట్ మంత్రులుగా మరో ముగ్గురు ప్రమాణస్వీకారం
- ప్రతిపక్ష పార్టీల నాయకులంతా హాజరు

- వివరాలు 10లో

# మహిళా హాస్టళ్లకు మరింత భద్రత

- రాష్ట్రంలోని లేడీస్ హాస్టళ్లపై విమెన్ సేఫ్టీ వింగ్ నజర్
- హాస్టళ్లలోని వర్కింగ్ విమెన్, విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు
- అన్ని వివరాలతో రిజిస్టర్ రూపొందించాలని నిర్ణయం
- తొలుత భాగ్యనగరం.. ఆపై రాష్ట్రవ్యాప్తంగా అమలు
- రాష్ట్రంలో 15 వేల హాస్టళ్లు ఉంటాయని అంచనా.. షీ టీమ్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: నగరంలో కుప్పలు తెప్పలుగా లేడీస్ హాస్టళ్లు వెలుస్తున్నాయి. వీటిలో అధికశాతం హాస్టళ్లకు సరైన అనుమతులు ఉండవు. ఎలాంటి భద్రతా ప్రమాణాలూ పాటించవు. పార్కింగ్, ఫైర్‌సేఫ్టీ, ఫుడ్ విషయంలోనూ మెజారిటీ యాజమాన్యాలు నిబంధనలను అమలు చేయడం లేదు. చాలామంది యాజమాన్యాలకు తమ హాస్టళ్లలో ఉండే మహిళలు, విద్యార్థినుల సంఖ్య, వారి చిరునామాలు కూడా తెలియవు. ఇలాంటి హాస్టళ్లలో ఉండే వారికి భద్రత పెంచాలన్న సంకల్పంతో తెలంగాణ విమెన్‌సేఫ్టీ వింగ్ సరికొత్త కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని లేడీస్ హాస్టళ్లపైనా మిగతా 2వ పేజీలో ▶









### మందు గోలీ.. ఈఎస్ఐ ఖాళీ

- డిస్పెన్సరీల్లో మందుల కొరత తీవ్రం
- ఇబ్బందులు పడుతున్న కార్మికులు

- వివరాలు 5లో



# ఆహా.. మిడ్ మా'నీరు'!

- నిండుకుండను తలపిస్తున్న రిజర్వాయర్
- మొత్తంగా వచ్చిన 52 టీఎంసీల్లో కాళేశ్వరంతో ఎత్తిపోసిన నీరే అధికం
- 25.11 టీఎంసీలకు చేరిన నిల్వ
- నేడు సీఎం పర్యటన అనంతరం కాల్వలకు నీటి విడుదల అవకాశం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా గోదావరి నీటి తరలింపుతో శ్రీ రాజరాజేశ్వర రిజర్వాయర్ (మిడ్‌మానేరు) నిండుకుండను తలపిస్తోంది. రిజర్వాయర్ పూర్తి నిల్వ సామర్థ్యం 25.87 టీఎంసీలు కాగా ప్రస్తుతం 25.11 టీఎంసీల మేర నిల్వ ఉంది. మొత్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు రిజర్వాయర్‌లోకి 52 టీఎంసీల మేర కొత్త నీరు రాగా, అందులో మిగతా 2వ పేజీలో ▶

### నేడు సిరిసిల్ల జిల్లాకు
## సీఎం కేసీఆర్

**రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు**

**అనంతరం మిడ్ మానేరు డ్యామ్ పరిశీలన**

సాక్షి, హైదరాబాద్

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8:30 గంటలకు ప్రగతి భవన్ నుంచి బయలుదేరి 10:30 గంటలకు వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయానికి చేరుకుంటారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మిడ్ మానేరు డ్యామ్ పరిశీలన కోసం బయలుదేరుతారు. మధ్యాహ్నం 12:30 గంటలకు మిడ్ మానేరు నుంచి బయలుదేరి ఒంటి గంటకు కరీంనగర్ జిల్లాలోని తీగలగుట్టపల్లికి చేరుకుంటారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడతారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ చేరుకోనున్నారు.










### వసూళ్లు ఎక్కువ.. వాహనాలు తక్కువ

- రాష్ట్రంలో ఫాస్టాగ్ టోల్ వసూళ్లలో వింత పరిస్థితి
- ఫాస్టాగ్ లేన్లలో వాహనాలు 48%.. ఆదాయం 58%
- క్యాష్ లేన్లలో వాహనాలు 52%.. ఆదాయం తక్కువ
- కమర్షియల్ వాహనాల వల్ల ఫాస్టాగ్‌లో ఆదాయం అధికం

- వివరాలు 3లో

### పెజావర స్వామీజీ అస్తమయం..

- 8 దశాబ్దాలుగా ఆధ్యాత్మిక సేవలో..
- బెంగళూరులో అంత్యక్రియలు
- కర్ణాటకలో 3 రోజులు సంతాప దినాలు

- వివరాలు 10లో

**ఇదండీ సంగతి**



ముందు వాళ్లకు అధికారమిచ్చిన వాళ్ల సంగతి తేల్చాలి సార్...పదండి!!

# ఈ విజయం ఎంతో మధురం



**ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌షిప్ టైటిల్ గెలుస్తానని అనుకోలేదు**

**అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నా..**

**వ్యవస్థ నుంచి కాకుండా వ్యక్తిగత కృషితోనే విజేతలు వస్తున్నారు.**

**'సాక్షి' ఇంటర్వ్యూలో తెలుగు తేజం కోనేరు హంపి**

- వివరాలు స్పోర్ట్స్‌లో






epaper.sakshi.com

## మీడియాలో సామాజిక బాధ్యత పెరగాలి

### సెన్సేషన్ కోసం దుష్ప్రచారం సరికాదు: ముఖ్యమంత్రి కేసీఆర్

**సాక్షి, హైదరాబాద్:** సమాజంలో మీడియా పాత్ర ఎనలేనిదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖ ర్‌రావు అన్నారు. బాధ్యతాయుతమైన పాత్రలో ఉండి, దుష్ప్రచారం చేయడం మీడియాకు తగదని హితవు పలికారు. ఆదివారం ఓ మీడియా సంస్థ నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మీడియా రేటింగుల కోసమో, సెన్సేషన్ కోసమో అసత్యాలు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. సామాజిక బాధ్యతతో మెలిగి, ఉపయోగకరమైన ప్రసారాలకి పెద్దపీట వేయాలని సూచించారు. చెడుకు వేగం, వ్యాప్తి ఎక్కువ, అందుకే మంచి



పనులు చేసిన వారిని సన్మానించడం మంచి సంప్రదాయం అని అభినందించారు. మనకు స్వాతంత్ర్యం వచ్చిన నాటికి జనాభా 30 కోట్లు, ఇప్పుడు 130 కోట్లకు చేరింది. ఆనాడు దేశ బడ్జెట్ రూ. 200 కోట్లు. ఇప్పుడు రాష్ట్రాల బడ్జెట్లే లక్షల కోట్లకు చేరుకున్నాయి. దారిద్ర్యం, పేదరికం రూపుమాపేందుకు అనేక అభివృద్ధి చర్యలు రూపుదిద్దుకుంటున్నాయి. అదే సమయంలో మనుషులు మృగాలుగా మారే ఘటనలు వెలుగుచూస్తున్నాయి. మానవ సమాజం భరించలేని, సభ్య సమాజం తలదించుకునే ఘటనలు పెరిగిపోతున్నాయి. ఈ సమయంలో మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. న్యూస్‌పేపర్లు, వ్యూస్ పేపర్లుగా మారకూడదన్నది నా అభిప్రాయం. గతంలో మా ప్రభుత్వం మొదలుపెట్టిన 'కంటి వెలుగు'పథకంపై అభూత కల్పనలు రాసి నన్ను బాధకు గురిచేశారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో సినిమారంగం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సీఎం హామీ ఇచ్చారు. అవార్డులు అందుకున్న వారిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు.

## 'పెద్దింటి' లఘుచిత్రానికి జాతీయ అవార్డు

### మధ్యప్రదేశ్ ఫిలిం ఫెస్టివల్‌లో 'ఊటబాయి'కి ద్వితీయ బహుమతి

**సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన 'ఊటబాయి' లఘుచిత్రానికి జాతీయ పురస్కారం లభించింది. మధ్యప్రదేశ్‌లోని వింధ్య ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో పెద్దింటి అశోక్‌కుమార్ కథ, మాటలు అందించిన 'ఊటబాయి'కి అవార్డు వచ్చింది. 20 నిముషాల నిడివి గల ఈ చిత్రానికి వేణు పోలసాని దర్శకత్వం వహించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 350 చిత్రాలు పోటీకి రాగా.. 'ఊటబాయి'కి రెండోస్థానం దక్కింది. ఈ షార్ట్ ఫిలిం గతంలో తెలంగాణ అవతరణ దినోత్సవ అవార్డును అందుకుని, మరో నాలుగు జాతీయ అవార్డులు పొందింది. త్వరలో ఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డు అందిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. అశోక్‌కుమార్ కథకుడిగా అనేక రచనలు, సినిమాలకు మాటలు రాశారు.


అశోక్ కుమార్

## కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు

### వైద్యారోగ్య మంత్రి ఈటల రాజేందర్

**సాక్షి, హైదరాబాద్:** పైసా ఖర్చు లేకుండానే నిరుపేద రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. ఆదివారం తాజ్ డెక్కన్‌లో వైద్య విభూషణ్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఖరీదైన వైద్యసేవలను చాలా తక్కువ ధరకే అందిస్తున్న ఘనత హైదరాబాద్ వైద్యులకు దక్కుతోందన్నారు. కొంత మంది వైద్యులు డబ్బుల కోసమే పని చేస్తున్నట్లు ఇటీవల వార్తలు వచ్చినప్పటికీ.. నిజానికి ఇప్పటికీ చాలా మంది వైద్యులు సేవే లక్ష్యంగా పని చేస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రముఖ గుండె మార్పిడి వైద్యచికిత్సల నిపుణుడు డాక్టర్ ఏజీకే గోఖలే సహా పలువురు వైద్యులను సన్మానించారు.

## విదేశీయుడి వద్ద కెమెరా లభ్యం

**శంషాబాద్:** ఓ విదేశీ ప్రయాణికుడి వద్ద తనిఖీల్లో లభించిన కెమెరాను డ్రోన్ కెమెరాగా అనుమానించిన సీఐఎస్‌ఎఫ్ పోలీసులు అతడిని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) పోలీసులకు అప్పగించారు. న్యూజిలాండ్‌కు చెందిన ఓ పర్యాటకుడు ఇటీవల హైదరాబాద్‌కు వచ్చాడు. ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి గోవాకు బయల్దేరుతుండగా అధికారులు చేపట్టిన తనిఖీల్లో అతడి వద్దనున్న కెమెరాను డ్రోన్‌గా అనుమానించి పోలీసులకు అప్పగించారు. సాంకేతిక నిపుణుల పరిశీలనకు పంపగా.. దాన్ని ట్రెక్కింగ్ (రవాణాలో ఉపయోగించే) కెమెరాగా గుర్తించారు. అది నిషేధించిన వస్తువు కాకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఆర్‌జీఐఏ సీఐ విజయ్‌కుమార్ వెల్లడించారు.

# నిద్ర పట్టడం లేదా ..ఇదిగో స్లీప్ ల్యాబ్



- గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో నిద్ర ప్రయోగ శాల
- పిల్లలకూ నిద్రలేమి సమస్య
- గుర్తించాల్సింది తల్లిదండ్రులే
- నిద్రలేమితో అనేక అనర్థాలు
- వైద్య నిపుణుల వెల్లడి
- తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిది

ఆ బాలిక పేరు మానస. నిండా 13 ఏళ్లు కూడా లేవు. ఆమెకు ఆరోగ్య సమస్యలేమీ లేవు. కానీ.. ఎంత ప్రయత్నించినా నిద్ర రాదు. చాలామంది డాక్టర్లకు చూపించారు. నిద్ర మత్తు ఆవహించే మందుల్ని కూడా ఇచ్చారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఎవరో చెబితే.. తల్లిదండ్రులు ఆమెను గుంటూరులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి న్యూరాలజీ విభాగంలో చూపించగా.. అక్కడి స్లీప్ ల్యాబ్‌లో రాత్రంతా ఉంచి పరీక్షలు చేశారు. చదువుల ఒత్తిడి వల్లే బాలిక నిద్రపోవటం లేదనే విషయాన్ని వైద్యులు నిర్ధారించి.. కంటి నిద్ర రావటానికి వీలుగా తగిన సూచనలిచ్చారు. వినటానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది ముమ్మాటికీ నిజం.

గుంటూరు (మెడికల్)

సాధారణంగా వయసు మీరిన వారికి నిద్ర పట్టదని అనుకుంటారు. కానీ.. చిన్న పిల్లలూ, యువకులు సైతం నిద్రలేమితో బాధపడుతున్నారు. ఆధునిక జీవన శైలి, స్మార్ట్ ఫోన్స్ యుగంలో ప్రతి ఒక్కరూ కాలంతో పరుగులు తీస్తుండటం వల్ల పాఠశాల విద్యార్థి మొదలుకుని పెద్దవారి వరకు అనేక మంది నిద్రలేమి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ముందుగా గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని.. లేనిపక్షంలో అనేక అనర్థాలు తలెత్తుతాయని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల నడుమ నిద్రలేమి సమస్యతో బాధపడుతున్న ఎందరికో పరిష్కారాన్ని చూపిస్తోంది గుంటూరులోని ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి (జీజీహెచ్).

### తొలి ఆస్పత్రిగా రికార్డు

'మీకు నిద్ర పట్టడం లేదా.. అయితే గుంటూరు జీజీహెచ్‌కు రండి' అని ఆహ్వానిస్తున్నారు అక్కడి వైద్యులు. నిద్ర పట్టకపోవటానికి గల కారణాలను వైద్య పరీక్షల ద్వారా తెలుసుకుని హాయిగా నిద్రపోయేందుకు అవసరమైన వైద్యాన్ని జీజీహెచ్ డాక్టర్లు అందిస్తున్నారు. ఇక్కడి న్యూరాలజీ వైద్య విభాగంలో నిద్ర ప్రయోగ శాల (స్లీప్ ల్యాబ్)ను దాతల సాయంతో ఏర్పాటు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో స్లీప్ ల్యాబ్ ఏర్పాటు చేసిన మొట్టమొదటి ప్రభుత్వాస్పత్రిగా గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి రికార్డు సృష్టించింది. నాట్కో ఫార్మా కంపెనీ చైర్మన్ నన్నపనేని వెంకయ్యచౌదరి ఇక్కడి ల్యాబ్‌కు అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు రూ.20 లక్షల ఆర్థిక సాయం చేశారు.





### నిద్ర సమస్యలకు చెక్ పెట్టొచ్చు

తగినంత నిద్ర లేకపోతే ఏకాగ్రత లోపించడం, సకాలంలో నిర్ణయం తీసుకోలేకపోవడం, నిరాశ, నిస్సత్తువ, నీరసం, విసుగు, తలనొప్పి, ఇతర రుగ్మతలు తలెత్తుతాయి. నిద్రలేమితో బాధపడేవారు శారీరక, మానసిక పటుత్వాన్ని కోల్పోతారు. ఉద్విగ్నతలకు లోనవుతారు. మనిషి రోజుకు కనీసం 8 గంటలు నిద్రపోని పక్షంలో పై రుగ్మతలతో పాటు గుండెపోటు సైతం వచ్చే అవకాశాలు ఉన్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. కాఫీ, టీ ఎక్కువగా తీసుకునే వారిలో కూడా నిద్రపట్టదు. ఊబకాయంతో ఉన్నవారు సైతం రాత్రిళ్లు నిద్రపట్టక గురక సమస్యతో నిద్రాభంగమై ఇబ్బంది పడతారని, నిద్రలో నడవడం, నిద్రలోనే సైకిల్ తొక్కినట్లు కాళ్లు కదిలించడం, ఫిట్స్ రావడం వల్ల నిద్రపోవటానికి భయపడతారని వైద్యులు వివరిస్తున్నారు.

### రుగ్మతల నిర్ధారణకు స్లీప్‌ల్యాబ్

ఈ రుగ్మతలు రావడానికి గల కారణాలు నిర్ధారించేందుకు స్లీప్ ల్యాబ్ ఉపయోగపడుతుంది. కొందమంది రాత్రివేళలో నిద్రపోకుండా, పగటి పూట నిద్రిస్తుంటారు. దీనివల్ల కలిగే సైడ్ ఎఫెక్ట్స్ అనేకం ఉంటాయి. ఎలాంటి సమయాల్లో నిద్రపోవాలి, నిద్రపోకపోతే ఎలాంటి అనర్థాలు తలెత్తుతాయనే విషయాలను స్లీప్ డిజార్డర్‌తో బాధపడేవారికి స్లీప్ ల్యాబ్‌లో వైద్య పరీక్షలు చేసి వివరిస్తున్నారు. నిద్రపట్టకపోవడానికి గల కారణాలు తెలుసుకోవడం ద్వారా సమస్యను త్వరితగతిన సులభంగా నయం చేయవచ్చని, అందుకోసం స్లీప్ ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ నాగార్జునకొండ సుందరాచారి తెలిపారు.

### పరీక్షల విధానం ఇలా..

ఒక్కో వ్యక్తికి వైద్య పరీక్ష చేసేందుకు సుమారు 8 గంటలకు పైగా సమయం పడుతుంది.
- సుమారు 30 నుంచి 40 వరకు వైర్లను శరీరంలోని వివిధ భాగాలకు అతికిస్తారు.
- రాత్రి వేళల్లో సహజ సిద్ధంగా నిద్రించే సమయంలో ఈ పరీక్ష నిర్వహించటం ద్వారా కచ్చితమైన ఫలితాలు వస్తాయి.
- ఇక్కడి ల్యాబ్‌లో రాత్రి 9 నుంచి ఉదయం 5 గంటల వరకు పరీక్షలు చేస్తారు. – ఆస్పత్రి ఓపీ విభాగంలో మంగళ, గురు, శనివారం న్యూరాలజీ విభాగానికి వచ్చిన వారికి నిద్ర సమస్యలు ఉంటే స్లీప్‌ల్యాబ్‌లో పరీక్ష చేసి చికిత్స అందిస్తారు.
- వైద్య పరీక్షలు చేసే సమయంలో ప్రత్యేక శిక్షణ పొందిన న్యూరో టెక్నీషియన్‌తో పాటు ఒక డాక్టర్, రోగి అటెండెంట్ ఉంటారు.
- నిద్ర సమస్యలపై పరిశోధన చేసేందుకు ఒక పీజీ డాక్టర్‌ను ప్రత్యేకంగా నియమించారు.

### రెండేళ్లుగా ఉచిత పరీక్షలు



స్లీప్‌ల్యాబ్‌ను 2017 జూలైలో ప్రారంభించినా వైద్య పరీక్షలు మాత్రం 2018 జనవరి నుంచి చేస్తున్నాం. 2018లో 47 మందికి, 2019లో 40 మందికి స్లీప్ ల్యాబ్‌లో పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స అందించాం. నిద్ర సమస్యలతో వచ్చే వారిలో మగవారే ఎక్కువగా ఉంటున్నారు. 13 ఏళ్ల నుంచి 20 ఏళ్లలోపు వారు కూడా నిద్ర సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం రావటం ఆందోళన కలిగిస్తోంది. ఎక్కువగా 40 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వారు నిద్రలేమి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రాష్ట్రంలో కేవలం గుంటూరు జీజీహెచ్‌లో మాత్రమే నిద్రలేమి సమస్యలను నిర్ధారించే పాలిసోనోగ్రఫీ (పీసీజీ) పరీక్ష చేస్తున్నాం. సుమారు రూ.25 వేలు ఖర్చయ్యే ఈ పరీక్షను న్యూరాలజీ విభాగంలో ఉచితంగా చేస్తున్నాం.

– డాక్టర్ నాగార్జునకొండ సుందరాచారి, విభాగాధిపతి, న్యూరాలజీ వైద్యం

# మహిళా హాస్టళ్లకు మరింత భద్రత

మొదటి పేజీ తరువాయి

దృష్టి సారించింది. అన్ని జిల్లాలు, కమిషనరేట్ల పరిధిలో కలిపి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15 వేలకుపైగానే ఈ లేడీస్ హాస్టళ్లు ఉంటాయని పోలీసులు అంచనా వేస్తున్నారు.

### కేసులైనప్పుడు ఇబ్బందులు..

లేడీస్ హాస్టళ్లలో వర్కింగ్ విమెన్స్, విద్యార్థినులు అదృశ్యమైనా, ఆత్మహత్యలకు పాల్పడినా.. వారిని ఎవరైనా వేధించినా, ఆ విషయం పోలీసుల దృష్టికి రావడంలో తీవ్రజాప్యం నెలకొంటోంది. నగలు, స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు వంటివి చోరీ అయినా.. చాలామంది తమ ఊరు కాదు కాబట్టి అస్సలు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఇంట్లో వారి సంరక్షణ నుంచి హాస్టల్‌లోకి వచ్చాక సహజంగానే వారి సంరక్షణ యాజమాన్యాలు తీసుకోవాలి. కానీ చాలా తక్కువ హాస్టళ్లు మాత్రమే అలా చేస్తున్నాయి. చాలా హాస్టళ్లు డబ్బులు తీసుకున్నాక విద్యార్థుల బాగోగులు పట్టించుకోవడం లేదు. అందుకే ఇకపై అన్ని హాస్టల్ యాజమాన్యాలతో కలిపి ఓ రిజిస్టర్‌ను రూపొందించాలని విమెన్‌సేఫ్టీ వింగ్ నిర్ణయించింది. ఇందుకోసం కార్యాచరణ సిద్ధం చేసి, స్థానిక పోలీసుల సాయంతో దశలవారీగా ఈ రిజిస్టర్ రూపొందిస్తారు. అందులో హాస్టల్ యజమాని పేరు, అనుమతులున్నాయా? ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నారా? విద్యార్థుల చిరునామాలు సేకరించారా? సీసీ కెమెరాలు, పార్కింగ్ తదితర విషయాల్లో ప్రమాణాలకు లోబడి ఉన్నారా? లేదా? ఎలాంటి ఆహారం పెడుతున్నారు? అన్న విషయాలు పొందుపరుస్తారు. అంతేగాకుండా ఈ అన్ని హాస్టళ్ల విద్యార్థులకు ఆపదలు ఎదురైనపుడు ఎలా ఎదుర్కోవాలి? ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలి? పోకిరీ వేధింపులు, సైబర్ వేధింపులు ఎదురైనపుడు ఎలా వ్యవహరించాలి? తదితర విషయాలపై షీటీమ్స్ ఆధ్వర్యంలో పూర్తి అవగాహన కల్పిస్తారు.

### ముందుగా భాగ్యనగరంలోనే..

ఈ రిజిస్టర్ అమలు తొలుత హైదరాబాద్ కమిషనరేట్‌లోనే మొదలుకానుంది. ముందుగా అమీర్‌పేట, ఎస్సార్‌నగర్ ఏరియాల్లో ప్రారంభించనున్నారు. ఈ రెండు ప్రాంతాల్లోనే దాదాపు 3 వేల హాస్టళ్లు ఉంటాయని పోలీసుల అంచనా. ఇక హైదరాబాద్ కమిషనరేట్, సైబరాబాద్, రాచకొండ ఏరియాలు కలిపితే 10 వేల వరకు హాస్టళ్లు ఉంటాయని సమాచారం. ఇక రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలిపి మరో 5 వేలు అంటే మొత్తం 15 వేల వరకు హాస్టళ్లు ఉంటాయని, అన్నింటి పూర్తి వివరాలు సేకరించాలని విమెన్‌సేఫ్టీ వింగ్ నిర్ణయించింది.

### దర్యాప్తులో ఇబ్బందులు తొలగించేందుకే

చాలామంది హాస్టల్ నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. తమ హాస్టల్లో ఉండేవారి వివరాలు కూడా సరిగా నమోదు చేయడం లేదు. ఇలాంటి కారణాల వల్ల మిస్సింగ్ కేసులు, చోరీ కేసుల దర్యాప్తులో పోలీసులకు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. తల్లిదండ్రులకు దూరంగా ఉన్న చాలామంది తమకు వేధింపులు ఎదురైనా మౌనంగా భరిస్తున్నారు. ఇకపై ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నదే మా లక్ష్యం.

– సుమతి, ఎస్పీ, విమెన్‌సేఫ్టీ వింగ్

### హాస్టల్‌లో ఉండే ఆడవారి రక్షణ మా ధ్యేయం

తల్లిదండ్రులకు దూరంగా ఉన్న ఆడవారి భద్రతే మా ధ్యేయం. ఇలా హాస్టళ్లలో ఉండే చాలామంది వేధింపులు ఎదుర్కొంటున్నా.. వాటిని అటు ఇంట్లోనూ, ఇటు పోలీసులకూ తెలియపరచడం లేదు. దీన్ని అలుసుగా తీసుకుని పోకిరీలు మరింత చెలరేగుతున్నారు. అందుకే ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా షీటీమ్స్‌ని ఆశ్రయించేలా వారికి చట్టాలపై అవగాహన కల్పిస్తాం. అందుకే ఈ రిజిస్టర్ రూపొందించే ప్రయత్నాలు మొదలుపెట్టాం.

– స్వాతి లక్రా, ఐజీ, విమెన్‌సేఫ్టీ వింగ్

# వరంగల్‌కు మాస్టర్‌ప్లాన్.. పాతబస్తీకి మెట్రో

## ట్విట్టర్‌లో నెటిజన్ల ప్రశ్నలకు బదులిచ్చిన మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో తీవ్ర నీటి కొరత ఏర్పడుతుందని నీతి ఆయోగ్ చెప్పిందన్న ఒక ప్రశ్నకు సమాధానంగా.. ఇతర నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లో నీటి కొరత చాలా తక్కువగా ఉందని, కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత హైదరాబాద్‌కి నీటి సరఫరా సమస్య తలెత్తదని కేటీఆర్ చెప్పారు. హైదరాబాద్‌ను టూరిస్ట్ డెస్టినేషన్‌గా మార్చేందుకు, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ ప్రైవేట్ సంస్థలకు అప్పగించామని, చార్మినార్, గోల్కొండలకు ప్రపంచ వారసత్వ హోదా సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. యూరప్, అమెరికా వంటి ప్రాంతాల నుంచి మరిన్ని ఎక్కువ విమాన సౌకర్యాలను కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో చేపట్టిన ఎస్‌ఆర్‌డీపీ ప్రాజెక్టులకు నిధుల కొరత లేదని, అవసరమైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. హైదరాబాద్‌లో నూతనంగా 50 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్కైవాక్ నిర్మాణాలకు ఆమోదం తెలిపామన్నారు.

### తెలంగాణ ప్రజలు తెలివైన వారు

రాష్ట్రంలో పౌరసత్వ సవరణ చట్టం అమలుపై సీఎం నేతృత్వంలోని కేబినెట్ సరైన నిర్ణయం తీసుకుంటుందని, ఈ చట్టాన్ని పార్లమెంట్‌లో వ్యతిరేకించినందుకు మద్దతుగా నిలుస్తున్న నెటిజన్లకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో రాజకీయంగా బలోపేతం కావడానికి బీజేపీ హిందూ–ముస్లిం కమ్యూనల్ కార్డుని వాడుతుందని, దీన్ని ఎదుర్కొనేందుకు ఏం చేస్తారని ఒకరు అడిగిన ప్రశ్నకు.. ప్రజలను విభజించే ఎలాంటి ఎజెండానైనా ఎదుర్కొనేంత తెలివైనవారు తెలంగాణ ప్రజలు అని కేటీఆర్ బదులిచ్చారు. తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోల్చితే శాంతియుతమైందని, ఈ శాంతిని ఇలాగే కొనసాగించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు.

### స్వల్పకాలమే అవి సక్సెస్..

హైదరాబాద్‌లో శాంతియుత ధర్నాలకు అనుమతుల విషయాన్ని అడగ్గా, కొద్దిరోజుల సమయంలోనే ఆర్‌ఎస్‌ఎస్, ఎంఐఎం లాంటి సంస్థలు తమ కార్యక్రమాలను నిర్వహించిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. దేశంలో 45 ఏళ్లల్లో ఎన్నడూ లేనంత నిరుద్యోగం, ఐదు త్రైమాసికాల్లో వరుసగా తగ్గుతున్న ఆర్థికాభివృద్ధి, పెరుగుతున్న ద్రవ్యోల్బణం వంటి అంశాలను పక్కదారి పట్టించేందుకు కేంద్రం ప్రయత్నాలను చేస్తుందన్న ప్రశ్నకు సమాధానంగా ఒకవేళ ఇలాంటి ప్రయత్నాలు చేస్తే అవి స్వల్పకాలం మాత్రమే సక్సెస్ అవుతాయని, అంతిమంగా ఉద్యోగాల కల్పన, ఆర్థికాభివృద్ధి వంటి కఠిన ప్రశ్నలకు కచ్చితంగా ప్రభుత్వాలు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందన్నారు.



### అత్యధికంగా ప్రభావితం చేసే రాజకీయ నేత ఆయనే..

రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షం లేకున్నా, తమ 60 లక్షల కార్యకర్తలతో ఎప్పటికప్పుడు ప్రభుత్వ పనితీరుపై తమకు అవసరమైన క్షేత్రస్థాయి సమాచారం వస్తుందని కేటీఆర్ అన్నారు. 2009లో రోడ్లపైన తెలంగాణ కోసం ఉద్యమాలు చేస్తున్న పరిస్థితి నుంచి, 2019లో మంత్రి స్థాయిలో పాలన చేస్తున్న పరిస్థితి వరకు జరిగిన పరిణామ క్రమాన్ని 'టెన్ ఇయర్ చాలెంజ్'అంటూ స్పందించారు. టీఆర్‌ఎస్ కార్యకర్తల కృషి వల్లనే తనకు మంత్రి పదవి దక్కిందన్న కేటీఆర్, మంత్రి పదవి కన్నా తనకు పార్టీ పదవే విలువైందని తెలిపారు. తనను అత్యధికంగా ప్రభావితం చేసే రాజకీయ నాయకుడు సీఎం కేసీఆరే అని చెప్పారు. 2019లో అన్ని జిల్లా పరిషత్‌లను గెలుచుకోవడం ఒక మంచి జ్ఞాపకంగా మిగిలిందన్నారు.

### జగన్ పాలన.. మంచి ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ ఆరు నెలల పాలనపైన స్పందించిన కేటీఆర్.. 'ఒక మంచి ప్రారంభం'అని అన్నారు. ఏపీలో మూడు రాజధానుల ఏర్పాటు సరైందో కాదో ఆ రాష్ట్ర ప్రజలే నిర్ణయిస్తారని, తాను కాదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు నాయకత్వ లేమితో తెలంగాణ తల్లడిల్లుతుందన్న కామెంట్లు చేసిన పలువురు, ఆంధ్ర రాష్ట్రంలో తమ పార్టీ పోటీ చేయాలని కోరడం, ఆ దిశగా తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ నడిపినందుకు సంతోషంగా ఉందన్నారు.

### పాతబస్తీకి మెట్రో.. గచ్చిబౌలికి బీఆర్‌టీఎస్!

హైదరాబాద్‌లో బీఆర్‌టీఎస్ (బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్)లో కూకట్‌పల్లి, హైటెక్ సిటీ, గచ్చిబౌలి ఏరియాలను కలిపే ప్రణాళిక ప్రారంభమైందన్నారు. పాతబస్తీకి కూడా మెట్రో రైలు సౌకర్యం వస్తుందని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ తూర్పు వైపు ఐటీ పరిశ్రమలను తీసుకెళ్లాలని తాము చేస్తున్న ప్రయత్నానికి మంచి స్పందన వస్తోందన్నారు. గోపనపల్లిలో విస్తృతంగా పెరుగుతున్న పలు గేటెడ్ కమ్యూనిటీలకు ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ నుంచి రోడ్డు లేదని, దీన్ని నూతన స్లిప్ రోడ్డు నిర్మాణంలో కవర్ చేస్తామన్నారు. ఎల్బీనగర్‌లో ఇప్పటికే ఒక ఫ్లైఓవర్ పూర్తయిందని మరో మూడు ఫ్లై ఓవర్ల నిర్మాణాలు వస్తాయన్నారు. 111 జీవోలో ఏదైనా మార్పు, చేర్పులు అవసరమైతే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ గురించి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అనంతగిరి, వికారాబాద్ ప్రాంతాలను గత ప్రభుత్వాల మాదిరిగా నిర్లక్ష్యం చేస్తారా అన్న ప్రశ్నకు ఈ ప్రాంతాల అభివృద్ధి కోసం అనేక ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని వాటి ఫలాలు త్వరలో చూస్తారని చెప్పారు.

### చేనేతకు పెద్ద ఫ్యాన్..

సోషల్ మీడియా ద్వారా ప్రజల నుంచి నేరుగా స్పందన తెలుస్తుందని, తన పైన మర్యాదపూర్వకమైన మీమ్‌లు (హాస్యపూరిత చిత్రాలు) వచ్చినా తనకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఇప్పటికే దాదాపు మంత్రులంతా సోషల్ మీడియాలో చురుగ్గా భాగస్వాములయ్యారన్నారు. చేనేత వస్త్రాలకు తాను పెద్ద అభిమానినని చెప్పారు. పెద్దఎత్తున చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆరోగ్యం విద్య పట్టణ గ్రామీణ మౌలిక వసతుల రంగాలకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందన్నారు.

### వచ్చే ఏడాది పూర్తయ్యేవి ఇవే..!

అంతర్జాతీయ స్థాయి తయారీ రంగ కంపెనీల నుంచి హైదరాబాద్ తీసుకొస్తామని.. ఇప్పటికే టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్, ఫుడ్ ప్రాసెసింగ్‌లో పలు కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయని కేటీఆర్ చెప్పారు. 2020లో ఫార్మా సిటీ ప్రారంభమవుతుందన్నారు. హైదరాబాద్‌లో రెండో దశ టీహబ్–టీవర్క్స్ 2020 మొదటి అర్ధసంవత్సరంలో, జూన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తవుతాయన్నారు. 4వ పారిశ్రామిక విప్లవం దిశగా అనేక ప్రభుత్వాలు వివిధ చర్యలు తీసుకుంటున్నాయని, ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం కూడా ఇన్నొవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్‌క్లూజివ్ గ్రోత్ అనే త్రీ ఐ మంత్రాన్ని పాటిస్తోందని, పట్టణాభివృద్ధితో పాటు మౌలిక వసతులు, ఉద్యోగాల కల్పన వంటి అంశాలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

### జనవరిలో వరంగల్‌కు మాస్టర్‌ప్లాన్

నూతన మున్సిపల్ చట్టంతో పౌరులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని, మున్సిపల్ అధికారుల విచక్షణతో సంబంధం లేకుండా ప్రజల అవసరాలు తీరుతాయని, ఈ మార్పులను వ్యవస్థీకృతం చేసేందుకు నూతన చట్టాన్ని కఠినంగా అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో డంప్ యార్డులు, వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాస్టర్ ప్లాన్ జనవరి మొదటి వారంలో ఉంటుందన్నారు.

### ఇంకా వెతుకుతున్నా..

తన కూతురితో ఉన్న ఫొటోపై ఓ నెటిజన్ కోరిక మేరకు కేటీఆర్ స్పందించారు. నా కూతురు వేగంగా ఎదుగుతోందని ఉప్పొంగిపోయారు. రాష్ట్ర పోలీసులు చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని అభినందించారు. డీజీపీ, హైదరాబాద్ సీపీకి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబాన్ని, వృత్తిని ఎలా సమన్వయం చేసుకుంటారన్న నెటిజన్ ప్రశ్నకు.. 'ఇంకా వెతుకుతున్నా'అని సమాధానమిచ్చారు.

## ఆహా.. మిడ్ మా'నీరు'!

మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం ద్వారా ఎత్తిపోసిన నీటి పరిమాణమే 46.46 టీఎంసీలుగా ఉంది. మరో 3.07 టీఎంసీ వరద నీరు కాగా, 2.45 టీఎంసీల నీరు ఎస్సారెస్పీ ద్వారా వచ్చింది. ఇప్పటికే మిడ్‌మానేరు ద్వారా లోయర్ మానేరు డ్యామ్‌కు 29.14 టీఎంసీల మేర నీటిని తరలించారు. ఎల్‌ఎండీ నుంచి ఎస్సారెస్పీ–2 కాల్వల ద్వారా తుంగతుర్తి, సూర్యాపేట వరకు నీటిని తరలించి చెరువులు నింపారు. అయితే కాళేశ్వరంలో భాగంగా మిడ్‌మానేరు నుంచి నీటిని ప్యాకేజీ–10, 11, 12ల ద్వారా దిగువ అనంతగిరి, రంగనాయక్‌సాగర్ ద్వారా కొండపోచమ్మ వరకు తరలించాల్సి ఉంది. అయితే అనంతగిరి గ్రామం ఖాళీ చేయకపోవడంతో నీటి పంపింగ్ సాధ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలో మిడ్‌మానేరు కింద ఆయకట్టుకు కాల్వల ద్వారా నీటిని సరఫరా చేయాలని నీటిపారుదల శాఖ అధికారులు భావిస్తున్నారు. సోమవారం సీఎం కేసీఆర్ రిజర్వాయర్ పరిధిలో చేసే పర్యటన సందర్భంగా కాల్వలకు నీటి విడుదలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మిడ్‌మానేరు కుడి, ఎడమ కాల్వల కింద 75 కిలోమీటర్ల కాల్వల తవ్వకం చేయాల్సి ఉండగా, 60కిలోమీటర్లు పూర్తయింది. దీనికింద 80 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, ఈ యాసంగిలో 25వేల నుంచి 30వేల ఎకరాలకు నీరిచ్చే అవకాశం ఉందని ప్రాజెక్టు వర్గాలు వెల్లడించాయి.

## దామాషా ప్రకారం రిజర్వేషన్లు వర్తింపజేయాలి

### సింగరేణి పదోన్నతులపై ప్రభుత్వానికి జాతీయ ఎస్టీ కమిషన్ సూచన

**సాక్షి, హైదరాబాద్:** సింగరేణి కాలరీస్ ఉద్యోగ పదోన్నతుల్లో దామాషా ప్రకారం రిజర్వేషన్లు వర్తింపజేయాలని జాతీయ గిరిజన కమిషన్ చైర్మన్ నందకుమార్ సాయి అన్నారు. ఆదివారం దిల్‌కుషా అతిథిగృహంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. సింగరేణి కార్మికులు, సంఘ నేతలతో మాట్లాడారు. పదోన్నతుల్లో రిజర్వేషన్ల అంశంపై ప్రస్తావన రాగా.. దానిపై ఆయన మాట్లాడుతూ దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని, నిబంధనలకు అనుగుణంగా చట్టప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీపైనా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సింగరేణి ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులైన గిరిజనులకు అనువైనచోట భూములివ్వాలని ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలో గిరిజనులకు ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని పలువురు వినతులివ్వగా, ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి అజయ్‌మిశ్రా, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టినాజెడ్ చోంగ్తూ, సింగరేణి ఎండీ ఎన్.శ్రీధర్ పాల్గొన్నారు.

## నేడు ఆలస్యంగా తెలంగాణ ఎక్స్‌ప్రెస్

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీకి ప్రయాణించే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ సోమవారం ఆలస్యంగా బయల్దేరనుంది. రైళ్ల ఆలస్యం కారణంగా ఉదయం 6.25 గంటలకు బయల్దేరాల్సిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.25 గంటలకు బయల్దేరుతుందని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.



హిమాచల్‌ప్రదేశ్‌లోని లాహౌల్‌-స్పితి జిల్లాలో చలి తీవ్రతకు ట్యాప్‌ నీరు గడ్డకట్టిన దృశ్యం



ఆదివారం శ్రీనగర్‌లోని దాల్‌ లేక్‌లో మైనస్‌ 6.2 డిగ్రీల సెల్సియస్‌ ఉష్ణోగ్రత వద్ద గడ్డకట్టిన నీరు



పెద్దపల్లిలో చలి కాచుకుంటున్న దృశ్యం

# చలిరాత్రి

## పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

### ఆదిలాబాద్‌ జిల్లా అర్లిలో 5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

**సాక్షి, హైదరాబాద్‌:** ఉత్తర భారతం నుంచి చలిగాలులు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. గత నెలలో ప్రవేశించాల్సిన చలి గాలులు ఆలస్యంగా రావడంతో పలు చోట్ల ఒక్కసారిగా చలి తీవ్రత పెరిగింది. ఇప్పటివరకు తూర్పు దిశ నుంచి తేమ గాలులు వచ్చాయి. దీంతో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదైన సంగతి తెలిసిందే. చలి గాలులు ప్రవేశించడంతో రాష్ట్రంలో పలుచోట్ల ఒక్కసారిగా రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గత 24 గంటల్లో ఆదిలాబాద్‌ జిల్లా భీమ్‌పూర్‌ మండలం అర్లిలో 5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని హైదరాబాద్‌ వాతావరణ కేంద్రం వెల్లడించింది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో 5.5 డిగ్రీలు, ఆదిలాబాద్‌ జిల్లా తంసిలో 6.2 డిగ్రీలు, కొమురం భీం జిల్లా సిర్పూరులో 6.6 డిగ్రీలు, ఆదిలాబాద్‌ జిల్లా బరంపూర్‌లో 7 డిగ్రీలు, జైనాడ్‌, బేలలలో 7.1 డిగ్రీల చొప్పున, భోరాజ్‌లో 7.2 డిగ్రీలు, ఆదిలాబాద్‌ పట్టణం, రాంనగర్‌లలో 7.3 డిగ్రీల చొప్పున, తలమడుగులో 7.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొంది. వచ్చే నెలలోనూ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతాయని వాతావరణ కేంద్రం సీనియర్‌ అధికారి రాజారావు వెల్లడించారు. వాతావరణ మార్పుల కారణంగానే ఈసారి గతం కంటే చలి తీవ్రత తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

**నేడు పలు జిల్లాల్లో చలి గాలులు..**

పొడి వాతావరణం కారణంగా సోమవారం ఆదిలాబాద్‌, కొమురంభీం, నిర్మల్‌, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో చలిగాలులు వీచే అవకాశం ఉందని రాజారావు వెల్లడించారు. సోమ, మంగళవారాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# సంక్రాంతికి ఆర్టీసీ చార్జీల బాదుడు

**దూర ప్రాంతాల సర్వీసులకు 50% వడ్డన**

**సాక్షి, హైదరాబాద్‌:** తెలంగాణ ఆర్టీసీ పండగ బాదుడుకు సిద్ధమైంది. సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ నడిపే ప్రత్యేక సర్వీసులకు టికెట్‌ ధరపై 50% అదనపు మొత్తాన్ని వసూలు చేయాలని అధికారులు ఆదివారం నిర్ణయించారు. దూరప్రాంతాలకు తిరిగే అన్ని ప్రత్యేక బస్సుల్లో ఈ అదనపు రేట్లు అమల్లో ఉంటాయి. రాష్ట్రం పరిధిలో..తక్కువ దూరంలోని ప్రాంతాల మధ్య తిరిగే ప్రత్యేక బస్సుల విషయంలో మాత్రం స్థానిక అధికారులు అప్పటికప్పుడు నిర్ణయం తీసుకునే వెసులుబాటు కల్పించారు. వీటిల్లో కూడా చాలా ప్రాంతాల్లో 50% అదనపు మొత్తం వసూలుకే స్థానిక అధికారులు మొగ్గు చూపుతున్నారు. ఇటీవలే బస్సు చార్జీలు పెరిగిన నేపథ్యంలో ప్రయాణికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుందనుకుంటే మాత్రం... 50% అదనపు రుసుము కాకుండా, సాధారణ టికెట్‌ ధర కంటే కొంత మొత్తం పెంచి దాన్ని సమీప పెద్ద సంఖ్యకు రౌండాఫ్‌ చేసి వసూలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతానికి 4,779 అదనపు సర్వీసులు తిప్పాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. 10వ తేదీ నుంచి ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. ఒకేసారి ఇన్ని సర్వీసులు రోడ్డెక్కుతున్నందున బస్టాండ్లు, ఇతర పాయింట్ల వద్ద ట్రాఫిక్‌ జామ్‌ లేకుండా ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు.



## నిరసనలు మంచి పద్ధతి కాదు

**ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

**సాక్షి, హైదరాబాద్‌:** విధ్వంసకర, వినాశకర పద్ధతుల్లో నిరసనలు తెలపడం ప్రజాస్వామ్య దేవాలయమైన భారత్‌కు మంచిది కాదని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ 150వ జయంతి వేడుకలు జరుపుకుంటున్న వేళ దేశం ఆయన చూపిన అహింసా మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. ప్రజా ఉద్యమాల్లో హింసకు తావివ్వరాదని, అర్థవంతమైన చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారాలు వెతకాలని సూచించారు. ఆదివారం శిల్పకళావేదికలో నిర్వహించిన మాజీ గవర్నర్‌, మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి శత జయంతి వేడుకలకు ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చెన్నారెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడిన వెంకయ్య, వివిధ అంశాలపై భిన్న అభిప్రాయాలు తప్పుకాదని, ప్రభుత్వంలో ఉన్నవారు ప్రతిపక్షాలు చేసే విమర్శలకు సరైన సమాధానమివ్వడం ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో హిమాచల్‌ ప్రదేశ్‌ గవర్నర్‌ బండారు దత్తాత్రేయ, మాజీ గవర్నర్‌ రోశయ్య, కాంగ్రెస్‌ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్సీ కుంతియా తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 1నుంచి నుమాయిష్‌: ఈటల



**గన్‌ఫౌండ్రీ:** అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్‌) జనవరి 1 నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్‌ గ్రౌండ్‌లో ప్రారంభం కానుంది. ఈ మేరకు నుమాయిష్‌ వివరాలను మంత్రి, ఎగ్జిబిషన్‌ సొసైటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్‌ ఆదివారం మీడియాకు వెల్లడించారు. జనవరి 1 నుంచి 46 రోజులపాటు జరిగే 80వ నుమాయిష్‌ను మంత్రులు మహమూద్‌ అలీ, తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌, మేయర్‌ బొంతు రామ్మోహన్‌లు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఎగ్జిబిషన్‌ సొసైటీ కార్యదర్శి బి.ప్రభాశంకర్‌, ఉపాధ్యక్షుడు ఎన్‌.సురేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

## ‘సీపీపై వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి’

**సాక్షి, హైదరాబాద్‌:** టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌ కుమార్‌రెడ్డి హైదరాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ (సీపీ) అంజనీకుమార్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం డిమాండ్‌ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు వై.గోపిరెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్‌ పార్టీ కార్యక్రమానికి పర్మిషన్‌ ఇవ్వలేదనే అక్కసుతో, ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ మీద ఉత్తమ్‌ చేసిన అనుచిత వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# ముగిసిన ఆటా వేడుకలు

- హాజరైన హిమాచల్‌ప్రదేశ్‌ గవర్నర్‌ బండారు దత్తాత్రేయ

**గన్‌ఫౌండ్రీ:** అమెరికాలో స్థిరపడి పుట్టిన ప్రాంతానికి సేవ చేయాలనే సంకల్పంతో అమెరికన్‌ తెలుగు అసోసియేషన్‌ (ఆటా) ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. ఈ నెల 11న ప్రారంభమైన ఆటా వేడుకలు ఆదివారం రవీంద్రభారతిలో ముగిశాయి. హిమాచల్‌ ప్రదేశ్‌ గవర్నర్‌ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేయాలని ఆకాంక్షించారు. లక్ష మైళ్ల దూరంలో ఉన్నప్పటికీ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను మరిచిపోకుండా తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఎప్పుడో నిర్మించిన పాఠశాలల పునరుద్ధరణకోసం ఏపీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు భారతీయ సమాజాన్ని చూసి అక్కడి సమాజం సంస్కృతి సంప్రదాయాలను నేర్చుకుందని, కానీ ప్రస్తుత మన సమాజం సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోయిందన్నారు. అమెరికాలో స్థిరపడినప్పటికీ భారతదేశానికి వచ్చి సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించి ఇక్కడ ఉన్న వారికి స్ఫూర్తినిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీనటుడు కృష్ణంరాజుకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. నీరజ్‌ సంపతి (వ్యాపారం, క్రీడలు), శ్రీ కళాకృష్ణ, అశ్వినీరాథోడ్‌ (కళలు), రాహుల్‌ సిప్లిగంజ్‌, కొమండూరి రామాచారి (సంగీతం), సౌదామిని ప్రొద్దుటూరి (మహిళా సాధికారత), కృష్ణమనేని పాపారావు (సామాజిక సేవా) రంగాల వారికి పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ చీఫ్‌ విప్‌ శ్రీకాంత్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర శాసన సభ్యులు రసమయి బాలకిషన్‌, బొల్లం మల్లయ్య యాదవ్‌, ఆటా ప్రతినిధులు అనిల్‌ బోదిరెడ్డి, పరమేశ్‌ భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సినీ నటుడు కృష్ణంరాజును సత్కరిస్తున్న హిమాచల్‌ ప్రదేశ్‌ గవర్నర్‌ బండారు దత్తాత్రేయ

# సర్కారు బడి.. ఇంగ్లిష్‌ ‘స్టడీ’

- ఎస్‌ఎంసీ తీర్మానం పంపితే ‘ఆంగ్ల మాధ్యమం’ మంజూరు
- సదుపాయాలు, టీచర్లు ఉండి తీర్మానం చేస్తే చాలు..
- మీడియం మార్పు అధికారాలు డీఈవోలకే.. త్వరలోనే ఉత్తర్వులు
- ప్రైవేటు స్కూళ్లల్లో 96%.. ప్రభుత్వ స్కూళ్లలో 37% ఇంగ్లిష్‌ మీడియం వారే


**సాక్షి, హైదరాబాద్‌:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు ఒక్కొక్కటిగా ఇంగ్లిషు మీడియం వైపు మళ్లుతున్నాయి. ఏటా ఒక్కో తరగతి చొప్పున ఇంగ్లిషు మీడియంలోకి మారుతున్నాయి. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా మీడియం మార్పునకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతోంది. జిల్లాల్లో ఇంగ్లిషు మీడియం ప్రారంభించేందుకు అనేక పాఠశాలలు సిద్ధంగా ఉన్నా సాంకేతిక సమస్యలు, ప్రభుత్వ అనుమతి వంటి కారణాలతో జాప్యం జరుగుతోంది. దీంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్కూల్‌ మేనేజ్‌మెంట్‌ కమిటీ (ఎస్‌ఎంసీ) తీర్మానం చేసి పంపితే చాలు మీడియం మార్పునకు ఓకే చెప్పాలని నిర్ణయించింది. తెలుగు మీడియం నుంచి ఇంగ్లిషు మీడియంలోకి మార్చుతామని తెలిపింది. మీడియం మార్పు ఫైలు ప్రభుత్వానికి రావాల్సిన అవసరం లేకుండా జిల్లాల్లో డీఈవోల స్థాయిలోనే ఆమోదం తెలపాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను పాఠశాల విద్యాశాఖ సిద్ధం చేసింది. అవి ప్రభుత్వ ఆమోదం తర్వాత అమల్లోకి రానున్నాయి. దీంతో ఇక తెలుగు మీడియం స్కూళ్లు ఇంగ్లిషు మీడియంలోకి మారడం మరింత సులభతరం కానుంది.

**ప్రభుత్వ స్కూళ్లలో..**

రాష్ట్రంలో 40,597 పాఠశాలలున్నాయి. అందులో ప్రభుత్వ పాఠశాలలు 26,754 ఉండగా, ప్రైవేటు స్కూళ్లు 10,549 ఉన్నాయి. మిగతావి ఎయిడెడ్‌, గురుకులాలు, కేంద్రీయ విద్యాలయాలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 5 వేల వరకు ఉన్నత పాఠశాలలుండగా, అందులో సగం స్కూళ్లలో ఇంగ్లిషు మీడియం కొనసాగుతోంది. మరోవైపు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ ఇంగ్లిషు మీడియం కొనసాగుతోంది. కొన్ని జిల్లాల్లో తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు జిల్లా కలెక్టర్లు చొరవ తీసుకొని ఇప్పటికే చాలా స్కూళ్లను తెలుగు మీడియం నుంచి ఇంగ్లిషు మీడియానికి మార్పు చేశారు. అందులో కొన్నింటికి మీడియం మార్పుపై అధికారికంగా ఉత్తర్వులు జారీ కావాల్సి ఉంది. ప్రభుత్వం డీఈవోలకే అధికారం ఇచ్చేలా నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో మీడియం మార్పు సులభతరం కానుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని 37.82 శాతం మంది విద్యార్థులు ఇంగ్లిషు మీడియంలోనే చదువుతుండగా, 57.46 శాతం మంది విద్యార్థులు తెలుగు మీడియం చదువుకుంటున్నారు. మరో 4.72 శాతం మంది విద్యార్థులు ఇతర మీడియంలలో చదువుకుంటున్నారు. ఇక ప్రైవేటు పాఠశాలల్లో 96.94 శాతం మంది విద్యార్థులు ఇంగ్లిషు మీడియంలోనే చదువుకుంటుండగా, 2.06 శాతం మంది తెలుగు మీడియంలో చదువుకుంటున్నారు. మిగతా ఒక్క శాతం ఇతర మీడియం విద్యార్థులున్నారు.


**ఆసక్తి, సదుపాయాలు, తీర్మానమే కీలకం**

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లలో కొంతమందే ఇంగ్లిషు మీడియం చదువుకున్నా, అనేకమంది ఉపాధ్యాయ విద్యను ఇంగ్లిషు మీడియంలోనే పూర్తిచేశారు. ఈ నేపథ్యంలో ఇంగ్లిషు మీడియంలో బోధన పెద్ద సమస్య కాబోదన్నది ఉపాధ్యాయుల వాదన. పైగా ఇంగ్లిషు మీడియం బోధించే టీచర్లకు ప్రభుత్వం కూడా శిక్షణ ఇస్తోంది. ఈ నేపథ్యంలో తమ పాఠశాలల్లో తాము ఇంగ్లిషు మీడియంలో బోధిస్తామని టీచర్లు ముందుకొస్తే, ఆయా పాఠశాలల్లో సరిపడా టీచర్లుంటే.. తల్లిదండ్రులు ఇంగ్లిషు మీడియం కోరుకుంటే.. ఆ పాఠశాల మేనేజ్‌మెంట్‌ కమిటీ ఒక్క తీర్మానం చేసి పంపిస్తే చాలు.. ఆ పాఠశాలను ఇంగ్లిషు మీడియంలోకి మార్చేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. అయితే అన్నింటికి ఒకేసారి కాకుండా ఒక్కో తరగతి వారీగా మార్పునకు చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఇక మీడియం బదలాయింపు అధికారాన్ని డీఈవోలకు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడితే జిల్లా స్థాయిలోనే మీడియం మార్పు జరిగిపోనుంది.




# వసూళ్లు ఎక్కువ.. వాహనాలు తక్కువ

- రాష్ట్రంలో ఫాస్టాగ్‌ టోల్‌ వసూళ్లలో వింత పరిస్థితి
- ఫాస్టాగ్‌ లేన్లలో వాహనాలు 48 శాతం.. ఆదాయం 58 శాతం
- క్యాష్‌ లేన్లలో వాహనాలు 52 శాతం.. ఆదాయం తక్కువ



**సాక్షి, హైదరాబాద్‌:** ఫాస్టాగ్‌ టోల్‌ వసూళ్లు క్రమంగా పెరుగుతున్నాయి. ఫాస్టాగ్‌ లేన్ల ద్వారా వస్తున్న ఆదాయం భారీగానే పెరుగుతోంది. ఫాస్టాగ్‌, క్యాష్‌ లేన్ల ద్వారా వస్తున్న ఆదాయం, వాహనాల రాకపోకల విషయంలో వింత పరిస్థితి తలెత్తుతోంది. ప్రస్తుతం తెలంగాణలో 58 శాతం టోల్‌ ఆదాయం ఎలక్ట్రానిక్‌ టోల్‌ చెల్లింపు విధానం (ఫాస్టాగ్‌ లేన్స్‌) ద్వారా వసూలవుతోంది. ఇది నాలుగైదు రోజుల్లో 60 శాతానికి చేరుకుంటుందని అధికారుల అంచనా. ఫాస్టాగ్‌ గేట్లతో పోలిస్తే క్యాష్‌ లేన్ల నుంచే ఎక్కువ వాహనాలు దూసుకుపోతున్నాయి. రాష్ట్రంలో టోల్‌ ప్లాజాల మీదుగా వెళ్తున్న వాహనాల్లో 48% ఫాస్టాగ్‌ లేన్ల నుంచి, 52% క్యాష్‌ లేన్ల నుంచి వెళ్తున్నాయి. ఫాస్టాగ్‌ లేన్ల ద్వారా టోల్‌ వసూలు ఎక్కువగా, వాహనాల గమనం తక్కువగా ఉంది. క్యాష్‌ లేన్ల నుంచి వాహనాల సంఖ్య ఎక్కువగా, ఆదాయం తక్కువగా ఉంది. ఈ విరుద్ధ వ్యవహారం రాష్ట్రంలో నెలకొంది.

**ఆదాయం అదుర్స్‌..**

ఫాస్టాగ్‌ విధానం రావటానికి కొన్ని నెలల ముందే ప్రయోగాత్మకంగా అధికారులు పరిశీలిస్తూ వస్తున్నారు. కొన్ని లేన్లను ప్రత్యేకంగా వాటికోసం కేటాయించారు. నవంబర్‌ 15న రాష్ట్రంలోని జాతీయ రహదారులపై ఉన్న 17 టోల్‌ ప్లాజాల్లో ఫాస్టాగ్‌ లేన్ల నుంచి రూ.96 ఆదాయం మాత్రమే వచ్చింది. అదే క్యాష్‌ లేన్ల ద్వారా రూ.1.95 కోట్ల ఆదాయం వచ్చింది. అదే నెల 26న ఫాస్టాగ్‌ లేన్ల ద్వారా రూ.1.01 కోట్లు వస్తే, క్యాష్‌ లేన్ల ద్వారా రూ.1.59 కోట్లు వసూలయ్యాయి. డిసెంబర్‌ 13న రూ.1.52 కోట్లు ఫాస్టాగ్‌ లేన్ల ద్వారా, రూ.1.44 కోట్లు క్యాష్‌ లేన్ల ద్వారా వచ్చింది. గత 2 రోజులుగా సగటున ఫాస్టాగ్‌ లేన్ల ద్వారా రూ.1.78 కోట్లు, క్యాష్‌ లేన్ల ద్వారా రూ.1.20 కోట్లు వసూలవుతోంది. ఈ వారాంతానికి ఫాస్టాగ్‌ ద్వారా రూ.2 కోట్లు, క్యాష్‌ లేన్ల ద్వారా రూ.1 కోటి వసూలయ్యే అవకాశం ఉందని అధికారుల అంచనా. ఫాస్టాగ్‌ వల్ల సగటు ఆదాయం రూ.50 లక్షలు చొప్పున పెరిగినట్టు అంచనా. మరో 2 రోజుల తర్వాత నెల రోజుల లెక్కలు విడుదల చేయనున్నారు.

**పెరగని వాహనాల సంఖ్య..**

ఫాస్టాగ్‌ వల్ల టోల్‌ చెల్లించే సమయంలో క్యూలో ఉండాల్సిన సమస్య ఉండదని తేలిపోయినా.. ఇంకా వాహనదారులతో కదలిక ఆశించిన వేగంగా ఉండట్లేదు. ఇప్పటికీ 72 వేల వాహనాలకు మాత్రమే రాష్ట్రంలో ఫాస్టాగ్‌ ట్యాగ్లు కొన్నారు. ట్యాగ్‌ లేని వాహనాలే ఎక్కువగా టోల్‌ గేట్ల నుంచి వెళ్తున్నాయి. గత 4 రోజులుగా టోల్‌గేట్ల నుంచి వెళ్తున్న వాహనాల్లో 52 శాతం ట్యాగ్‌ లేనివే ఉండటం విశేషం. వాణిజ్యపరమైన వాహనదారులు ఎక్కువగా, సొంత వాహనాలున్నవారు తక్కువగా ట్యాగ్లు కొంటున్నారు. కమర్షియల్‌ వాహనాలు టోల్‌ ఎక్కువగా చెల్లించాల్సి ఉండటంతో ఫాస్టాగ్‌ వాహనాల సంఖ్య తక్కువగా ఉన్నా.. వాటి ద్వారా వసూలవుతున్న టోల్‌ ఎక్కువగా ఉంటోంది. ఫాస్టాగ్‌ రావటానికి 5 రోజుల ముందు నుంచి ట్యాగ్లు కొనుగోళ్ల వేగం పెరిగింది. సగటున రోజుకు 3 వేల వరకు ట్యాగ్స్‌ కొన్నారు. కొన్ని రోజులుగా సగటున రోజుకు 1,300 ట్యాగ్లు మాత్రమే అమ్ముడవుతున్నాయి.

**14 తర్వాత గందరగోళమే!**

ప్రస్తుతం టోల్‌ ప్లాజాల వద్ద 25 శాతం దారులను హైబ్రిడ్‌ వేలుగా మార్చారు. వీటిల్లో ట్యాగ్‌ ఉన్నవాటిని లేని వాటిని అనుమతిస్తున్నారు. జనవరి 14 వరకు ఈ వెసులుబాటుంది. ఆ తర్వాత కేవలం ఒకటి చొప్పున (ఒకవైపు) గేట్లను మాత్రమే క్యాష్‌ చెల్లించేందుకు పరిమితం చేయనున్నారు. అంటే ఫాస్టాగ్‌ లేని వాహనాలన్నీ ఈ ఒక్క గేటు నుంచే ముందుకు కదలాల్సి ఉంటుంది. ఫాస్టాగ్‌ లేన్ల నుంచి వెళ్లే సాధారణ వాహనాలకు రెట్టింపు టోల్‌ వసూలు చేస్తారు. అదే సమయంలో సంక్రాంతి రద్దీ ఉండనుండటంతో టోల్‌గేట్ల వద్ద అయోమయ పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది. కేంద్రం గడువు పొడిగించకుంటే గందరగోళం తప్పదని అధికారులు కలవరపడుతున్నారు. మరో పక్షం రోజుల్లో వీలైనన్ని వాహనాలు ట్యాగ్లు కొంటేనే పరిస్థితి అదుపులో ఉంటుంది. కొనుగోళ్లు ఇదే మందగమనంలో ఉంటే క్యాష్‌ లేన్‌ వద్ద మళ్లీ కిలోమీటరు మేర క్యూలు తప్పేలా కనిపించటం లేదు. పండగ కోసం సొంతూళ్లకు వెళ్లేవారు ఇబ్బంది పడకతప్పేలా లేదు. కనీసం మరో పక్షం రోజులు హైబ్రిడ్‌ లేన్ల కొనసాగింపునకు కేంద్రం అనుమతిని పొడిగించాలన్న అభ్యర్థనలు వినిపిస్తున్నాయి.

## అయ్యన్న ఇన్‌ఫ్రాకు రెండోసారి క్రెడాయ్‌ అవార్డు

**సాక్షి, హైదరాబాద్‌:** క్రెడాయ్‌ తెలంగాణ క్రియేట్‌ అవార్డ్సులో హైదరాబాద్‌కు చెందిన అయ్యన్న ఇన్‌ఫ్రా వరుసగా రెండోసారి సత్తా చాటింది. హైదరాబాద్‌ చాప్టర్‌కు సంబంధించి..‘నాన్‌ మల్టీ స్టోరేడ్‌ గేటెడ్‌ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్‌‘ విభాగంలో ఒక్కో యూనిట్‌ ధర రూ.70 లక్షల వరకు ఉన్న కేటగిరీలో..క్రియేట్‌ అవార్డ్‌ను అయ్యన్న ఇన్‌ఫ్రా గెలుచుకుంది. కొండాపూర్‌లో నిర్మిస్తున్న అయ్యన్న ప్లాటినాను 80 ఫ్లాట్స్‌తో నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు కల్పించిన మౌలికవసతులు, సౌకర్యాలు, వినియోగదారుల సేవలు వంటి అంశాలు దీనికి అవార్డును అందించడంలో తోడ్పడ్డాయి. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌ రెడ్డిల చేతుల మీదుగా అయ్యన్న ఇన్‌ ఫ్రా అధినేత శ్రీధర్‌ ఈ అవార్డు అందుకున్నారు. ప్రతిష్టాత్మక క్రియేట్‌ అవార్డ్‌ను గెలుచుకోవడంపై శ్రీధర్‌ సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు.

## క్లుప్తంగా...

### రబీకి ఎరువులు సిద్ధం

**వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి**



**సాక్షి, హైదరాబాద్:** ప్రస్తుత రబీ సీజన్‌కు 15.40 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించామని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. అందులో 7.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉందన్నారు. ఈ నెలాఖరుకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాలకు ఎరువులు సరఫరా చేసే మూసాపేట రేక్ పాయింట్‌ను మంత్రి ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు 1.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 0.15 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ, 0.35 లక్షల మెట్రిక్ టన్నుల ఎన్‌పీకే బఫర్ స్టాక్ ఉందన్నారు. 7,612 మంది డీలర్లు, సహకార సంఘాల ద్వారా ఎరువులను సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాల వారీగా ఎరువుల డిమాండ్ వివరాలు తెలుసుకుని అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

### ఉద్యోగాల భర్తీతోనే నిరుద్యోగుల్లో ఆత్మగౌరవం

**ఓయూ సమరభేరిలో తెలంగాణ ఇంటి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకు సుధాకర్**



**ఉస్మానియా యూనివర్సిటీ:** ఉద్యోగాల భర్తీతోనే నిరుద్యోగుల్లో ఆత్మగౌరవం పెరుగుతుందని తెలంగాణ ఇంటి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకు సుధాకర్ అన్నారు. ఓయూ ఆర్ట్స్‌కాలేజీ ఎదుట తెలంగాణ స్టూడెంట్స్ యూనిట్ (టీఎస్‌యూ) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన నిరుద్యోగ విద్యార్థి సమర భేరి సభలో చెరుకు సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యో గం అనేది నిరుద్యోగులతో పాటు తల్లిదండ్రుల ఆశ అని, ఉద్యోగం ఉన్న వ్యక్తి ఆత్మగౌరవంతో జీవిస్తారన్నారు. ఉద్యోగాల భర్తీకి విద్యార్థిలోకం ఉద్యమించాలని అందుకోసం తెలంగాణ ఇంటి పార్టీ విద్యార్థులకు అండగా ఉంటుందన్నారు. సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ మాట్లాడుతూ.. ఓయూ గడ్డకు సీఎం కేసీఆర్ రుణపడి ఉన్నారని, రాజకీయ భిక్షపెట్టింది విద్యార్థులేనని, ఉద్యోగాలు ఇవ్వలేని సీఎం కేసీఆర్ ఓయూకు రాలేకపోతున్నారన్నారు.

### ప్రతిష్టాత్మకంగా మున్సిపల్ ఎన్నికలు: బీజేపీ

**సాక్షి, హైదరాబాద్:** త్వరలో జరగబోయే మున్సిప ల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని బీజే పీ కోర్ కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అధ్యక్షతన కోర్‌కమిటీ సమావేశమైంది. ఈ మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు పనిచేయాలని సమావేశం నిర్ణయించింది. ప్రతి పార్లమెంటు పరిధిలో మున్సిప ల్ ఎలక్షన్స్ మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తీర్మానించింది. అలాగే పౌరసత్వ సవరణ చట్టం విషయం లో ప్రధాని మోదీని ఉద్దేశించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను సమావేశం తప్పు బట్టింది. తెలంగాణ కాంగ్రెస్ నేతలు, కమ్యూనిస్టు నాయకుల ఆరోపణలను ఖండిస్తూ చేసిన తీర్మానా న్ని సమావేశం ఆమోదించింది. ఎంపీ బండి సంజయ్ మీద పెట్టిన కేసులను, పోలీసుల పక్షపాత వైఖరిని సమావేశం ఖండించింది. సమావేశంలో కేం ద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి డీకే అరుణ, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదిత రులు పాల్గొన్నారు. కాగా, కిషన్‌రెడ్డి సమక్షంలో పలు పార్టీలకు చెందిన ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు చెందిన పలువురు నేతలు బీజేపీలో చేరారు. మరోవైపు పౌరసత్వ సవరణ చట్టానికి మద్దతుగా బీజేపీ హైదరాబాద్‌లో సోమవారం సభను ఏర్పాటు చేసింది. ధర్నా చౌక్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ఏర్పాటు చేసిన ఈ సభకు ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి జితేందర్‌సింగ్ హాజరు కానున్నారు.

### 'భూసర్వేతోనే రైతులకు న్యాయం'

**ఘట్‌కేసర్ :** రైతులకు సత్వరం న్యాయం జరగాలంటే భూసర్వే చేపట్టాలని తెలంగాణ తహసీల్దార్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో రైతుల సమక్షంలో ఆదివారం జరిగిన తెలంగాణ మాసపత్రిక, డైరీ, కేలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలకు అధికారులతో పాటు ప్రభుత్వానికీ బాధ్యత ఉందని, ప్రక్షాళన సమయంలో రైతులు కీలకంగా లేకపోవడం, సమాచార లోపం కూడా కారణమన్నారు.


### పద్మశాలి ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ కమిషనర్ టి.చిరంజీవులు ఆదివారం తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఈగ వెంకటేశ్వర్లు, తిరందాసు యాదగిరి, ఉపాధ్యక్షుడు రాహుల్ కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాసబత్తిని రాజేశం, పున్న శ్రీనివాస్, రాష్ట్ర సభ్యుడు శిరందాసు యాదగిరేందర్ తదితరులు పాల్గొన్నారు.



- తీవ్రంగా బాధిస్తున్న మందుల కొరత
- బీపీ, షుగర్ మందుల్లేక ప్రైవేట్ షాపులకు జనం
- ఇబ్బందులు పడుతున్న కార్మికులు, వారి కుటుంబాలు
- ఈఎస్ఐ కుంభకోణం తర్వాత దారుణంగా పరిస్థితి
- త్వరలో వస్తాయంటున్న అధికారులు

# మందు గోలీ.. ఈఎస్ఐ ఖాళీ



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు వేముల వీరభద్రయ్య. ఇతడి కుమారుడు శ్రీనివాస్ భూపాలపల్లిలోని జెన్‌కోలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వీరభద్రయ్యకు 2 నెలల కింద గుండెపోటు రావడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో స్టెంట్ వేయించుకున్నాడు. ప్రతి నెలా మందులకు వేల రూపాయలు అవుతుండటంతో కొడుకు కార్డుపై ఈఎస్ఐ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నాడు. డాక్టర్ రాసిన మందుల్లో ఒకటి లేదని, తర్వాత రావాలని పంపారు. 45 రోజుల్లో రెండుసార్లు వెళ్లాడు. వరంగల్ రూరల్ జిల్లా పరకాల నుంచి వరంగల్ ఈఎస్ఐ ఆస్పత్రికి రావాలంటే రూ.150లు ఖర్చు అవుతోందని, ఈఎస్ఐ కార్డు ఉన్నా ఉపయోగం లేకుండా పోయిందని బాధితుడు వాపోతున్నాడు.

**సాక్షి, వరంగల్ రూరల్:** ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో మందుల కొరత వేధిస్తోంది. అనారోగ్యంతో వస్తున్న కార్మికులకు పూర్తిస్థాయిలో మందుల్లేక తప్పని పరిస్థితుల్లో ప్రైవేటులో కొనుక్కోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. దీంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఫ్యాక్టరీలు, ఇతర ప్రైవేటు సంస్థల్లో పనిచేసే కార్మికులు (నెలసరి ఆదాయం రూ.21వేల లోపు ఉన్నవారు) ఈఎస్ఐ పరిధిలోకి వస్తారు. కార్మికుడికి చెల్లించే జీతం నుంచి 0.75 శాతం కార్మికుడి వాటాగా చెల్లించాలి. పనిచేసే కంపెనీ యాజమాన్యం వారు 3.25 శాతం ఈఎస్ఐకి చెల్లిస్తుంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో 1,55,525 ఈఎస్ఐ కార్డుదారులు ఉండగా.. 17 డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటిలో రోజుకు ఒక్కో డిస్పెన్సరీకి 200 మందికి పైగా కార్మికులు చికిత్సకు వస్తుంటారు. ఏడాది నుంచి పలు కారణాలతో మందుల సరఫరా మందగించగా ఇటీవల వెలుగు చూసిన మందుల కొనుగోలు కుంభకోణంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది.

**జిల్లాల వారీగా ఈఎస్ఐ కార్డుదారుల సంఖ్య**

| జిల్లా | కార్డుదారుల సంఖ్య |
|---|---|
| ఆదిలాబాద్ | 4,111 |
| భద్రాద్రి కొత్తగూడెం | 9,193 |
| జనగాం | 593 |
| భూపాలపల్లి | 657 |
| కామారెడ్డి | 1,755 |
| ఖమ్మం | 15,736 |
| కుమ్రంభీం | 2,063 |
| మహబూబాబాద్ | 668 |
| మంచిర్యాల | 2,752 |
| నల్లగొండ | 1,435 |
| నిర్మల్ | 2,580 |
| నిజామాబాద్ | 23,159 |
| సూర్యాపేట | 2,499 |
| వరంగల్ రూరల్ | 172 |
| వరంగల్ అర్బన్ | 53,900 |
| యాదాద్రి భువనగిరి | 34,252 |
| మొత్తం | 1,55,525 |



#### ప్రైవేటుకు పరుగులు

అనారోగ్య సమస్యలతో ఇక్కడికొచ్చే కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఇస్తుంటారు. స్థానికంగా చికిత్స అందని రోగులను వరంగల్, హైదరాబాద్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. స్థానిక డిస్పెన్సరీలతో పాటు వరంగల్, హైదరాబాద్ ఆస్పత్రుల్లో సైతం పూర్తి స్థాయి వైద్య పరీక్షలు, చికిత్సలు, మందులు ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. కార్మికులు ఎక్కువగా బీపీకి టెల్మా–హెచ్, షుగర్‌కు గ్లిమీప్రైడ్ 1 ఎంజీ, 2 ఎంజీ, ఇన్సులిన్ ఇంజెక్షన్లు, నొప్పులకు అసిక్లోఫినాక్, వోవరాన్, జ్వరానికి పారాసిటమాల్, కొలెస్ట్రాల్ తగ్గించుకోవడానికి అటర్వాస్ మందుల కోసం ప్రతి నెలా వస్తుంటారు. అయితే 6 నెలలుగా ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో ఈ మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు మందుల దుకాణాలకు వెళ్తున్నారు.

#### నెల నుంచి తిరుగుతున్నా..



మా కుమారుడు హన్మకొండలోని ఓ ఫైనాన్స్ ఆఫీస్‌లో పని చేస్తాడు. మాకు ఈఎస్ఐ కార్డు వచ్చింది. నాకు బీపీ ఉంది. టెల్మా–హెచ్ మందుల కోసం నెల రోజులుగా డిస్పెన్సరీకి తిరుగుతున్నా లేవని చెబుతున్నారు. బయట కొందామంటే ఎక్కువ ధర ఉంది. అన్ని రకాల మందులను అందుబాటులో ఉండేలా చూడాలి. **– అడప అనురాధ, వరంగల్**


#### నెలరోజుల్లో పూర్తి స్థాయి సరఫరా..

డిస్పెన్సరీలకు నెల రోజుల్లో పూర్తి స్థాయి మందులు సరఫరా అవుతాయి. డైరెక్టరేట్ నుంచి మాకు వస్తే మా పరిధిలోని డిస్పెన్సరీలకు సరఫరా చేస్తాం. మా చేతిలో ఏమీ లేదు. మాకు మందులు కొనుగోలు చేసే అధికారం లేదు.

**– డాక్టర్ సురేశ్‌కుమార్, నోడల్ అధికారి, వరంగల్ ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్**

## నిపుణుల కమిటీ, బీసీజీ నివేదికల అధ్యయనానికి హైపవర్ కమిటీ

- ఉత్తర్వులు జారీచేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
- కమిటీలో సభ్యులుగా పది మంది మంత్రులు, సీఎం ముఖ్య సలహాదారు, ఐదుగురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌లు
- మెంబర్ కన్వీనర్‌గా సీఎస్ నీలం సాహ్ని
- మూడు వారాల్లోగా నివేదిక
- అవసరమైతే అడ్వొకేట్ జనరల్ సలహాలు తీసుకోవాలని సూచన



**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలన వికేంద్రీకరణ, సమగ్రాభివృద్ధిపై జీఎన్ రావు నేతృత్వంలోని నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను.. బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) ఇచ్చే నివేదికను అధ్యయనం చేసేందుకు అక్కడి ప్రభుత్వం ఆదివారం హైపవర్ కమిటీని ఏర్పాటుచేసింది. ఇందుకు అవసరమైతే అడ్వొకేట్ జనరల్ సూచనలు తీసుకోవాలని సూచించింది. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ కమిటీలో మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, పిల్లి సుభాష్‌చంద్ర బోస్, బొత్స సత్యనారాయణ, మేకపాటి గౌతంరెడ్డి, ఆదిమూలపు సురేష్, మేకతోటి సుచరిత, కురసాల కన్నబాబు, మోపిదేవి వెంకటరమణారావు, పేర్ని వెంకట్రామయ్య (నాని), కొడాలి వెంకటేశ్వరరావు (నాని), సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం, డీజీపీ గౌతమ్ సవాంగ్, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్యామలరావు, న్యాయ శాఖ కార్యదర్శిలను సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. అలాగే, మూడు వారాల్లో నివేదిక ఇవ్వాలని హైపవర్ కమిటీకి దిశానిర్దేశం చేస్తూ ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని ఉత్తర్వులు జారీచేశారు. ఈ హైపవర్ కమిటీలో మొత్తం పదిమంది మంత్రులు, సీఎం ముఖ్య సలహాదారు, ఐదుగురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సభ్యులుగా ఉన్నారు.

కాగా, ఏపీలో పరిపాలన వికేంద్రీకరణ, సమగ్రాభివృద్ధిపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు జీఎన్ రావు నేతృత్వంలో నిపుణుల కమిటీని సెప్టెంబరు 13న ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ కమిటీ ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి పలు సిఫార్సులు చేసింది. అవి ఏమిటంటే..

- మహారాష్ట్ర, జమ్మూ కశ్మీర్‌లో ఉన్నట్లు రాష్ట్రంలో అమరావతి, విశాఖపట్నంలో శాసన (లెజిస్లేచర్) వ్యవస్థ ఉండాలి. అసెంబ్లీ అమరావతిలో ఉన్నా.. వేసవికాల సమావేశాలు విశాఖలో, శీతాకాల సమావేశంలో అమరావతిలో నిర్వహించాలి. విశాఖలో సచివాలయం, హెచ్‌ఓడీ కార్యాలయాలు, సీఎం క్యాంపు కార్యాలయం, హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేయాలి. అమరావతిలో హైకోర్టు బెంచ్, సీఎం క్యాంపు కార్యాలయం, రాజ్‌భవన్ ఉండాలి.
- అలాగే, అమరావతిలో భూమి తీరు, వరద ప్రభావం తదితర అంశాల కారణంగా రాజధాని కార్యకలాపాలను ఇతర నగరాలకు వికేంద్రీకరించాలి. ఇక్కడ దాదాపుగా పూర్తయిన నిర్మాణాలను వినియోగంలోకి తీసుకురావాలి.
- అమరావతిలో ప్రతిపాదిత నిర్మాణాల్ని తగ్గించాలి. ఎన్జీటీ ఆదేశాల ప్రకారం రివర్ ఫ్రంట్ నిర్మాణాలు ఉండరాదు.
- సీడ్ యాక్సెస్ రోడ్డును జాతీయ రహదారికి అనుసంధానించాలి.
- శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో హైకోర్టు ఏర్పాటుచేయాలి.

ఈ సిఫార్సుల నేపథ్యంలో.. త్వరలో రానున్న బీసీజీ నివేదికతోపాటు జీఎన్ రావు సూచనలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని ఏపీ ప్రభుత్వం భావించింది. ఇందుకోసం హైపవర్ కమిటీని ఏర్పాటుచేయాలని ఈనెల 27న జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ఇద్దరు బాలురిని బలిగొన్న గుంత

**ఉప్పల్:** గృహ నిర్మాణం కోసం తవ్విన ఓ నీటిగుంత ఇద్దరు బాలుర ప్రాణాలను బలిగొంది. ఈ హృదయ విదారక సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఉప్పల్ న్యూ శాంతినగర్‌లో పల్లెపు వెంకటరావు ఉంటున్నాడు. ఇతని కుమారుడు రేవంత్ (13) స్థానిక ప్రైవేట్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. నల్లగొండ జిల్లాకు చెందిన పోలెపల్లి స్వామి శాంతినగర్ సత్యానగర్ కాలనీలో ఉంటున్నాడు. ఇతని కుమారుడు మనోహర్ (14) ఉప్పల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. వీరిద్దరు స్నేహితులతో కలిసి హెచ్ఎండీఏ బగాయత్ లేఅవుట్‌లో ఆడుకోవడానికి వెళ్లారు. అక్కడ ఎంజె.సుందర్‌రావు అతని కుమారుడు రాకేశ్‌కుమార్‌లు తమకు చెందిన ప్లాట్ నెంబర్–1100లో ఇటీవల ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ చేసేందుకు 15 అడుగుల వరకు గోతిని తవ్వి వదిలేశారు. అందులో నీళ్లు ఊరాయి. ఆ ప్రాంతానికి ఆడుకోవడానికి వెళ్లిన రేవంత్, మనోహర్‌లు బంతి నీళ్లలో పడటంతో దాన్ని తీయడానికి గుంతలోకి దిగారు. నీరు నిండుగా ఉండటంతో ఇద్దరు మునిగిపోయారు. అక్కడున్న వారిద్దరిని బయటికి తీసి చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు స్థల యజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు.



ప్రమాదానికి కారణమైన గుంత

## 8న బంద్‌ను జయప్రదం చేయండి: తమ్మినేని



**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** వ్యవసాయ కార్మికుల కడుపు నింపే పోరాటాలతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే పోరాటాలను కూడా చేస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తమ్మినేని మాట్లాడుతూ.. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జనవరి 8న జరగనున్న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థ మందగించిందని పలువురు ఆర్థికవేత్తలు గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు.

# మున్సి'పోల్స్'పై ఫోకస్

- పట్టణ ప్రాంత ఎన్నికలపై కాంగ్రెస్ దృష్టి
- స్థానిక సమస్యలే లక్ష్యంగా అడుగులు
- ప్రచారాస్త్రాలుగా టీఆర్ఎస్ వైఫల్యాలు
- పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా సమీక్షలు
- కార్యకర్తలకు టీపీసీసీ నేతల దిశానిర్దేశం



**సాక్షి, హైదరాబాద్:** త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారాయి. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ఉపయోగపడే పట్టణ స్థానిక సంస్థలకు జరిగే ఈ ఎన్నికల్లో తగినన్ని స్థానాలు సాధించకపోతే ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే గ్రామీణ స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం 30 శాతానికే పరిమితం కావడం, పార్టీ తరపున గెలిచిన మెజార్టీ ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లోకి వెళ్లిపోవడంతో క్షేత్రస్థాయిలో పార్టీని ముందుకు నడిపించే నాయకులు కూడా లేని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి ఎదురైతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి కూడా కోలుకోలేమనే అభిప్రాయం ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అధికార టీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు పట్టణ ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను పక్కాగా తమ వైపు మరల్చుకోవడం, ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న సానుకూల ఫలితాలను ప్రజలకు తెలియజేయడం ద్వారా సాధ్యమైనన్ని స్థానాల్లో గెలుపొందేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ మేరకు పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా సమీక్షా సమావేశాలను నిర్వహిస్తోంది. సమీక్షల్లో భాగంగా మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై టీపీసీసీ నేతలు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే చేవెళ్ల, మెదక్ స్థానాల సమీక్షలు పూర్తి కాగా.. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి మిగతా అన్ని స్థానాల్లో ఈ సమీక్షలు పూర్తి చేయాలని భావిస్తోంది. అలాగే మున్సిపాలిటీల వారీగా సమావేశాలు కూడా పూర్తి చేసుకుని ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రణాళికలు రచిస్తోంది.

#### ప్రధాన ప్రచారాస్త్రాలివే..

మున్సిపల్ ఎన్నికలను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, యువతే లక్ష్యంగా చేసుకుని, వారి ఓటు బ్యాంకును మరల్చుకునేలా ముందుకెళ్లాలని కాంగ్రెస్ యోచిస్తోంది. ప్రజల నాడిని తెలుసుకుని మున్సిపోల్స్‌లో విజయం సాధించే దిశగా అడుగులు వేస్తోంది. బీసీలకు గతంలో మున్సిపాలిటీల్లో ఉన్న రిజర్వేషన్లను టీఆర్ఎస్ తగ్గించిందని చెబుతూనే 50 శాతం సీట్లను ఆ వర్గాలకు ఇవ్వడం ద్వారా బీసీలను తమ వైపు మరల్చుకోవాలని నిర్ణయించింది. దీనికితోడు ఎన్ఆర్‌సీ, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ల అంశాలను ఓటర్లకు తెలియజేయాలని, ఎస్టీల రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీలకు మూడెకరాల భూ పంపిణీ, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయాల్లో టీఆర్ఎస్ వైఫల్యాలను పూర్తి స్థాయిలో పట్టణ ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఇప్పటికే పార్టీ శ్రేణులకు టీపీసీసీ నేతలు దిశానిర్దేశం చేశారు. ఈ అంశాలతో పాటు స్థానికంగా ఉండే సమస్యలను ఫోకస్ చేయాలని, తద్వారా వీలున్నన్ని ఎక్కువ చోట్ల గెలిచేలా ముందుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు సూచిస్తున్నారు.

# విద్యను సమాజ సేవకు ఉపయోగించాలి

- 30 కోట్ల మంది సేవ చేసినా దేశం ఉన్నతంగా ఉంటుంది
- మనిషి ఆలోచనలకు మార్గం చూపే శిక్షణ అవసరం
- పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్



సరస్వతి విద్యాపీఠంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

**రాజేంద్రనగర్:** మనిషి ఆలోచనలకు మార్గం చూపించే శిక్షణ అవసరమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. విద్యను స్వార్థం కోసం కాకుండా దేశ రక్షణ, సమాజ సేవ కోసం ఉపయోగించాలని సూచించారు. ఆదివారం బండ్లగూడ జాగీరులోని శారదా ధామంలో శ్రీ సరస్వతి విద్యాపీఠం పూర్వ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మానవ జాతి అభివృద్ధి కోసం పర్యావరణానికి కీడు చేయవద్దని సూచించారు. నాణ్యమైన విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని అభిప్రాయపడ్డారు. సరస్వతి విద్యా మందిరాలు వ్యాపార ధోరణితో విద్యను బోధించడం లేదని.. సమాజ, దేశ సేవ కోసం బోధిస్తున్నాయని వెల్లడించారు. సంస్కృతి, సంప్రదాయాల విషయంలో భారతదేశం అన్ని దేశాలకు దిక్సూచిగా ఉందని కొనియాడారు. దేశంలోని 130 కోట్ల మందిలో 30 కోట్ల మంది సేవ చేసినా దేశం ఉన్నతంగా ఉంటుందని పేర్కొన్నారు. పిల్లలకు ఇంట్లోనే మన సంస్కృతి, సంప్రదాయాలను బోధించాలని.. వారితో మాతృభాషలోనే మాట్లాడాలని తల్లిదండ్రులకు సూచించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ సంస్కృతిని ప్రపంచదేశాలకు చాటాల్సిన అవసరం ఉందన్నారు. సరస్వతి విద్యా పీఠం ఇందుకు ఎంతగానో పాటుపడుతోందని కొనియాడారు. అనంతరం సరస్వతి విద్యా పీఠం ఆధ్వర్యంలో రాబోయే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్న శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ భవనానికి శంకుస్థాపన చేశారు. విద్యారణ్య స్కూల్ భవనానికి విజయవాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సీబీఆర్ ప్రసాద్ రూ.కోటి విరాళం అందిస్తున్నట్లు ప్రకటించారు. విజయవాడలో నిర్మించనున్న పాఠశాలకు రూ.12.5 కోట్ల విలువైన భవనాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బండి సంజయ్, విద్యాభారతి అధ్యక్షుడు రామకృష్ణారావు, దక్షిణ మధ్య క్షేత్ర విద్యా భారతి అధ్యక్షుడు ఉమామహేశ్వర్, పారిశ్రామికవేత్త ఎంఎస్ఆర్‌వీ ప్రసాద్, సేవిక సమితి ప్రధాన కార్యదర్శి అన్నదాన సీతక్క తదితరులు పాల్గొన్నారు.

#### పూర్వ విద్యార్థి సమ్మేళనం రికార్డులు..

సరస్వతి విద్యాపీఠం రాష్ట్రస్థాయి పూర్వ విద్యార్థి మహా సమ్మేళనం పలు రికార్డులను సాధించింది. ఈ సమ్మేళనానికి తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, అమెరికా, దుబాయ్ నుంచి 15 వేల మంది విద్యార్థులు హాజరైనట్లు రాయల్ సక్సెస్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డు నిర్వాహకులు వెల్లడించారు. భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరవ్వడంతో పలు రికార్డులు సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి పరిషత్ సభ్యులకు రికార్డు పత్రాన్ని అందజేశారు. ఈ సమ్మేళనానికి సంబంధించిన పూర్తి నివేదికను గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు నిర్వాహకులకు అందిస్తున్నట్లు విద్యార్థి సమ్మేళనం సభ్యులు వెల్లడించారు.

### ప్రియాంకపై పోలీసుల తీరు సరికాదు: కాంగ్రెస్



**సాక్షి, హైదరాబాద్:** ప్రియాంకాగాంధీతో పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. ఘటనపై న్యాయవిచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐసీసీ ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి ఆర్.సి.కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. 135వ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీని పోలీసులు అడ్డుకున్నారని, మహిళా పోలీసులు ఆమె మెడపై చేయివేసి తోసారని ఆరోపించారు. ఇది చాలా దారుణమైన విషయమని కుంతియా, ఉత్తమ్ వాపోయారు. బీజేపీ ప్రభుత్వం గాంధీ కుటుంబంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, గతంలో ఎస్పీజీ భద్రత తొలగించారని, ఇప్పుడు పోలీసులు అనుచిత వైఖరి అవలంబించారని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా మంచి ప్రజాదరణ ఉన్న ఒక మహిళానేతపై పోలీసులు ఇలా ప్రవర్తించడం హేయమైన చర్య అని అన్నారు. ఈ ఘటనపైన పూర్తి స్థాయిలో న్యాయ విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.





● రీ విజిట్



‘ఉన్నవి రెండు కాలాలు. ఆమెని ప్రేమించిన కాలం. ప్రేమించకుండా ఉండలేని కాలం’ అనే నందకిశోర్ రెండో కవితాసంపుటి ‘యథేచ్ఛ’ డిసెంబర్ 2017లో వచ్చింది (మొదటి సంపుటి ‘నీలాగే ఒకడుండేవాడు!’). ప్రచురణ: వాకిలి. అందులోంచి ఒక కవిత:

## ఆమెన్!

భూమి దప్పిక తీర్చేందుకు
ఆకాశం గొంతుకోసినవాడు
దేవుడు

చిక్కటి రాత్రి మొహమ్మీద
చుక్కల దిష్టి పెట్టినవాడు
దేవుడు

కళ్లు తెరవని పసికందుని చంపి
నిద్రపోగలవాడు
దేవుడు

అస్సలు స్పృహ తెలియకుండా
అడవి చుట్టూ పంజరమల్లినవాడు
దేవుడు

◆ నందకిశోర్

# వెలుగులనమ్మే చిన్నారి



**సంవత్సరం చివరి రోజున జరిగే కథ.**
**సంవత్సరంలో ఏరోజూ జరగకూడని కథ.**

చలి మరీ తీవ్రంగా ఉంది; మంచు కురిసింది; చీకటి కూడా పడుతోంది. అది సాయంత్రం, ఆ సంవత్సరపు చివరి సాయంత్రం. ఇట్లాంటి చలిలో, చీకటిలో ఒక పేద బాలిక నడుస్తూవుంది; తలకు కట్టయినా, కాళ్లకు చెప్పులయినా లేకుండా. ఇల్లు వదిలినప్పుడు ఆమె కాళ్లకు చెప్పులున్న మాట వాస్తవం; కానీ ఏం లాభం? అవి ఆమె కాళ్లకు చాలా పెద్దవైనాయి; అంతకుముందు వాళ్లమ్మ వేసుకున్నవాయె. పోనీ అవైనా ఉన్నాయనుకుంటే, ఆ వీధిలోంచి భయంకరమైన వేగంతో వెళ్లిన రెండు గుర్రపుబళ్లకు భయపడి పరుగెత్తడంలో అవెక్కడో జారిపోయినై.

ఒక చెప్పు ఎక్కడా కనబడనేలేదు; కనబడిన రెండోదాన్ని ఎవరో పేద తుంటరి పిల్లాడు ఎత్తుకొని పరుగెత్తాడు; వాడికి ఎప్పటికైనా పిల్లలు పుడితే కొనవలసిన ఊయలకు పెట్టుబడిగా పనికి వస్తుందనేమో. ఇంక ఈ చిన్నారి తల్లి తన చిన్న కాళ్లతోనే నడుచుకుంటూ పోయింది. చలికి ఆమె ఎర్రటి పాదాలు నీలంరంగులోకి మారుతున్నాయి. ఆమె వేసుకున్న పాత ఏప్రానులో కొన్ని అగ్గిపుల్లలున్నాయి; ఇంకో కట్టేమో ఆమె చేతిలో ఉంది. పొద్దుటినుంచీ అందులోంచి ఒక్కటైనా ఎవరూ కొనలేదు, ఒక్క ‘ఫార్తింగ్’ అయినా ఇవ్వలేదు.

పాపం ఆ చిన్నారి అట్లానే ఆ చలికి వణుకుతూ, ఆకలికి మాడుతూ, కాళ్లను ఈడ్చుకుంటూ పోయింది. ఎంత హృదయ విదారక దృశ్యం!

ఆమె మెడచుట్టూ అందంగా జాలువారిన ఆమె పొడవాటి జుట్టు మంచు ముద్దలతో నిండిపోయింది. కానీ ఆమె దానిగురించి ఒక్కసారైనా ఆలోచించలేదు. అన్ని కిటికీల్లోనూ కొవ్వొత్తులు వెలుగుతున్నాయి, రుచికరమైన బాతు మాంసం వాసన వేస్తోంది. అది కొత్త సంవత్సరపు వేడుక. దీని గురించైతే ఆమె ఆలోచించకుండా ఉండలేకపోయింది.

రెండు ఇళ్ల మధ్య ఏర్పడిన మూలలో– అందులోంచి ఒక ఇల్లు కొంచెం ఎక్కువ పొడుచుకు వచ్చినట్టుగా ముందుకు వచ్చింది– ఆ చిన్నారి చేతులు ముడుచుకుని కూర్చుంది; తన కాళ్లను మరింత, మరింత దగ్గరకు లాక్కుంది; అయినా చలికి ఇంకా, ఇంకా వణుకుతూనేవుంది. అయినప్పటికీ ఇంటికి తిరిగివెళ్లడానికి ధైర్యం చాల్లేదు; ఒక్క అగ్గిపుల్లయినా అమ్మలేదాయె, చేతిలోకి ఒక్క ఫార్తింగ్ అయినా రాలేదాయె, ఇంటికి వెళ్తే నాన్న నుంచి దెబ్బలు తప్పవాయె. పోనీ ఇంటికి వెళ్లినా అక్కడా చలి తప్పదాయె; ఇంటికి పైకప్పు తప్ప ఏమీలేదాయె. పెద్ద పెద్ద పర్రెలను గడ్డితోనూ పాతబట్టలతోనూ కప్పినప్పటికీ గాలి ఇంకా ఈల వేస్తూనేవుంటుంది.

ఆమె చిన్న చేతులు చలికి దాదాపుగా మొద్దుబారిపోయినై. అయ్యో! కట్టలోని ఒక్క అగ్గిపుల్ల వెలిగించగలిగినా ఆమెకు కొంత ఉపశమనమైనా దొరుకునే! ఆ కట్టలోంచి తీయడానికి ధైర్యం చేసి, దాన్ని ఆ గోడకు గీకి, ఆ మంటకు తన వేళ్లను కాపుకోగలిగితే బాగుండు! ఆ, ఆమె ఒకటి బయటికి తీసింది. ‘సుర్ర్!’ ఎలా వెలిగింది, ఎలా మండింది! కొవ్వొత్తిలాగా వెచ్చటి, ప్రకాశవంతమైన మంట. దాని మీద ఆమె వేళ్లను ఉంచింది. ఎంత బాగుంది! మెరుగుపెట్టిన ఇత్తడి కాళ్లతో ఉండే ఒక పెద్ద ఇనుప పొయ్యి ముందు కూర్చున్నట్టుగా అనిపించింది. ఎంత అందమైన మంట! చిన్నారి తన పాదాలను కూడా ఆ వేడి తగిలేట్టుగా చాపింది; కానీ ఇంతలోనే ఆ బుల్లి మంట ఆరిపోయింది; పొయ్యి మాయమైంది. ఆమె చేతిలో కాలిపోయిన పుల్ల తప్ప ఇంకేమీ లేదు.

మరొక్కదాన్ని గోడకు వ్యతిరేకంగా గీకింది; ప్రకాశంగా అది మండింది; గోడ మీద ఎక్కడైతే వెలుతురు పడిందో ఉన్నట్టుండి అది పారదర్శకమైన తెరలా మారిపోయింది; లోపల గది అంతా ఆమెకు కనబడుతోంది. టేబుల్ మీద మంచు లాంటి తెల్లటి బట్ట పరిచివుంది; దానిమీద అందమైన పింగాణీ పాత్రలు అమర్చివున్నాయి; యాపిల్ ముక్కలు, ఎండు రేగుపళ్లతో గొప్పగా గార్నిష్ చేసిన కాల్చిన బాతులోంచి ఉడుకు పొగలు వస్తున్నాయి. ఇంకా ముఖ్యమైన విషయం, ఛాతీకి కత్తి, ఫోర్కులను గుచ్చివున్న ఆ బాతు ఆ పాత్రలోంచి గెంతి, నేరుగా ఆ చిన్నారి దగ్గరకే నడుచుకుంటూ వచ్చేలోగా ఆ అగ్గిపుల్ల ఆరిపోయింది; మందపు, చల్లటి, తడిసిన గోడ తప్ప అక్కడ ఇంకేమీ లేదు. ఆమె ఇంకోటి వెలిగించింది. ఇప్పుడు ఆమె ఒక బ్రహ్మాండమైన క్రిస్మస్ ట్రీ కింద కూర్చునివుంది; గాజు తలుపులోంచి ధనిక వ్యాపారి ఇంట్లో తను చూసినదానికన్నా పెద్దది; అంతకంటే దివ్యమైన అలంకరణ చేసినది!


దాని ఆకుపచ్చ కొమ్మల మీద వేలాది దివ్వెలు వెలుగుతున్నాయి, గొప్ప రంగుల బొమ్మలు మెరుస్తున్నాయి, దుకాణాల్లో చూసి ఎప్పటికీ కొనలేనని తను అనుకున్నలాంటివి. వాటిని అందుకోవడానికి చేతులు సాచేలోగా అగ్గిపుల్ల ఆరిపోయింది. క్రిస్మస్ ట్రీలోని దివ్వెలు పైకి, ఇంకా పైకి లేచాయి; అవిప్పుడు స్వర్గంలోని నక్షత్రాల్లా ఆమెకు కనబడుతున్నాయి; అందులోంచి ఒక తార రాలిపోయింది, ఒక పెద్ద మంటతో.

‘‘ఇప్పుడే ఎవరో చనిపోయారు!’’ అని చెప్పింది, వాళ్ల నానమ్మతో. ఆమెను ముద్దుచేసిన ఏకైక వ్యక్తి ఇప్పుడు లేని ఈ నానమ్మ. ఒక తార రాలిందంటే ఒక ఆత్మ దేవుడి దగ్గరకు చేరుకున్నట్టని చెప్పిందావిడ.

ఆ గోడకు మరో అగ్గిపుల్ల వెలిగింది; మళ్లీ దివ్యమైన వెలుగు; అందులో ముసలి నానమ్మ నిలుచునివుంది, ఒళ్లంతా కాంతులీనుతూ, ముఖం నిండా శాంతితో, ప్రేమతో.

‘‘నానమ్మా!’’ అని కేకేసింది పాప. ‘‘నీతో నన్ను తీసుకెళ్లు. అగ్గిపుల్ల ఆరిపోగానే నువ్వు వెళ్లిపోతావు, మాయమైపోతావు– వెచ్చటి పొయ్యిలా, రుచికరమైన బాతులా, బ్రహ్మాండమైన క్రిస్మస్ ట్రీలా నువ్వు కనబడకుండా పోతావు!’’ వెంటనే తన దగ్గరున్న మొత్తం అగ్గిపుల్లల్ని ఆ గోడకు గీకి వెలిగించింది, నాన్నమ్మను తన దగ్గరే ఉంచుకోవాలన్న కృత నిశ్చయంతో. ఆ అగ్గిపుల్లలు ఎంత గొప్పగా వెలిగినాయంటే పట్టపగలు కాంతి కూడా వాటిముందు వెలవెలబోతుంది. అంతకుముందెప్పుడు నాన్నమ్మ అంత పొడుగ్గా, అంత అందంగా కనబడలేదు. ఆమె ఆ చిన్నారి బాలికను తన చేతిలోకి తీసుకుంది; ఆ వెలుగులో, ఆ సంతోషంలో ఇరువురూ పైకి, ఎంతో ఎత్తుకి ఎగిరిపోయారు. ఇంక అక్కడ చలి లేదు, ఆకలి లేదు, వేదన లేదు– వాళ్లు దేవుడితో ఉన్నారు.

కానీ ఆ మూలకు, ఆ సాయంత్రపు చలి వేళలో, గోడకు ఆనుకుని కూర్చున్న ఆ గులాబీ చెక్కిళ్ల నవ్వు ముఖపు చిన్నారి పాప మంచుకు గడ్డ కట్టుకుపోయింది, ఆ ఏడాది చివరి రోజున. బొమ్మలా, కదలకుండా తన అగ్గిపుల్లలతో కూర్చుంది ఆ చిన్నారి; ఆ అగ్గిపుల్లల్లో ఒక కట్ట కాలిపోయివుంది. ‘‘తనను తాను వెచ్చగా కాపుకోవాలనుకుంది పాపం,’’ అన్నారు జనం. కానీ ఏ ఒక్కరికైనా ఇంత కూడా అనిపించలేదు, కలలో కూడా వాళ్లు తలిచివుండరు; ఎంత అందమైన వాటిని తను చూసివుంటుంది! ఎంత తేజస్సుతో ఆమె తన నానమ్మతో కలిసి కొత్త సంవత్సరపు సంరంభంలోకి అడుగుడివుంటుంది!



హాన్స్ క్రిస్టియన్ యాండెర్సెన్

హాన్స్ క్రిస్టియన్ యాండెర్సెన్ (1805–75) రాసిన ‘ద లిటిల్ మాచ్‌స్టిక్ గర్ల్’ కథ ఇది. అనువాదం: సాహిత్యం డెస్క్. రచనాకాలం: 1845. మనుషుల్లో ఉండవలసిన కరుణను ప్రధాన వస్తువుగా చేసుకున్న ఈ ఫెయిర్ టేల్ ప్రపంచవ్యాప్తంగా ఎందరో కళాకారులను ఇప్పటికీ ఆకర్షిస్తూనేవుంది; ఎన్నోసార్లు వివిధ రూపాల్లో తెరకెక్కుతూనేవుంది. అదే కారణంగా ఎన్నో క్రిస్మస్ కథా సంకలనాల్లోనూ చోటు చేసుకుంది. డెన్మార్క్‌కు చెందిన యాండెర్సెన్ కవి, నవలాకారుడు, నాటక రచయిత అయినప్పటికీ ఆయన పేరు ఫెయిర్ టేల్స్‌తోనే ముడిపడిపోయింది. మూడు వేలకుపైనే ఇలాంటివి రాశాడంటారు. పిల్లలకోసం ఉద్దేశించినా పెద్దలూ చదివారు. పాశ్చాత్య ప్రపంచపు ఉమ్మడి చైతన్యాన్ని రూపొందించిన కథలుగా వీటిని పరిగణిస్తారు. అందువల్లేనేమో ఎన్నో దేశాల్లో ఆయన విగ్రహాలు కనబడతాయి.

● సాహిత్య మరమరాలు

## సాహిత్య దర్జీలు

బీ.ఏ.సుబ్బారావు దర్శకత్వం వహించి నిర్మించిన ‘భీష్మ’ చలనచిత్రం 1962లో విడుదలైంది. ఆ సినిమాకు మాటలను తాపీ ధర్మారావు, పాటలను ఆరుద్ర రచించారు. తాపీ వారిని ఆరుద్ర గురుభావంతో గౌరవిస్తూ వారికి చేదోడు వాదోడుగా ఉండేవారు. ఒక



రోజున కుంతీ– కర్ణ సంవాదం షూటింగ్ మొదలు కాబోతూ ఉన్నది. జి.వరలక్ష్మి – కుంతి. గుమ్మడి వేంకటేశ్వరరావు – కర్ణుడు. సెట్‌లో తాపీవారు లేరు. ఏదో పని మీద బయటకు వెళ్లారు. ఆరుద్ర ఉన్నారు. వరలక్ష్మి డైలాగ్ పేపరును చూసి ‘డైలాగ్ పెద్దదైంది. తగ్గిస్తే బాగుంటుంది’ అన్నారు. ఆరుద్ర ‘వీల్లేదండి. అది తాపీవారి స్క్రిప్టు. దానికి తిరుగులేదు’ అన్నారు. ‘తగ్గించవలసిందే’ అని ఆవిడ. ‘వీలు లేదు’ అని ఈయన. ఇంతలో తాపీవారు వచ్చారు. విషయాన్ని తెలుసుకొన్నారు. ఆరుద్రను ఇవతలకు పిలిచారు. ‘నాయనా! దర్జీ ఏమి చేస్తాడు? చొక్కా వదులైతే బిగ్రు చేస్తాడు. బిగ్రయితే వదులు చేస్తాడు కదా! మనం సాహిత్య దర్జీలం. అవతలివారు డైలాగు పెద్దదైందంటే రెండు వాక్యాలు తీసివేసి చిన్నదిగా చేస్తాం. చిన్నదైందంటే రెండు వాక్యాలు కలిపి పెద్దదిగా చేస్తాం. వరలక్ష్మిగారు గొప్పనటి. వారి మాటను మనం కాదనట మెందుకు? డైలాగును తగ్గించు’ అన్నారు. ఆరుద్ర ‘సరే!’ అన్నారు.

◆ డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి

● పురస్కారం

# విహారి గారి వసుధైక కుటుంబం

విహారి గారి కథలన్నీ చదివాక, ప్రత్యేకంగా ఆయన వ్యక్తిత్వాన్ని పట్టిచ్చే కథేమిటని ప్రశ్నించుకుంటే, అందుకు సమాధానంలా, ‘వలయం’ నాముందు నిటారుగా నిలబడింది. తాను ఎన్నిక చేసిన కథల సంపుటికి, ఆ కథనే మొదటి కథగా తీసుకోవడం వెనక, ఆ కథ తన సాహితీ జీవనానికి ముందుమాటగానో, భూమికగానో ఆయన భావించినట్టుగా తోచింది.



జనవరి 5న అజో విభొ కందాళం వారి విశిష్ట సాహితీమూర్తి జీవన సాఫల్య పురస్కారాన్ని విహారి అందుకుంటున్న సందర్భంగా.

కొడుకు జీవితంలో ఎదురుదెబ్బలు తగిలినప్పుడల్లా వాడికి తోడ్పడటం తండ్రి బాధ్యత. కొడుకు సమస్యల్ని తండ్రి పరిష్కరించడంలో ఆశ్చర్యమేముంటుంది? ‘వలయం’లోని కథకుడు దూరపు బంధువుల ఇబ్బందులకే గాదు, పరిచితులైన వాళ్ళెవరడిగినా, వాళ్ళకు తోడ్పడటం తన బాధ్యతగా భావిస్తారు. తన సహాయం వల్ల సుఖపడ్డవాళ్ళు, తనపట్ల కృతజ్ఞతల్ని వెల్లడించబోతే, అందులో తాను చేసిన పనేమీ పెద్దదిగాదని నమ్ముతాడు. ఎదుటి మనిషి మనస్సుకు నొప్పి కలగకుండా జాగ్రత్తపడుతూ, అతను అప్పజెప్పిన బాధ్యతను చిరునవ్వుతో, ఆత్మవిమర్శ చేసుకుంటూనే, చేసుకుపోతాడు. ఈ బాధ్యతల వలయం నుంచి ఆ కథకుడు బయటపడాలని ఎప్పుడూ అనుకోడు.

కథకుడుగా విహారి బాధ్యత గుర్తెరిగిన రచయిత అనీ, ఆ కర్తవ్య నిర్వహణ నుంచీ తప్పుకోవడం ఆయనకు అసాధ్యమనీ చెప్పడానికి అయిదు దశాబ్దాల ఆయన రచనలే పెద్ద సాక్ష్యం. 1970, 80ల మధ్యలో ఆంధ్రపత్రిక, భారతి, ఆంధ్రప్రభ, యువ, జ్యోతి వంటి పత్రికల్లో మధ్య తరగతికి చెందిన రచయితలే పుంఖానుపుంఖాలుగా కథలు రాశారు. వాళ్ళందరిలోనూ ఇప్పటి వరకూ ఆపకుండా రాస్తున్న కథకులు విహారిగారొక్కరే!

కథ చెప్పడంలో ఆయనది ప్రసన్నకథా కవితార్థయుక్తే! స్నేహంగా, ఆర్ద్రంగా, భుజంపైన చెయ్యేసుకుని నడుస్తున్న స్నేహితుడు కథ చెప్తున్నట్టుగా ఉంటాయి ఆయన కథలు. తొలినాటి కథకులందరిలాగే ఆయనది కూడా మౌఖిక ధోరణి. చాలా కథల్లో కథ చెప్పేవ్యక్తి కథలోని పాత్రే అయివుంటాడు. కొన్ని సార్లు ప్రధాన పాత్రగానూ, మరికొన్నిసార్లు చిన్న పాత్రగానూ ఉంటాడు. సర్వసాక్షి కథనం ఉన్న కథల్లో, రచయిత స్వభావం, వ్యక్తిత్వం, కథనంతా తీర్చిదిద్దుతుంది. అలా ఆయన కథలన్నింటిలోనూ పరుచుకున్న విహారి వ్యక్తిత్వం ‘వలయం’ కథలోని కథకుడి స్వభావానికి దగ్గరగా ఉంటుంది. తన ప్రేమను తన కుటుంబానికి పంచినంత నిబద్ధతతోనే మొత్తం సమాజానికీ పంచుతాడు. మధ్యతరగతి పునాదులపైన విస్తరిల్లిన మన దేశపు సౌభాగ్యానికి, మధ్య తరగతి వాళ్ళ మానవీయ విలువలే ఆధారమని చాటిస్తాడు. మధ్యతరగతిలో ఉండే కుహనా విలువల్ని వదులుకునే మార్గాల కోసం అన్వేషిస్తాడు. విహారిగారి స్వాభావికమైన ఈ జీవన విధానానికి పెరిగిన కొమ్మలూ, ఆకులూ, పువ్వులూ, పళ్లే ఆయన రచనలు.

విహారి కథా ప్రపంచంలోకి అడుగుపెట్టడమంటే అది సమకాలీన సమాజపు కోణాలన్నింటినీ పరామర్శించడమే. కథకుడుగా ఆయన చాలా అప్రమత్తంగా ఉంటాడు. తన తరువాతి తరాలనూ సానుభూతితో అర్థం చేసుకోవడానికే ప్రయత్నిస్తాడు. అధో జగత్ సోదరులనూ, కింది మధ్య తరగతి వాళ్లనూ ‘డబ్బు’ ఎంతగా వేధిస్తుందో ఆయనకు బాగా తెలుసు. మధ్య తరగతి మనుషుల జీవితాల్ని చిన్నాభిన్నం చేస్తున్న వ్యాపార సంబంధాల్ని నిరసిస్తున్న కథల్లో గూడా ఆయన మానవ సంబంధాల మాధుర్యాన్ని నొక్కి చెప్పడం మరిచిపోరు. ఎదిగిన కూతుర్ని రాబందుల బారి నుంచీ తప్పించడం కోసం నానా బాధలు పడే తల్లులూ, పుస్తకాన్ని కొనగలిగే అయిదు రూపాయల కోసం ప్రమాదకరమైన పందెపు బరిలో దిగే కుర్రాళ్ళూ, బతుకు బరువు మోయడానికి ఇష్టంలేని పాతరోత పనులలోనే ముడుచుకుపోవడానికి సిద్ధపడే నిర్భాగ్యులూ, కూతుళ్ళకు పెళ్ళి చేయాల్సిన వయస్సులో గూడా నిస్సిగ్గుగా బిడ్డల్ని కనే తండ్రులూ, ఈ మధ్య తరగతి విలాపాలూ, విలాసాలూ విహారి సాహిత్య ప్రపంచంలో మనకెదురౌతారు.

విహారి గారికి ధర్మాగ్రహం. పీడనలోంచి పీడనే పుడుతుందని ఆయన హెచ్చరిస్తారు. సమాజంలో ఇంత దుర్మార్గముండడానికున్న కారణాలను ఆయన కథలన్నీ తరచి చూస్తాయి. ఈ లోకాన్ని మరింత అందంగా తయారుచేయడమెలాగో సూచిస్తాయి.

◆ మధురాంతకం నరేంద్ర

● గ్రేట్ రైటర్

# జీవితం అంతుచూసిన కవి



హైనరిష్ వన్ క్లైస్ట్

పంతొమ్మిదో శతాబ్దపు జర్మన్ సాహిత్యంలో ఒక అలలా ఎగిసినవాడు హైనరిష్ వన్ క్లైస్ట్ (Heinrich von Kliest). నాటకకర్త, కవి, పాత్రికేయుడు అయిన క్లైస్ట్‌ను తదనంతరపు జర్మన్, ఫ్రెంచ్ కవులు ఒక నమూనాగా తీసుకున్నారు. 1777లో బెర్లిన్‌లో జన్మించిన క్లైస్ట్, కొంతకాలం సైన్యంలో పనిచేశాడు. ‘ఏడు విలువైన సంవత్సరాలను కోల్పోయిన’ తర్వాత సైనికోద్యోగిగా రాజీనామా చేశాడు. ఉన్నత చదువులు ప్రారంభించినా, జ్ఞానం అనేది అర్థ రహితం అన్న అవగాహనతో వాటిని కొనసాగించలేదు. హేతువును పక్కనపెట్టి, ఉద్వేగానికి మాత్రమే ప్రాముఖ్యతనిచ్చాడు. లోపలి అశాంతి దొరికిన ఉద్యోగంలో కుదురుకోనివ్వలేదు. ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ లాంటి దేశాలు తిరిగాడు. గూఢచారి అన్న అనుమానాల మీద జైలులో కొంతకాలం నిర్బంధించబడినాడు. ఇక్కడే ‘ద ఫ్రోఫెన్‌స్టెయిన్ ఫ్యామిలీ’ నాటకం రాశాడు. మరో నాటకం ‘రాబర్ట్ గిస్కార్డ్’ రాతప్రతుల్ని కాల్చేశాడు. అత్యంత గాఢమైన కవిత్వంతో మాస్టర్‌పీస్‌గా ఇప్పుడు కొనియాడబడుతున్న ‘పెంథెసిలియా’కు సమకాలీన సాహితీ ప్రపంచం పెద్దగా స్పందించలేదు. ఎనిమిది నవలికలు రాశాడు. అందులో ‘ద అర్త్‌క్వేక్ ఇన్ చిలీ’ని ఇప్పుడు క్లాసిక్‌గా పరిగణిస్తున్నారు. ద ప్రిన్స్ ఆఫ్ హాంబర్గ్, ద బ్రోకెన్ జగ్ ఆయన ఇతర రచనలు. నెపోలియన్‌కు వ్యతిరేకంగా దేశాన్ని కూడగట్టడానికి ఒక రాజకీయ పత్రికను స్థాపించడానికి విఫలయత్నం చేశాడు. మరో పత్రికకు ఆరు నెలలు సంపాదకుడిగా ఉన్నాడు. ఇది మూతపడటంతో బతుకుతెరువు కోల్పోయాడు. వీటన్నింటిమధ్య అప్పటికే పెద్ద పేరున్న కవి గొథేతో నాటక ప్రదర్శన విషయంలో తీవ్రమైన విభేదాలు వచ్చాయి. జీవితం పట్లా, సాహిత్యం పట్లా ఏ విధమైన ఆశ కనబడని దశలో– సంగీతంతో గాఢమైన పరిచయం ఉన్న యువతి హెన్రియెట్ వొగెల్ ఆయనకు పరిచయమైంది. అనారోగ్యంతో తన చివరి రోజులు గడుపుతున్న వొగెల్‌తోపాటు తాను కూడా జీవితం నుంచి సెలవు తీసుకోవడానికి నిశ్చయించుకున్నాడు. 1811 నవంబర్ 21న ఇద్దరూ వాన్‌సీ తీరానికి చేరుకున్నారు. అంతకుముందే ఫేర్‌వెల్ లెటర్స్ రాశారు. ముందుగా వొగెల్‌ను కాల్చి, అదే పిస్టల్‌ను తనవైపు తిప్పుకున్నాడు క్లైస్ట్. జర్మనీలో అత్యున్నత సాహితీ పురస్కారం ‘క్లైస్ట్ ప్రైజ్’ను ఆయన పేరు మీదుగా ఇస్తున్నారు.

● రారండోయ్

▼ అజో–విభో–కందాళం, కోన ప్రభాకరరావు నాటక కళాపరిషత్ సంయుక్త నిర్వహణలో 27వ వార్షిక సభలు జనవరి 2, 3, 4, 5 తేదీల్లో గుంటూరు జిల్లా బాపట్లలోని కోన కళాక్షేత్రంలో జరగనున్నాయి. విశిష్ట పురస్కారాల ప్రదానం, సాహితీ సాంస్కృతిక సదస్సులు, కథానాటక పోటీలు ఉంటాయి. విశిష్ట రంగస్థల పురస్కారాన్ని వల్లూరు శివప్రసాద్‌కూ, విశిష్ట సాహితీమూర్తి పురస్కారాన్ని కె.వరలక్ష్మికీ, జీవితకాల సాధన పురస్కారాన్ని విహారికీ ప్రదానం చేస్తారు. పురస్కారాల నగదు వరుసగా: 25 వేలు, 50 వేలు, లక్ష.


▼ డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య మూడు పుస్తకాలు– వ్యాస భారతి, రుబాయీ కావ్యాలు సతీ స్మృతి, స్నేహ సుధ ఆవిష్కరణ సభ జనవరి 1న సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరగనుంది. కె.వి.రమణ, ఎల్లూరి శివారెడ్డి, కె.ఐ.వరప్రసాద రెడ్డి, అయిత చంద్రమౌళి పాల్గొంటారు. నిర్వహణ: రసమయి.


▼ పరేశ్ దోశి రాసిన హిందీ సినిమాల్లోని అతడు–ఆమె గీతాల పరిచయం ‘తేరే బినా జిందగీ’ ఆవిష్కరణ సభ జనవరి 4న సాయంత్రం 5 గంటలకు యూసుఫ్‌గూడ మెట్రో స్టేషన్ దగ్గరి ఎన్‌ఐఎంఎస్‌ఎం, స్ట్రీట్ నం.4, రహమత్ నగర్, హైదరాబాద్‌లో జరగనుంది. ఎం.ఎం.కీరవాణి, సి.మృణాళిని, కలగా కృష్ణమోహన్ పాల్గొంటారు. నిర్వహణ: ఛాయ, కవి సంగమం.

▼ మల్లాది రామకృష్ణశాస్త్రి రచన ‘కేళీగోపాలమ్’ ఆవిష్కరణ సభ జనవరి 4న సాయంత్రం 6 గంటలకు బంజారాహిల్స్ రోడ్ నం.8లోని సప్తపర్ణిలో జరగనుంది. పప్పు వేణుగోపాలరావు, జయప్రభ, మల్లాది రాజేశ్వరశాస్త్రి, వీఏకే రంగారావు పాల్గొంటారు.

▼ శాంతి రజనీకాంత్ స్మారక కథాపురస్కారాన్ని ‘సీమేన్’ కథాసంపుటికిగానూ అద్దేపల్లి ప్రభుకు జనవరి 5న ఉదయం 10:30కు అనంతపురంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో ప్రదానం చేయనున్నారు. ఎం.ప్రగతి, తెలకపల్లి రవి, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, బండి నారాయణ స్వామి పాల్గొంటారు. నిర్వహణ: శాంతి నారాయణ.


● ఈవారం పుస్తకాలు





**పుంజీతం** (కథలు)
రచన: డాక్టర్ వెల్దండి శ్రీధర్; పేజీలు: 112; వెల: 100; ప్రతులకు: వెల్దండి సురేఖ, ఫ్లాట్ నం. 302, సాయి శ్రీనివాసం అపార్ట్‌మెంట్, రీట్రీట్ కాలనీ, ఫాదర్ బాలయ్య నగర్, ఓల్డ్ ఆల్వాల్, హైదరాబాద్. ఫోన్: 9866977741

**సముద్ర స్వరం**
(‘వివి కవిత్వంతో ఒకరోజు’ సాహిత్య సభ ప్రసంగ వ్యాసాలు)
పేజీలు: 192; వెల: 150; ప్రచురణ: పాలమూరు అధ్యయన వేదిక; ప్రతులకు: ఎం.రాఘవాచారి, ఫ్లాట్ నం. 41, ఇంటి నం. 14-3-148, బాలాజీ నగర్, మహబూబ్‌నగర్. ఫోన్: 9490703857





**కశ్మీర్: బహిరంగ చెరసాల** (వ్యాసాలు)
సంపాదకుడు: ఎస్.ఎ.డేవిడ్; పేజీలు: 216; వెల: 170

**22 మే హాషింపురా**
(మరుగునపడ్డ పోలీసు హత్యాకాండ)
రచన: విభూతి నారాయణ్ రాయ్; అనువాదం: వి.వి.జ్యోతి; పేజీలు: 144; వెల: 150; ప్రతులకు: మలుపు బుక్స్, 3-6-677/2, ఫ్లాట్ నం. 302, ఎం.ఎస్.కె. టవర్స్, స్ట్రీట్ నం. 11, హిమాయత్ నగర్, హైదరాబాద్–29. ఫోన్: 9866559868





**కాగితం పడవలు** (ప్రేమలు-కథలు)
రచన: వి.మల్లికార్జున్; పేజీలు: 108; వెల: 150; ప్రతులకు: అజు పబ్లికేషన్స్. ఫోన్: 9381110979

**ది జర్నీ ఆఫ్ ఎ జర్నలిస్ట్**
రచన: కంభాలపల్లి కృష్ణ; పేజీలు: 160; వెల: 100; ప్రతులకు: భూమి బుక్ ట్రస్ట్, ఎస్‌ఆర్‌టీ 267/1, జవహర్ నగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్ దగ్గర, హైదరాబాద్. ఫోన్: 9849908929

**రివాజు: తెలంగాణ కథ-2018**
సంపాదకులు: సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్; పేజీలు: 132; వెల: 70; ప్రతులకు: సంగిశెట్టి, నందనవనం అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నం. 212, అత్తాపూర్, మెహిదీపట్నం, హైదరాబాద్–48. ఫోన్: 9849220321



**సిరా** (నవల)
రచన: రాజ్ మాదిరాజు; పేజీలు: 268; వెల: 250; ప్రతులకు: ఆన్వీక్షికి పబ్లిషర్స్ ప్రైవేట్ లిమిటెడ్, అజ్రా హౌజ్, ఎమ్మెల్యే కాలనీ, బంజారా హిల్స్, హైదరాబాద్. ఫోన్: 9705972222



బుక్ ప్రపంచం

పుస్తక ప్రదర్శనకు ఇలా మారువేషంలో వెళ్లి, స్టాలు స్టాలులో నా పుస్తకం నలభై కాపీలు యాభై కాపీలు కావాలని అడిగి డిమాండ్ సృష్టిస్తా చూస్కో. హ! హ! హ!






### గ్రహం అనుగ్రహం

శ్రీవికారినామ సంవత్సరం. దక్షిణాయనం, హేమంత ఋతువు. పుష్యమాసం. తిథి శు.చవితి ప.12.54 వరకు, తదుపరి పంచమి. నక్షత్రం ధనిష్ఠ రా.10.21 వరకు. తదుపరి శతభిషం. వర్జ్యం లేదు. దుర్ముహూర్తం ప.12.23 నుంచి 1.07 వరకు, తదుపరి ప.2.35 నుంచి 3.21 వరకు. అమృత ఘడియలు ఉ.11.03 నుంచి 12.45 వరకు

**సూర్యోదయం:** 6.34 **సూర్యాస్తమయం:** 5.32
**రాహుకాలం:** ఉ.7.30 నుంచి 9.00 వరకు.
**యమగండం:** ఉ.10.30 నుంచి 12.00 వరకు



**నమాజ్ వేళలు**
ఫజర్: 5.28
జొహర్: 12.18
అసర్: 4.16
మగ్రీబ్: 5.52
ఇషా: 7.09

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

హాలీవుడ్ / 2019

# మగధీరుడు

తమకేం కావాలో స్త్రీలకు ఉన్నంత స్పష్టత పురుషులకు లేకపోవడం వల్ల స్త్రీలకేం కావాలన్న విషయమై పురుషులెప్పుడూ అస్పష్టంగానే ఉంటారు. హాలీవుడ్ ఈ పాయింట్‌ని పట్టుకుని పురుషుడిని పూర్తిగా ఉద్వేగ ప్రాణిని చేసి అతడి మగధీరత్వంపై సందేహాలు రాజేసింది. లేదా అతడిని పరిపూర్ణ మానవుడిగా చూపే ప్రయత్నమైనా కావచ్చది!

● మాధవ్ శింగరాజు

మగవాళ్ల ప్రపంచం వేరుగా ఉంటుంది. ‘మగ ప్రపంచం’ అంటూ ఒకటి ఉన్నా లేకున్నా అలాంటిదొకటి ఉంటుందని అనుకునేలా పుట్టుక నుంచి మగవాళ్లు ఉంటుంటారు కనుక.. ఎప్పుడైనా మగవాళ్లు, ఎందుకైనా మగ వాళ్లు ఆ మగ ప్రపంచంలో కనిపించకపోతే మగవాళ్లలా అనిపించరు. అప్పుడు ‘పాపం’ అనిపిస్తుంది. ‘పాపం మగాళ్లు’ అని! సమాజం మీద పడి దౌర్జన్యంతో సహాయాలు పొంది జీవిస్తుండే స్వార్థపరుడైన మానవుడు హటాత్తుగా ‘నేను మీకు సహాయపడగలనా?’ అని అదే సమాజం మీద పడి అడుగుతూ పోతుంటే కలిగే ఆశ్చర్యం నుంచి జనించే ‘పాపం’ అనే భావన అది.

‘ఆడవాళ్లకేం కావాలి?’ అనే ప్రశ్న వేసుకుని, సమాధానం కోసం జీవితమంతా అన్వేషించి, అన్వేషణ పూర్తిగా ఫలించకనే అసువులు బాసిన సిగ్మండ్ ఫ్రాయిడ్ ఆ ప్రశ్నేదో అడవాళ్లనే అడిగి ఉంటే ఆయన్ని వాళ్లు కొంతలో కొంతైనా సంతృప్తిగా సాగనంపేవారు.. ఆయనకు అర్థం అవగలిగినంత అర్థం చేయించి! తమకేం కావాలో స్త్రీలకు ఉన్నంత స్పష్టత పురుషులకు లేకపోవడం వల్ల స్త్రీలకేం కావాలన్న విషయమై పురుషులెప్పుడూ అస్పష్టంగానే ఉంటారు. ‘ఆడవాళ్లకేం కావాలి?’ అని కాకుండా.. ‘మగవాళ్లకేం కావాలి?’ అని ఫ్రాయిడ్ తవ్వకాలు జరపకపోవడానికి.. మగవాళ్లకు ఏం కావాలన్న దానిపై తనకొక స్పష్టత ఉన్నట్లు ఆయన పొరపడి ఉండటం ఒక కారణం అయి ఉండొచ్చు.



మ్యారేజ్ స్టోరీ | భార్య నికోల్ కాళ్లపై చార్లీ



ది ఐరిష్‌మ్యాన్ | ప్రీస్ట్‌తో ఫ్రాంక్ షీరన్ (కుడి)

మగవాళ్లకు అధికారం కావాలి. అనుకున్నది సాధించడం కావాలి. అవసరం లేనంత డబ్బు కావాలి. ఆడవాళ్లు కావాలి. గుండె నిండా పీల్చి వదలడానికి ఒక సిగరెట్ కావాలి. దూకుడుగా పరుగులెత్తించడానికి కారు కావాలి. ఎవరి ముక్కునైనా బద్దలు కొట్టడం కావాలి. తనొక హీరో కావడం కావాలి. తననే అందరూ చూడటం కావాలి. తనను ‘మగాడు’ అనడం కావాలి. తేలికా మరి మగాడు మగాడిలా ఉండటం? కావచ్చేమో. మగాడిలా ఉన్న మగాడు ఎప్పటికీ మగాడిగా ఉండిపోవడం మీదే సందేహాలన్నీ!

చక్రాల కుర్చీలో చంకల కింది కర్రల్ని ఒళ్లో పెట్టుకుని కూర్చొని ఉన్నాడు అతడు. ఖరీదైన చిన్న చీకటి గది. ఒంటరితనానికి ఫ్లోర్ ల్యాంప్, పాతకాలం టీవీ, టీపాయ్, కొక్కేల స్టాండు, మరొక కుర్చీ.. వీటిని అమరిస్తే ఎలా ఉంటుందో అలా ఉంది ఆ గది. పశ్చాత్తాపానికి వస్తురూపం ఉండదు కనుక అదొక్కటీ కనిపించడం లేదు.

‘‘క్రిస్మస్సా ఈరోజు’’.. అడిగాడు అతడు. ‘సండేనా ఈరోజు’, ‘మండేనా ఈరోజు’ అన్నట్లు అడిగాడు. పాపం అనిపిస్తుంది అతడు ఆ మాట అడుగుతుంటే. ఒకనాటి నేర సామ్రాజ్యపు చక్రవర్తి చక్రాల కుర్చీకి పరిమితమై కాల స్పృహ లోపించి.. రాబోయే క్రిస్మస్ కోసమో, వచ్చిపోయిన క్రిస్మస్ కోసమో ఎదురు చూస్తూ ఉండటం.. తన కోసం వచ్చిపోతుండే ప్రీస్ట్‌కి ఎలాంటి భావమూ కలిగించదు.


‘‘మళ్లెప్పుడొస్తారు?’’ అని అడుగుతాడు ప్రీస్ట్‌ని. ‘‘క్రిస్మస్ తర్వాత’’ అంటాడు ఆయన, తలుపును దగ్గరగా వేసి వెళ్లబోతూ. ‘‘పూర్తిగా వెయ్యకుండా కాస్త తెరిచి ఉంచండి’’ అని ఆయన్ని కోరుతాడు అతడు. లోపల తనంటూ ఒక వ్యక్తిని ఉన్నానని లోకానికి తెలియడం కోసం కావచ్చు. ‘ది ఐరిష్‌మ్యాన్’ చిత్రంలోని చివరి సన్నివేశం ఇది. మగాడిలా బతికిన ఫ్రాంక్ షీరన్.. చివరి దశలో మనిషి చూపు కోసం, మనిషి స్పర్శ కోసం బతుకు ఈడుస్తుంటాడు కన్ఫెషన్ బాక్స్ లాంటి ఆ గదిలో.

ఈ ఏడాది హాలీవుడ్ చిత్రాలన్నిటిలోనూ పురుషుడు హాఫ్ బేక్డ్‌గానే కనిపించడంపై మనోహ్లా దర్గీస్ న్యూయార్క్ టైమ్స్‌లో మంచి ఇయర్ ఎండింగ్ రివ్యూ రాశారు. మంచి అంటే సెన్సిబుల్ రివ్యూ. మగాళ్లకేదో తక్కువైంది అనకుండా.. వాళ్లింకా ఏదో (మగతనాన్ని మించినది) ఎక్కువగా కోరుకుంటున్నారని!

‘మ్యారేజ్ స్టోరీ’ చిత్రంలోని చార్లీది కూడా అటూఇటుగా ఫ్రాంక్ షీరన్ పరిస్థితే. ఫ్రాంక్‌ని వదిలి అతడి కుటుంబం దూరంగా వెళ్లిపోతే, చార్లీ నుంచి దూరంగా వెళ్లిపోడానికి చార్లీ భార్య నికోల్ కట్టుబట్టల్తో ప్రతిరోజు, ప్రతి నిముషం సిద్ధంగా ఉంటుంది. చార్లీ ఆమెను వెళ్లనివ్వడు. ‘నువ్వు, హెన్రీ లేకుండా నేను బతకలేను’ అంటాడు. మగాడేనా అనిపిస్తుంది. మగాళ్లేమిటి ఇలా తయారయ్యారనిపిస్తుంది. ‘పోతే పో.. నువ్వే ఎప్పటికైనా నా కాళ్ల దగ్గరికి వస్తావ్.. దిక్కులేని దానిలా..’ అనాలి కదా మనకు తెలిసినంత వరకు మగాడంటే. అనడు. కొడుకు హెన్రీని దగ్గరకు లాక్కుంటాడు. కొడుకును చార్లీ చేతుల్లోంచి లాక్కుని వేరే వెళ్లిపోతుంది నికోల్. తనకంటూ ఓ జీవితం లేకుండా చేశాడని భర్త మీద ఆమె కంప్లయింట్. ఎప్పుడూ తన కెరీర్‌నే చూసుకుంటాడు. తన కెరీర్ గురించే చెబుతుంటాడు. ఆమెకూ ఓ కెరీర్ ఉందని, ఆ కెరీర్‌లోనూ కొన్ని విశేషాలు ఉంటాయని, వాటిని వినేందుకు తను శ్రద్ధ చూపాలని అనుకోడు. ఆమె నటి. అతడు రంగస్థల దర్శకుడు. చుట్టూ అమ్మాయిలు. వాళ్లలో ఓ అమ్మాయితో అఫైర్ ఉందని కూడా ఆమె అనుమానం. మొత్తానికి విడిపోతారు. చివర్లో మళ్లీ కలుసుకుంటారు. అదీ చార్లీ ప్రయత్నం వల్లనే. గదిలోకి రాగానే ఇద్దరే ఉన్నప్పుడు ఆమె కాళ్లను గట్టిగా పట్టేసుకుంటాడు చార్లీ.. వదిలితే మళ్లీ ఎక్కడ వెళ్లిపోతుందో అన్నంత గట్టిగా.. అభద్రతగా.

మగాళ్ల దృష్టిలో ఇది పరువుపోయే ‘లొంగుబాటు’ లేదా ‘కృంగుబాటు’. మనోహ్లా దర్గీస్ మాత్రం దీనిని.. మగవాళ్లు బరువును దించుకోవడం అంటున్నారు. ఫిల్మ్ క్రిటిక్ ఆవిడ. ఏముంటుంది ఈ మగాళ్లపైన దించుకునేంత బరువు! భార్యా పిల్లల్ని పట్టించుకోకుండా పెద్ద మగాళ్లలా సమాజాన్ని ఉద్ధరించడమేగా? అవును.. అదే బరువు. మాస్క్యులినిటీని (మగధీరత్వాన్ని) మోయవలసిన బరువు. హాలీవుడ్ ఇప్పుడు తమ కథానాయకుల నుంచి ఆ బరువును దింపే ప్రయత్నం చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఈ ఏడాది ఒక్క హీరోను కూడా ఫుల్ లెంగ్త్ హీరోగా చూపించలేదు హాలీవుడ్! నువ్వు మగాడివైతే కావచ్చు. మనిషిని మించినవాడివైతే కాదు అని చెప్పడమా ఇది? కావచ్చు. మనిషనే ప్రాణికి ఉద్వేగాలు తప్పనప్పుడు ఎంత మగాడైతే మాత్రం ఉద్వేగాలనుంచి తప్పించుకోగలడా? ఫ్రోజన్ 2, యాడ్ ఆస్ట్రా, ఎ బ్యూటిఫుల్ డే ఇన్ ది నైబర్‌హుడ్, ట్రిపుల్ ఫాంటియర్, 1917, ది కిచెన్, హస్లర్స్, వన్స్ పాన్ ఎ టైమ్ ఇన్ హాలీవుడ్.. ఈ చిత్రాలన్నిటిలోనూ పురుషుడు హాఫ్ బేక్డ్‌గానే కనిపించడంపై మనోహ్లా న్యూయార్క్ టైమ్స్‌లో మంచి ఇయర్ ఎండింగ్ రివ్యూ రాశారు. మంచి అంటే సెన్సిబిల్ రివ్యూ. మగాళ్లకేదో తక్కువైంది అనకుండా.. వాళ్లింకా ఏదో (మగతనాన్ని మించినది) ఎక్కువగా కోరుకుంటున్నారని రాశారు. ఊరికే కోరుకోవడం కాదు. పడి చావడం! భార్యతో, తల్లిదండ్రులతో, తోబుట్టువులతో, స్నేహితులతో.. అనుబంధాల కోసం, ఆత్మీయతల కోసం దాహ పడడం. అది ఈ సినిమాల్లో కనిపిస్తుంది.

‘ది ఐరిష్‌మ్యాన్’ థియేటర్‌లలో ఆడుతున్నప్పుడు బోర్ కొట్టి ప్రేక్షకులు మధ్యలోనే లేచి వెళ్లిపోయారట. బోర్ కొట్టే ఎందుకు అనుకోవాలి. సినిమా చూస్తున్నప్పుడు ఏ సన్నివేశంలోనో మనసు లోపలి ‘స్ట్రింగ్’ కదిలి, బోరున ఏడ్వడానికి వాష్‌రూమ్‌లోకి వెళ్లి ఉండొచ్చు కదా. లేదా సిగరెట్ తాగుతూ ఏ ఒంటరితనంలోనికో.. రెండు నిముషాల పాటు. ●



# గ్రేటా ది గ్రేట్

**జోన్ ఆఫ్ ఆర్క్.. ది గ్రేట్! చే గువేరా.. ది గ్రేట్!**
**మార్టిన్ లూథర్ కింగ్.. ది గ్రేట్!**
**ఈ వరుసలో.. ఇప్పుడు గ్రెటా థన్‌బర్గ్.. ది గ్రేట్!**
**ఏంటి! తోస్తే పడిపోయేట్లు ఉండే ఈ అమ్మాయా!**
**ఆమె పడిపోవడం కాదు.**
**ప్రపంచాన్ని నిలబెట్టడానికి పిడికిలి బిగించింది.**
**అందుకే ఈ ఏడాది ప్రతి దేశంలోనూ గ్రెటానే.. ‘పర్సన్ ఆఫ్ ది ఇయర్’.**
**దేశాలు ఈ టైటిల్ ఇవ్వకపోవచ్చు. దేశ దేశాల ప్రజలు ఇచ్చేశారు.**

ప్రకృతి విధ్వంసం గురించి వేలాదిమంది కార్యకర్తలు, శాస్త్రవేత్తలు, చివరకు ఐక్యరాజ్యసమితి వంటి ప్రపంచ వేదిక సైతం దశాబ్దాలుగా చేయలేకపోయిన పనిని ఆ చిన్నారి అతి తక్కువ వ్యవధిలో సాధించింది. పర్యావరణం పేరిట జరుగుతున్న రాజకీయాలను తోసిపారేసింది. ప్రకృతి రక్షణపై చిన్నచూపు చూస్తున్న ప్రపంచ నాయకులను ఐరాస వేదికగా ‘హౌ డేర్ యు’ అంటూ నిలదీసింది. అక్కడితో ఆగిపోలేదు. పర్యావరణం పట్ల ప్రపంచ దృక్పథాన్నే తాను మార్చివేసింది. అప్పటికే ప్రపంచాన్ని కాలుష్యం బారి నుంచి కాపాడుకోవాలని పోరాడుతున్న వారికి కొండంత స్థైర్యం కలిగించింది.

**నిఘంటువులు చోటిచ్చాయి**

పర్యావరణ సమ్మె పేరిట 2018 ఆగస్టులో స్కూలు దాటి బయటకొచ్చిన ఆమె.. పదహారు నెలల వ్యవధిలో ప్రపంచాన్ని సుడిగాలిలా చుట్టేసింది. స్వీడిష్ పార్లమెంట్ ముందు ఒంటరిగా ‘పర్యావరణం కోసం పాఠశాల సమ్మె’ మొదలెట్టింది. ఆ తర్వాత ఐక్యరాజ్యసమితిలో ప్రపంచ అధినేతలను సవాలు చేసింది. పోప్‌ను కలిసింది. అమెరికా అధ్యక్షుడు వంకర ట్రంప్‌ను ఈసడించింది. 2019 సెప్టెంబర్ 20న తలపెట్టిన ప్రపంచ పర్యావరణ సమ్మె సందర్భంగా నలభై లక్షల మందికి ప్రేరణ కలిగించింది. మానవ చరిత్రలో అతిపెద్ద పర్యావరణ ప్రదర్శనకు నాయకత్వం వహించింది. లాటిన్ అమెరికా విప్లవ యోధుడు చేగువేరా తర్వాత అంతటిస్థాయిలో తన చుట్టూ వీరారాధనను సృష్టించుకుంది. కొందరు ఆమెను జోన్ ఆఫ్ ఆర్క్ అని పిలిచారు. కొందరు ఆమెను ప్రపంచ నిగూఢ రహస్యాన్ని తన చిరునవ్వులో దాచిన మోనాలీసాతో పోల్చారు. వీటన్నిటికి మించి ఆమె స్వీడన్ పార్లమెంటు ముందు కూర్చుని పలికిన ‘పర్యావరణ సమ్మె’ అనే పదాన్ని ఈ సంవత్సరం మొత్తంలో విశిష్ట పదంగా నిఘంటువులు సైతం పొందుపర్చాయి.

**ప్రభుత్వాలు తలవంచాయి**

ఇంతటి ఉద్యమ స్ఫూర్తిని ఇచ్చిన గ్రెటా థన్‌బెర్గ్ అంతా చేసి 16 ఏళ్ల బాలిక. మానవ చరిత్రలో కెల్లా మహిమాన్విత ప్రసంగాల్లో మొదటిది ఐ హ్యావ్ ఎ డ్రీమ్ (నేను కల కంటున్నాను) అనే మార్టిన్ లూథర్ ప్రసంగంగా అందరికీ తెలుసు. ఐక్యరాజ్యసమితి వేదికపై నిల్చుని.. ‘‘మా చిన్ని ప్రపంచాన్ని, మా కలల్ని కూల్చివేయడానికి మీకెంత ధైర్యం’’ అంటూ గ్రెటా చేసిన ప్రసంగం ఆ స్థాయిలో నిలుస్తోంది. పర్యావరణ రక్షణ కోసం పోరాడుతున్న వారికి, దాన్ని పట్టించుకోని వారికి మధ్య ఆమె నైతికపరమైన లక్ష్మణరేఖను గీసింది. తమ దేశాల్లో కాలుష్యానికి కారణమవుతున్న కర్బన ఉద్గారాలను పూర్తిగా నిర్మూలిస్తామని దేశాధినేతలు, ప్రభుత్వాలు సైతం అంగీకరించేటట్లు చేసింది. శారీరకంగా చూస్తే.. తోస్తే పడిపోయేటట్లు కనిపించే అర్భకురాలు. కానీ ప్రపంచంలో పర్యావరణానికి కలిగిస్తున్న అన్యాయాలను నిలదీస్తూ లెబనాన్ నుంచి లైబీరియా వరకు లక్షలాది టీనేజ్ గ్రేటాలు పాఠశాలలు వదిలి పర్యావరణ సమ్మెలో పాల్గొనేలా చేసిన ప్రేరణ కర్త ఆమె.

> ప్రపంచ భవిష్యత్తు రథ సారథిగా రూపొందుతున్న గ్రెటా వ్యక్తిత్వాన్ని అంచనా వేయడం కష్టం కావచ్చు కానీ.. ఆమె పంథా జోన్ ఆఫ్ ఆర్క్‌లా, చే గువేరాలా సాయుధ పంథా అయితే కాదు. కచ్చితంగా అది గాంధీవాదానికి ఆధునిక రూపం.

**‘టైమ్’ పత్రిక గ్రేట్ అంది**

గ్రెటా.. టైమ్ పత్రిక తరపున 2019 పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది. జన్మ సార్థకతకు చిహ్నంగా అందరూ భావించే ఈ ప్రతిష్ఠాత్మకమైన గౌరవాన్ని కూడా ఆమె పట్టించుకోలేదు. ప్రపంచ ఆర్థిక వేదికపై ప్రపంచనేతలు, సీఈఓల ముందు నిలబడి ప్రపంచాన్ని భయపెట్టాలని అనుకుంటున్నట్లు చెప్పిందామె. ‘‘ప్రతిరోజూ నేను పొందుతున్న భయానుభూతిని మీరందరూ అనుభూతి చెందాలని కోరుకుంటున్నాను. తర్వాతే మీరు పనిలోకి దిగాలని నా ఆశ. కానీ భయపెట్టటంలోనూ బాధ్యత ఉంది’’ అని గుర్తు చేసిందామె.

**అధినేతలు ఫాలో అయ్యారు**

పసిపిల్లల కళ్ల నుంచి ప్రపంచాన్ని చూడటం అనేది మనసును మార్చడానికి అత్యుత్తమ విధానం అని అంటుంటారు. ప్రపంచాధినేతలు ఆమె కళ్లు వెలువరిస్తున్న భావాలను అర్థం చేసుకుంటున్నారు. వారిలో కాస్త నిజాయితీగా కనిపిస్తున్న వారు ఆమె మాటలకు దాసోహమవుతున్నారు. ‘‘మనం పెద్ద నాయకులమే కావచ్చు కాని ప్రతి రోజూ, ప్రతివారం పర్యావరణ పరిరక్షణపై అలాంటి సందేశాన్ని ప్రతిచోట నుంచి ఇస్తున్నప్పుడు మనం తటస్థంగా ఉండలేం’’ అంటూ ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమాన్యువల్ మేక్రాన్ ఒప్పేసుకున్నారు. ‘‘ఈ పిల్లలు నేను మారడానికి సహాయపడ్డారు’’ అంటున్న ఆయన మాటలు ఇప్పుడు చాలామందికి కనువిప్పు కలిగిస్తున్నాయి. పర్యావరణ మార్పును పట్టించుకోని దేశాలపై పన్ను విధించాలని యూరోపియన్ యూనియన్ సిద్ధమైందంటే పసిపిల్లల నినాదాలు ఏ స్థాయిలో ఈ ప్రపంచంపై ప్రభావం చూపుతున్నాయో తెలుస్తుంది.

‘‘రేపు అనేది లేనప్పుడు, కనిపించనప్పుడు మనం జీవితాన్ని కొనసాగించలేం. కానీ మనందరికీ రేపు అనే భవిష్యత్తు ఉంది. అది అందరికీ కనబడుతోందని మాత్రమే మేం చెబుతున్నాం’’ అంటూ గ్రెటా ప్రపంచ చిన్నారుల తరపున ప్రపంచాన్ని హెచ్చరిస్తోంది. అందుకే ప్రపంచం బాధను ఆమె తన భాధగా చేసుకుందని అంటున్నారు. ప్రపంచం బాధను, నిరాశను, నిస్పృహను, కోపాన్ని వ్యక్తీకరించడంతో సరిపెట్టుకోకుండా.. ఓటు హక్కు కూడా లేని కోట్లాదిమంది చిన్నారుల భవిష్యత్తు అంధకారంలో కూరుకుపోతున్నప్పుడు... మనం బతకాలి అంటూ వేస్తున్న పెనుకేక గ్రెటా థన్‌బెర్గ్.

– శోభారాజు

### క్లాస్ రూమ్‌లో మొదలైంది



థన్‌బర్గ్ చదువుతున్న ప్రాథమిక పాఠశాల టీచర్ పర్యావరణ విపత్తుల గురించి చెబుతున్న ఒక వీడియోను క్లాసులో చూపించి వాతావరణ మార్పు వల్లే ఇదంతా జరుగుతోందని చెప్పినప్పుడు క్లాస్ మొత్తం షాక్‌కు గురైంది. పిల్లలందరూ త్వరలోనే తేరుకున్నారు. కానీ గ్రెటా కోలుకోలేకపోయింది. ధ్రువప్రాంతాల్లోని ఎలుగు బంట్లు ఆకలితో అలమటించడం, వాతావరణం పూర్తిగా మారిపోవడం, వరదలు ముంచెత్తడం చూసిన గ్రెటా 11 ఏళ్ల ప్రాయంలో తీవ్రమైన అలజడికి గురైంది. నెలలతరబడి మాట్లాడలేకపోయింది. అతి తక్కువ ఆహారం తీసుకోవడంతో ఆసుపత్రి పాలైంది. ఆ సమయంలో ఆమె పరిస్థితిని ‘అంతంలేని విషాదం’గా కన్నతండ్రే వర్ణించారు. మానవ మనుగడే ప్రమాదకర స్థితిలో ఉన్నప్పుడు దానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై తనలో ఏర్పడిన గందరగోళం చివరకు ప్రాణాలమీదికి తెచ్చిందని గ్రెటా కూడా స్వయంగా చెప్పింది.

● ముగ్గు-ముచ్చట



19 చుక్కలు
1 వరుస
1 వచ్చేవరకు
సరిచుక్క



కె. రోజా
తిరుపతి
చిత్తూరు జిల్లా



కె.దుర్గాభవాని
పెదగదిలి
విశాఖపట్నం



25 చుక్కలు
5 వరుసలు
5 వచ్చే వరకు


***ముగ్గులు పంపవలసిన చిరునామా:*** ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34. muggulu.sakshi@gmail.com

తిరుప్పావై | 15వ పాశురం

**‘ఎల్లే! ఇళంగిళియే ఇన్నమ్ ఉరంగుదియో?”**
**“శిల్లెన్రు అళైయేన్మిన్ నంగైమీర్! పోదరుగిన్రేన్”**
**“వల్లై, ఉన్ కట్టురైగళ్! పణ్డే ఉన్ వాయ్ అరిదుమ్!”**
**“వల్లర్గళ్ నీంగళే నానే తాన్ అయిడుగ!”**
**“ఒల్లై నీ పోదాయ్ ఉనక్కు ఎన్న వేరు ఉడైయై!”**
**“ఎలారుమ్ పోన్దారో? పోన్దార్ పోనుదు ఎణ్ణిక్కొళ్;**
**వల్లానై కొన్రానై, మాత్తారై మాత్తు అళిక్క**
**వల్లానై, మాయనై ప్పాడు ఏల్ ఓర్ ఎంబావాయ్”**

ఇతర ‘మేల్కొలుపు’ పాశురాల కంటే భిన్నంగా ‘భాగవత దాస్యం’ ప్రాముఖ్యతను ఎత్తిచూపుతూ ఇంటిలోనున్న కృష్ణప్రేమియైన గోపిక మాటలు కూడా కలిసి ఉన్న ప్రత్యుక్తి పాశురమిది.

చిత్రం: కేశవ్ వెంకటరాఘవన్



*(మేల్కొలపటానికి వచ్చి, ప్రవేశద్వారం వద్ద నిలబడి గోపికలు):* ఏమే చిలకలకొలికీ , ఇంకా నిద్దురపోతున్నావా?
***(లోనున్న గోపిక):*** అబ్బ, చెవులు మారుమోగేట్లు పిలువకండి, తల్లులారా! ఇదుగో వస్తున్నాను.
***వెలుపలి గోపికలు:*** నీ మాటకారితనం బాగా తెలుసులే. ***లోపలి గోపిక:*** మీరే సమర్థులు. నా మాటకారితనాన్ని మన్నించండి.
***గోపికలు:*** లోపల చేస్తున్నదేమిటి? త్వరపడి వచ్చి మాతో చేరు. ***గోపిక:*** అందరూ వచ్చినట్లేనా ?
***గోపికలు:*** ఆహా, వచ్చారు. లెక్కపెట్టుకో. మదించిన కంసుని కువలయాపీడాన్ని నిలువరించి, ముష్టికచాణూరులను, బాణాసురుని సంహరించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసిన పరంధాముని కీర్తించెదము, వేగిరం రా ! ***గోపిక:*** వస్తున్నాను కాని నేనేనా రావలసినది, ఇంకా రావలసిన వారెవరైనా ఉన్నారా ?
***గోపికలు:*** మాటలతో కాలయాపన చేస్తున్నావు కాని శయ్యామందిరం విడిచి బయటకు రాకున్నావు. ఎవరే నిన్ను లోపల నిలువరించి ఉంచినది?
అందరమూ వచ్చామని చెబుతున్నా వినక ప్రశ్నలు గుప్పిస్తున్నావు? నీవే వచ్చి లెక్కించుకో.

– శ్రీదేవి మురళీధర్


చెట్టు నీడ

# రాజు గారి తలుపు

అనగనగా ఓ రాజు. ఆయన ఒక రోజు ఓ పోటీ ప్రకటించాడు. తన కోట తలుపులను ఎవరైతే ఒట్టి చేతులతో తోస్తారో వారికి రాజ్యంలోని ఓ భాగాన్ని ఏలుకోవడానికి అవకాశం ఇస్తానని. ఒకవేళ విజయం సాధించని పక్షంలో చేతులు నరికిస్తాననీ చాటింపు వేయించాడు రాజు. ఈ ప్రకటనతో భయపడి ఎవరూ ముందుకు రాలేదు.

అయితే ఒకే ఒక్కడు మాత్రం పోటీలో పాల్గొనడానికి ముందుకు వచ్చాడు. కానీ ఓడిపోయావంటే నీ చేతులు నరికేస్తారని, చేతులు నరికేస్తే నీ భవిష్యత్తు నాశనం అయిపోతుంది ఆలోచించుకోమని అతనిని అందరూ హెచ్చరించారు. అయితే అతను వారి మాటలను లెక్కచేయలేదు. ధైర్యంగా రాజుగారి దగ్గరకు వెళ్లి తాను పోటీలో పాల్గొంటానని చెప్పాడు.

> మనలో చాలా మంది పోటీపడని వారిలాంటి వారమే. ఏదైనా చేసేటప్పుడు ఏమవుతుందోనని భయపడతాం. మనమీద మనకే నమ్మకం ఉండదు. ఏదీ చేయక ఉట్టినే ఉండే కన్నా చేసి విఫలమవడం మేలు. అప్పుడు ఏది ఎలా చేస్తే ముందుకు పోగలమో తెలుస్తుంది.



అతని ధైర్యానికి మెచ్చుకుంటూ రాజు అతనిని కోట తలుపులను చేతులతో నెట్టమన్నాడు.

యువకుడు అలాగేనని ఏ మాత్రం కష్టపడకుండా రాజు చూపించిన తలుపులను నెట్టాడు. నిజానికి ఆ తలుపులకు గొళ్లెం వేయలేదు. ఉట్టినే దగ్గరకు వేసున్నాయి. ఈ విషయం తెలియక చాలా మంది పోటీకి దూరమయ్యారు. ఆ యువకుడికీ ఈ విషయం తెలీదు. చివరికి తలుపులు నెట్టిన యువకుడిని రాజు ఓ భాగానికి పాలకుడిగా ప్రకటించి సత్కరించాడు. ప్రజలందరూ అతనిని ప్రశంసలతో ముంచెత్తారు.

– యామిజాల జగదీశ్

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం
30-12-2019



● బాలకృష్ణ ● అల్లుఅర్జున్ ● రవితేజ ● నాని ● నాగశౌర్య ● రామ్ ● బోయపాటి శ్రీను ● సుకుమార్ ● త్రివిక్రమ్ ● గోపిచంద్ మలినేని ● ఇంద్రగంటి మోహనకృష్ణ ● అవసరాల శ్రీనివాసస్ ● కిశోర్ తిరుమల

# హిట్.. ఫేవరెట్

2019... ప్రేక్షకులకు తెలుగు సినిమా చాలానే ఇచ్చింది. కొత్త దర్శకులు, హీరోలు, హీరోయిన్లను పరిచయం చేసింది. కొత్త తరహా చిత్రాలను తీసుకొచ్చింది. పనిలో పనిగా ప్రేక్షకుల 'ఫేవరేట్ కాంబినేషన్'ని మళ్లీ సెట్ చేసింది. 2019లో ఇలా మళ్లీ సెట్ అయిన సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ సినిమాలు 2020లో విడుదలవుతాయి. ఇక ఈ ఫేవరెట్ హిట్ కాంబినేషన్ల గురించి తెలుసుకుందాం..

**మాస్ కాంబినేషన్**

ఆడియన్స్ మాస్ పల్స్ పట్టిన డైరెక్టర్ బోయపాటి శ్రీను. ప్రేక్షకులకు మాస్ కిక్ ఎక్కించే హీరో బాలకృష్ణ. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటే అది డబుల్‌మాసే. బాలకృష్ణ–బోయపాటి కాంబినేషన్‌లో ఆల్రెడీ వచ్చిన 'సింహా' (2010), 'లెజెండ్' (2014) చిత్రాల మాస్ సక్సెస్‌లే ఇందుకు నిదర్శనం. ఇప్పుడు ఇదే కాంబినేషన్‌లో మరో మూవీకి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఈ ఏడాది ముగిశాయి. జనవరిలో షూటింగ్ ప్రారంభం కానుంది.

**డబుల్ హ్యాట్రిక్**

అల్లు అర్జున్‌ని (బన్నీ) 'జులాయి' (2012)గా చూపించి ప్రేక్షకులను మెప్పించారు దర్శకుడు త్రివిక్రమ్. 'జులాయి' వచ్చిన మూడేళ్ల తర్వాత 'సన్నాఫ్ సత్యమూర్తి'గా బన్నీతో త్రివిక్రమ్ చెప్పించిన కుటుంబ విలువల లెక్కలు ప్రేక్షకులకు బాగా కిక్ ఇచ్చాయి. దీంతో వీరిద్దరూ హ్యాట్రిక్ హిట్ కోసం 2018లో 'అల... వైకుంఠపురములో..'కి వెళ్లిపోయారు. ఈ చిత్రం జనవరి 12న విడుదల కానుంది. ఇక 2004లో దర్శకునిగా సుకుమార్ తెరకెక్కించిన తొలి చిత్రం 'ఆర్య'. ఇందులో అల్లు అర్జున్ హీరోగా నటించారు. ఈ సినిమా విజయం ఇద్దరి కెరీర్‌కు మంచి మైలేజ్‌ని ఇచ్చింది. 'ఆర్య' సక్సెస్ క్రేజ్‌ను రిపీట్ చేయడానికి వీరిద్దరూ కలిసి 'ఆర్య 2' (2009) చేశారు. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి సినిమా చేయడానికి రెడీ అయినట్లు ఈ ఏడాదిలో ప్రకటించారు. సో.. కొత్త ఏడాది అల్లు అర్జున్ అభిమానులకు డబుల్ ధమాకాయే.

ఇండియన్ సినిమా దృష్టంతా ఇప్పుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'ఆర్ఆర్ఆర్' సినిమా పైనే ఉంది. ఈ సినిమాకు ముందు రాజమౌళి దర్శకత్వంలో రెండు భాగాలుగా విడుదలైన 'బాహుబలి' చిత్రం సృష్టించిన ప్రభంజనం ప్రభావమే ఇందుకు ఓ కారణం. అలాగే ఎన్టీఆర్, రామ్‌చరణ్ కలసి నటిస్తున్న చిత్రం కావడంతో స్పెషల్ క్రేజ్ ఏర్పడింది. అయితే గతంలో ఎన్టీఆర్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో 'స్టూడెంట్ నెం 1



(2001), సింహాద్రి (2003), యమదొంగ (2007)' చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రాజమౌళి–ఎన్టీఆర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న నాలుగో చిత్రం ఇది. అలాగే రామ్‌చరణ్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో మగధీర (2009) అనే సూపర్‌హిట్ చిత్రం వచ్చిన సంగతి తెలిసిందే. 'ఆర్ఆర్ఆర్' రాజమౌళి–రామ్‌చరణ్ కాంబినేషన్ పరంగా రెండోది. ఇలా ఆల్రెడీ సోలోగా రాజమౌళితో హిట్ అందుకున్న ఎన్టీఆర్–రామ్‌చరణ్ 'ఆర్ఆర్ఆర్'తో కలసి హిట్ అందుకోవడం ఖాయం అనే అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం వచ్చే ఏడాది జూలై 30న పది భాషల్లో విడుదల కానుంది.

**హిట్ కోసం క్రాక్**

దర్శకునిగా గోపీచంద్ మలినేని ఇప్పటి వరకు ఐదు సినిమాలు తెరకెక్కిస్తే అందులో రెండు ('డాన్ శీను' (2010), 'బలుపు' (2013)) చిత్రాలు రవితేజ హీరోగా వచ్చినవే. తాజాగా గోపీచంద్ మలినేని, రవితేజ కాంబినేషన్‌లో మూడో చిత్రంగా 'క్రాక్' తెరకెక్కుతోంది. డాన్ శీను, బలుపుతో హిట్ సాధించి, ఇప్పుడు మరో హిట్ కోసం వీరు చేస్తున్న 'క్రాక్' వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది.

**రూట్ మారింది**

రామ్ కెరీర్‌లో 'నేను..శైలజ...' (2016) సూపర్‌హిట్ మూవీ. దీంతో ఈ సినిమా దర్శకుడు కిశోర్ తిరుమలతో 2017లో 'ఉన్నది ఒకటే జిందగీ' సినిమా చేశారు రామ్. ఈ ఏడాది రామ్–కిశోర్ తిరుమల కలిసి 'రెడ్' అనే సినిమా చేస్తున్నారు. 'నేను...శైలజ, ఉన్నది ఒకటే జిందగీ' చిత్రాల్లో రామ్‌ను లవర్ బాయ్‌గా చూపించిన కిశోర్ ఈసారి రూట్ మార్చి 'రెడ్' రామ్‌ను ఫుల్ మాస్ క్యారెక్టర్‌లో చూపించబోతున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 9న విడుదల కానుంది.

**హీరో విలనయ్యాడు!**

దాదాపు పదేళ్ల క్రితం ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో వచ్చిన 'అష్టా చమ్మా' అనే చిత్రం ప్రేక్షకులకు నాని అనే మంచి నటుడిని పరిచయం చేసింది. ఈ చిత్రం తర్వాత నాని హీరోగా ఇంద్రగంటి మోహనకృష్ణ తెరకెక్కించిన 'జెంటిల్‌మన్' (2016) కూడా ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఇప్పుడు ఇంద్రగంటి దర్శకత్వంలో నాని నటిస్తున్న మూడో చిత్రం 'వి'. ఇందులో సుధీర్‌బాబు మరో హీరో. ఈ సినిమాలో నానీది విలన్ రోల్. అలాగే నాని తొలిసారి విలన్ పాత్ర చేస్తున్న చిత్రం కూడా. అలా నానీని హీరోగా పరిచయం చేసిన ఇంద్రగంటే ఇప్పుడు తనను విలన్‌గా చూపించబోతుండటం విశేషం. సమ్మోహనం(2018) తర్వాత సుధీర్‌బాబు, ఇంద్రగంటి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం కూడా ఇదే.

**లవ్ కాంబినేషన్**

'ఊహలు గుసగుసలాడే...'(2014) చిత్రంతో హీరోగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు నాగశౌర్య. ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర పోషించిన అవసరాల శ్రీనివాసే ఈ సినిమాను తెరకెక్కించారు. రెండేళ్ల తర్వాత అవసరాల శ్రీనివాస్ తెరకెక్కించిన 'జ్యో అచ్యుతానంద'(2016) సినిమాలో ఒక హీరోగా నటించారు నాగశౌర్య. నారా రోహిత్ మరో హీరో. తాజాగా నాగశౌర్య–అవసరాల కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న మూడో చిత్రం 'ఫలానా అబ్బాయి..ఫలానా అమ్మాయి'. వీరి కాంబినేషన్‌లో వచ్చిన గత చిత్రాల మాదిరిగానే ఈ చిత్రం కూడా మరో లవ్‌స్టోరీ కావడం విశేషం.

ఈ థర్డ్ కాంబినేషన్సే కాకుండా 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' (2013) సినిమా తర్వాత తమిళ హిట్ 'అసురన్' తెలుగు రీమేక్ కోసం హీరో వెంకటేష్, దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల రెండోసారి సెట్టయ్యారు. 'గౌతమ్‌నంద' (2017) తర్వాత గోపీచంద్‌ని కబడ్డీ కోచ్‌గా మార్చి, ఆయనతో రెండో సినిమా తీస్తున్నారు సంపత్‌నంది. 'నిన్నుకోరి'(2017) హిట్ కిక్‌తో 'టక్‌జగదీష్' కోసం మరోసారి కలిసి సెట్స్‌కు వెళ్లడానికి రెడీ అయ్యారు హీరో నాని, దర్శకుడు శివనిర్వాణ. 'గూఢచారి'(2018)వంటి సూపర్‌హిట్ తర్వాత 'మేజర్'కోసం మళ్లీ కలిశారు హీరో అడవి శేష్, దర్శకుడు శశి కిరణ్ తిక్క. గుణశేఖర్ దర్శకత్వంలో అనుష్క ప్రధాన పాత్రలో నటించిన 'రుద్రమదేవి' (2015) చిత్రంలో రానా ఓ కీలకపాత్ర చేశారు. ఇప్పుడు రానా–గుణశేఖర్ కాంబినేషన్లో వచ్చే ఏడాది చివర్లో 'హిరణ్యకశ్యప' అనే చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. హిట్ దిశగా తమను డైరెక్ట్ చేసిన డైరెక్టర్ డైరెక్షన్‌లో యాక్ట్ చేయడానికి మరికొందరు హీరోలు కూడా రెడీ అయ్యారు. మరికొందరు అవుతున్నారు.

–ముసిమి శివాంజనేయులు.

“సామజవరగమనా.. నిను చూసి ఆగగలనా..' పాట ఎంత పాపులర్ అయిందో మనందరికీ తెలుసు. ఈ సూపర్ హిట్ పాట టీజర్‌ను న్యూ ఇయర్ గిఫ్ట్‌గా డిసెంబర్ 31 సాయంత్రం రిలీజ్ చేస్తున్నాం''

## న్యూఇయర్ గిఫ్ట్

అని 'అల వైకుంఠపురములో' చిత్రబృందం పేర్కొంది. అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. అల్లు అరవింద్, యస్. రాధాకృష్ణ నిర్మాతలు. పూజా హెగ్డే కథానాయిక. ఈ చిత్రం ప్రీ–రిలీజ్ (మ్యూజికల్ కన్సర్ట్) ఈవెంట్ జనవరి 6న హైదరాబాద్‌లో జరగనుంది. 'అల వైకుంఠపురములో' సినిమా జనవరి 12న విడుదలకానుంది.


● అల్లు అర్జున్, పూజా హెగ్డే

## సక్సెస్‌మీట్ అంటే సినిమా ఫ్లాప్


\- కీరవాణి


● కాల భైరవ, కీరవాణి, శ్రీ సింహా

“మత్తు వదలరా' సినిమా గురించి మంచి టాక్స్ వినిపిస్తున్నాయి.. స్పందన బాగుందా చెర్రీ(నిర్మాత చిరంజీవిని ఉద్దేశించి). ఏంటీ.. ఇది సక్సెస్‌మీటా? కాదు కాదా? ఎందుకంటే టాలీవుడ్ సినిమా డిక్షనరీ వేరే ఉంది.. బాబుగారూ అంటే హీరో.. సక్సెస్ మీట్ అంటే సినిమా ఫ్లాప్ అయిందని అర్థం(నవ్వుతూ)'' అని సంగీత దర్శకుడు కీరవాణి అన్నారు. ఆయన తనయులు శ్రీసింహా హీరోగా, కాలభైరవ సంగీత దర్శకునిగా పరిచయమైన చిత్రం 'మత్తు వదలరా'. రితేష్ రానా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై చిరంజీవి (చెర్రీ), హేమలత నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో కీరవాణి మాట్లాడుతూ– “2000సంవత్సరం కెరీర్ పరంగా నాకు చాలా బ్యాడ్‌టైమ్.. డబ్బుల పరంగానూ బ్యాడ్‌టైమే. ఆ రోజుల్లో నేను బాధ్యత తీసుకోవాల్సినటువంటి కుటుంబీకులు దాదాపు 30మంది ఉన్నారు. ఓ సందర్భంలో సింగపూర్ వెళ్లడం గురించి ఇంట్లో చర్చ వచ్చింది.. అక్కడికి వెళ్లేంత డబ్బులు మనవద్ద లేవని నేను అంటుంటే.. 'నేను తీసుకెళతాను' అన్నాడు కాలభైరవ.. అప్పుడు వాడికి నాలుగేళ్లు'.. ఇప్పటి వరకూ నన్ను తీసుకెళ్లేంత రెమ్యూనరేషన్ వాడికి రాలేదు కానీ, 'మత్తు వదలరా' తో వచ్చిందనుకుంటున్నా (నవ్వుతూ).. మంచి సినిమా తీసిన యూనిట్‌కి అభినందనలు'' అన్నారు. చిరంజీవి మాట్లాడుతూ– “మత్తు వదలరా' కథని రితేష్ రానా చెప్పినప్పుడు అదృష్టం వెతుక్కుంటూ వచ్చిందనిపించింది. మా సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తుండటంతో ఇప్పుడు ప్రమోషన్స్ పెంచాం'' అన్నారు. “రితేష్ రానా చెప్పిన కథ విన్నాక సినిమా చేయం అనే అవకాశమే లేదు.. అంత బాగుంది'' అన్నారు మైత్రీ మూవీస్ నిర్మాత రవిశంకర్. “షకలక' శంకర్‌తో వినోద సన్నివేశాలు చిత్రీకరించాం.. కానీ, ఆ కామెడీ ట్రాక్ కథని ముందుకు తీసుకెళ్లదు అనిపించి పెట్టలేదు'' అన్నారు రితేష్ రానా. “నటుడిగా నాకు రోల్ మోడల్ అంటూ ఎవరూ లేరు. అందరి సినిమాలూ చూస్తా'' అన్నారు శ్రీ సింహా. “నాన్న(కీరవాణి), బాబాయ్(రాజమౌళి) గార్లు చెప్పకపోయినా వారి వల్లే మాకు ఈ అవకాశం వచ్చిందనుకుంటున్నాం'' అన్నారు కాలభైరవ. నటుడు నరేశ్ అగస్త్య, కెమెరామెన్ సురేశ్ సారంగం పాల్గొన్నారు.

## రొమాంటిక్ టాకీస్

విజయ్ పెద్దిరెడ్డి హీరోగా 'బిగ్‌బాస్' ఫేమ్ భానుశ్రీ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'టూరింగ్ టాకీస్'. రంగనాథ్ ముత్యాల దర్శకత్వంలో ప్రేమ్‌నాథ్ ముత్యాల నిర్మిస్తున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. “ఇదొక వెరైటీ రొమాంటిక్ ఎంటర్‌టైనర్. మా సినిమాను వేసవిలో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు దర్శకుడు రంగనాథ్. ఈ సినిమాకు ఉమ మహేష్‌బెరి స్వరకర్త.


● భాను శ్రీ

## మనతో మనమే ఫైట్ చేయాలి

“ప్రతిరోజూ ఇంకాస్త మంచి మనిషిగా మారడానికి ప్రయత్నిస్తుండాలి. నిన్నటి కంటే మెరుగ్గా ఉండటానికి కష్టపడుతుండాలి. దానికోసం మనతో మనమే ఫైట్ చేస్తుండాలి. ప్రస్తుతం నేను అదే చేస్తున్నాను'' అన్నారు రాశీఖన్నా. నటి అయ్యాక ఈ ఏడేళ్లలో నటిగా, వ్యక్తిగా మీలో గమనించిన మార్పేంటి? అని రాశీని అడగ్గా– “ఈ ప్రయాణంలో చాలా మార్పు గమనించాను. రకరకాల పాత్రలు పోషించడం నా ఆలోచనా విధానంపై చాలా ప్రభావం చూపింది. నా ఆలోచనా పరిధి విస్తృతం అయింది. ఏ విషయాన్నీ ముందే జడ్జ్ చేయడం లేదు. గతంలో వెంటనే రియాక్ట్ అవ్వడం, టక్కున కోపం రావడం జరిగేవి. ఇప్పుడు తగ్గింది. చాలా శాంతమయ్యాను. ప్రస్తుతం నేను పాటించేది నిన్నటికంటే బెటర్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాను'' అన్నారు.


● రాశీఖన్నా

## స్ట్రయిట్ తెలుగు సినిమాలు నిర్మిస్తా

“గౌతమ్ మీనన్‌గారి సినిమాల్లో మొదట్లో రొమాన్స్ ఉంటే క్లైమాక్స్‌లో యాక్షన్ ఉంటుంది. కానీ 'తూటా'లో 70 శాతం యాక్షన్ ఉంటుంది'' అని తాతారెడ్డి అన్నారు. ధనుష్ హీరోగా గౌతమ్ మీనన్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ చిత్రం 'ఎన్నై నోకి పాయమ్ తోట'. మేఘా ఆకాష్ కథానాయికగా నటించారు. ఈ చిత్రం 'తూటా' పేరుతో తెలుగులో విడుదల కానుంది. గొలుగూరి రామకృష్ణారెడ్డి సమర్పణలో విజయభేరి పతాకంపై జి.తాతారెడ్డి, జి.సత్యానారాయణ రెడ్డి జనవరి 1న 'తూటా' చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తాతారెడ్డి మాట్లాడుతూ –“ఎమ్మెస్ బయో టెక్నాలజీ చదివి సైంటిస్ట్‌గా రెండేళ్లు పని చేశాను. సినిమాలపై నాకున్న ఆసక్తితో 'నాపేరు సూర్య నా ఇల్లు ఇండియా', 'లవర్స్ డే' చిత్రాలను డిస్ట్రిబ్యూట్ చేశాను. 'తూటా' సినిమాతో నిర్మాతగా తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు హ్యాపీ. 'తూటా'లో కథనం ప్రకారం కుటుంబ కథకు అండర్ వరల్డ్ టచ్ ఉంటుంది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా 'తూటా'లో మార్పులు చేశాం.. స్క్రీన్ ప్లే స్పీడ్‌గా సాగుతుంది. ప్రేక్షకులకు ఇది స్ట్రయిట్ తెలుగు చిత్రంలానే అనిపిస్తుంది. స్ట్రయిట్ తెలుగు సినిమాలను నిర్మిస్తాను. 'మీతో వర్క్ చేయడం కంఫర్ట్‌గా ఉంటుంది.. ఓ సినిమా చేస్తా' అని గౌతమ్ మీనన్‌గారు ఓ సందర్భంలో నాతో అన్నారు. మంచి కథ కుదిరితే కొత్త దర్శకులతోనూ సినిమాలు నిర్మిస్తాం'' అన్నారు.


● తాతా రెడ్డి


## అమ్మాయంటే అలుసా దిశకు అంకితం

“స్టార్ హీరోలు, దర్శకుల దగ్గర ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేశాను. తొలిసారి నిర్మాతగా మారి సినిమా తీశాను. అనుకోని ఇబ్బందుల వల్ల సినిమా ఆగిపోతే నా భార్యకు తెలియకుండా ఇల్లు అమ్మేసి సినిమా పూర్తి చేశాను'' అన్నారు నేనే శేఖర్. ఆయన హీరోగా, దర్శక–నిర్మాతగా తెరకెక్కించిన చిత్రం 'అమ్మాయంటే అలుసా?'. కార్తీక్ రెడ్డి, స్వాతి, శ్వేత, ఆర్తి ముఖ్య పాత్రధారులు. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ విడుదల చేశారు. “ప్రస్తుత సమాజానికి ఎటువంటి కథ అయితే బావుంటుందో తెలిసినవాడు శేఖర్'' అన్నారు నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్. “ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు నిర్మాత రామసత్యనారాయణ. “ఈ సినిమాను దిశకు అంకితం చేస్తున్నా'' అన్నారు నేనే శేఖర్.


● ప్రతాని రామకృష్ణ, నేనే శేఖర్, రామసత్యనారాయణ







సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్థయా వర్ధతే విద్య
సోమవారం 30-12-2019

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

## ఉద్యోగ సమాచారం

### బీఈసీఐఎల్-10

నోయిడా (ఉత్తర్ ప్రదేశ్)లోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన 10 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** రీసెర్చ్ అసిస్టెంట్-6, ఫార్మసిస్ట్-4.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, ఎంఎస్సీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 15, 2020
- **వెబ్‌సైట్:** www.becil.com

### ఇస్రో-21

శ్రీహరికోట (ఆంధ్రప్రదేశ్)లోని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)కి చెందిన సతీష్ ధావన్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ (షార్) 21 సైంటిస్ట్/ఇంజనీర్, మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** సైంటిస్ట్/ఇంజనీర్-19 (కెమికల్ ఇంజనీరింగ్-10, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్-2, పవర్ సిస్టమ్స్-3, ఇండస్ట్రియల్ సేఫ్టీ-1, మెషీన్ డిజైన్/ఇంజనీరింగ్ డిజైన్-2, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్-1); మెడికల్ ఆఫీసర్-2.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ లేదా తత్సమాన అర్హత, ఎంబీబీఎస్ ఉత్తీర్ణత.
- **వయసు:** 2020, జనవరి 17 నాటికి 18-35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 17, 2020.
- **వెబ్‌సైట్:** https://apps.shar.gov.in

### టీఐఎఫ్ఆర్-4

హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్).. 4 ప్రాజెక్ట్ సైంటిఫిక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఎంఎస్సీ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** 28 ఏళ్లకు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 17, 2020.
- **వెబ్‌సైట్:** www.tifrh.res.in

### సాయ్-19

న్యూఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్).. 19 అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** 2016, 17, 18 సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్‌లో ఇంటర్వ్యూకు హాజరైనవారు అర్హులు.
- **వయసు:** 35 ఏళ్లకు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 18, 2020.
- **వెబ్‌సైట్:** https://sportsauthorityofindia.nic.in

### యూపీఎస్సీ-29

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 29 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్-2, డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్-27.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ, బీఈ/బీటెక్, బీఎస్సీ (ఇంజనీరింగ్) ఉత్తీర్ణత.
- **వయసు:** డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్ పోస్టులకు 30 ఏళ్లు; డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.25.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 17, 2020.
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
ఫిజికల్ సైన్స్





# విదేశీ విద్యకు.. బ్యాంకుల ఆసరా!

**విదేశీ విద్య.. ప్రస్తుతం ఎంతో మంది విద్యార్థుల కల! వీరంతా విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలన్న లక్ష్యంతో కోర్సులో చేరిన తొలిరోజు నుంచే అర్హత పరీక్షల్లో రాణించేందుకు కసరత్తు చేస్తుంటారు. అయితే విదేశీ వర్సిటీల భారీ ఫీజులు, దేశం కాని దేశంలో చదువులకయ్యే ఖర్చుల గురించి ఆలోచించి ఆందోళన చెందుతుంటారు. ఇలాంటి విద్యార్థులకు బ్యాంకులు కల్పించే రుణ సదుపాయం ఊరటనిస్తోంది. ఫారిన్ వర్సిటీల్లో ప్రవేశం ఖరారు చేసుకొని ఎడ్యుకేషన్ లోన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు బ్యాంకులు సులభంగానే రుణాలు మంజూరు చేస్తున్నాయి. ప్రస్తుతం ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు విదేశీ విద్యకు సిద్ధమవుతున్న తరుణంలో... ఎడ్యుకేషన్ లోన్స్, స్పెషల్ స్కీమ్స్, అవసరమైన డాక్యుమెంట్స్ తదితర అంశాలపై సమగ్ర కథనం..**

### బ్యాంకింగ్ స్కీమ్‌లు

విదేశీ విద్య వైపు ఆసక్తి చూపుతున్న విద్యార్థుల కోసం కొన్ని బ్యాంకులు ప్రత్యేక స్కీమ్‌లు రూపొందించాయి. ఉదాహరణకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 'గ్లోబల్ ఎడ్-వాంటేజ్ **(Ed-vantage)** పేరిట కనిష్టంగా రూ.20 లక్షలు, గరిష్టంగా రూ.1.5 కోట్ల వరకు రుణం మంజూరు చేస్తుంది. అలాగే బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ).. 'బరోడా స్కాలర్స్ లోన్' పేరుతో గరిష్టంగా రూ.60 లక్షలు, కనిష్టంగా రూ.40 లక్షల రుణ సదుపాయం కల్పిస్తుంది. బీఓబీ విదేశీ ఇన్‌స్టిట్యూట్‌లకు సంబంధించి లిస్ట్-ఏ, లిస్ట్-బీ పేరిట జాబితా రూపొందించింది. లిస్ట్-ఏ ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందితే రూ. 60 లక్షలు, లిస్ట్-బీ ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందితే రూ.40 లక్షలు రుణం మంజూరు చేస్తుంది. అదే విధంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిండికేట్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్ లాంటి ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులైన హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్, హెచ్ఎస్‌బీసీ, ఐసీఐసీఐ వంటి బ్యాంకులు సైతం రుణ సదుపాయం కల్పిస్తున్నాయి. ప్రైవేటు రంగ బ్యాంకులు మంజూరు చేసే రుణం రూ.20లక్షల నుంచి రూ. కోటి వరకు ఉంటోంది.



### అడ్మిషన్ లెటర్ తప్పనిసరి

విదేశీ విద్యకు బ్యాంకుల నుంచి రుణ మంజూరుకు విదేశీ యూనివర్సిటీ నుంచి అడ్మిషన్ లెటర్ పొందడం తప్పనిసరి. దీంతోపాటు ఇతర డాక్యుమెంట్లను కూడా రుణ దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. » ప్రూఫ్ ఆఫ్ అడ్మిషన్(అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్)» ప్రూఫ్ ఆఫ్ అడ్రస్ » పాస్‌పోర్ట్ » ప్రూఫ్ ఆఫ్ ఐడెంటిటీ » స్టేట్‌మెంట్ ఆఫ్ కాస్ట్ ఆఫ్ స్టడీ (నిర్దిష్ట కోర్సు పూర్తి చేయడానికి అయ్యే మొత్తం ఖర్చు వివరాలు) » స్టాండర్డ్ టెస్ట్ స్కోర్ల ధ్రువీకరణ పత్రాలు(జీమ్యాట్, జీఆర్ఈ, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్ తదితర)!!

### వీటికి మాత్రమే రుణం

బ్యాంకులు విదేశీ విద్యకు సంబంధించి అడ్మిషన్ ఫీజు » ట్యూషన్ ఫీజు » హాస్టల్ ఫీజు/నివాస ఖర్చులు » అకడమిక్ సంబంధ ఇతర వ్యయాలు (లేబొరేటరీ ఫీజు/బుక్స్/ఎగ్జామినేషన్ ఫీజు తదితర) » విమాన ఖర్చులు, తదితరాలకు అయ్యే మొత్తాన్ని మాత్రమే రుణంగా మంజూరు చేస్తున్నాయి.

### నిర్దిష్ట ప్రోగ్రామ్‌లకే

బ్యాంకులు విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న ప్రోగ్రామ్(కోర్సు) మొదలు అనేక విషయాలపై నిర్దిష్ట విధి విధానాలను రూపొందించాయి. జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ల్లో చేరిన విద్యార్థులకు రుణ మంజూరులో ప్రాధాన్యం లభిస్తోంది. ఇలాంటి కోర్సులు పూర్తి చేసుకోగానే విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తాయని.. రీ-పేమెంట్ పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని బ్యాంకుల అభిప్రాయం.

### మార్జిన్ మనీ అవసరం

విదేశీ విద్య రుణానికి దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థులు.. తాము కోరుతున్న మొత్తంలో 10శాతం నుంచి 15 శాతాన్ని మార్జిన్‌మనీ పేరిట సొంతంగా సమకూర్చుకోవాలి. అందుకు సంబంధించిన ఆధారాలను సంబంధిత బ్యాంకులకు అందించాలి. ఒకవేళ విద్యార్థులకు స్కాలర్‌షిప్ లభిస్తే ఆ మొత్తాన్ని మార్జిన్ మనీగా చూపించొచ్చు.

### ఈఎంఐ సౌకర్యం

విదేశీ విద్యా రుణం తిరిగి చెల్లింపు విషయంలోనూ బ్యాంకులు సరళీకృత నిబంధనలనే అమలు చేస్తున్నాయి. కోర్సు పూర్తయిన ఏడాది నుంచి లేదా కోర్సు పూర్తయ్యాక ఉద్యోగం పొందిన తర్వాత ఆరో నెల నుంచి రుణాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఈఎంఐల రూపంలో 15ఏళ్ల వ్యవధిలో చెల్లించే వెసులుబాటు ఉంది. ప్రైవేటు రంగ బ్యాంకులు కూడా తిరిగి చెల్లింపు విషయంలో దాదాపు ఇదే విధానాన్ని అనుసరిస్తుండటం విద్యార్థులకు కలిసొచ్చే అంశం.

### కొల్లేటరల్ సెక్యూరిటీ

భారీ మొత్తంలో రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకులు కొల్లేటరల్ సెక్యూరిటీని అడుగుతున్నాయి. స్థిరాస్తులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బాండ్స్ వంటి వాటిని చూపాల్సి ఉంటుంది. ఒకవేళ ఇవి లేకపోతే.. థర్డ్ పార్టీ కొల్లేటరల్ సెక్యూరిటీని అనుమతిస్తున్నాయి.

### వడ్డీ రేట్లు

బ్యాంకులు విదేశీ విద్యకు మంజూరు చేస్తున్న రుణాలపై సాధారణ వడ్డీ రేట్లనే విధిస్తున్నాయి. ప్రస్తుతం ఆయా బ్యాంకుల నిబంధనల ప్రకారం ఎడ్యుకేషన్ లోన్‌కు వడ్డీ రేటు 9 శాతం నుంచి 11 శాతం వరకూ ఉంటోంది.

# కరెంట్ అఫైర్స్

## జులై టు డిసెంబర్, 2019

**పోటీ పరీక్షల ప్రత్యేకం**

**సదస్సులు**



### జీ 7

45వ జీ7 దేశాల కూటమి సదస్సు 2019 ఆగస్టు 24 నుంచి 26 వరకు ఫ్రాన్స్‌లోని బియారిట్జ్ పట్టణంలో జరిగింది. జీ7 కూటమిలోని సభ్య దేశాలు.. అమెరికా, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్. భారత్‌కు ఇందులో సభ్యత్వంలేదు. కాని ఈ సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. అసమానతలపై పోరాటం, వాతావరణ మార్పులు, వాణిజ్యం, అమెజాన్ అడవుల కార్చిచ్చు వంటి అంశాలపై నేతలు చర్చించారు. ప్రధాని మోదీ 'డిజిటల్ మార్పులు' అనే అంశంపై ప్రసంగించారు. జీవ వైవిధ్యం, మహా సముద్రాలు, పర్యావరణం అంశాలపై జరిగిన సమావేశంలోనూ మోదీ పాల్గొన్నారు. జీ7 సదస్సులో పాల్గొన్న నాయకులు... అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడో, యూకే ప్రధాని బోరిస్ జాన్సన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రోన్, జర్మనీ ఛాన్సలర్ ఎంజెలా మెర్కల్, ఇటలీ ప్రధాని గిసెప్పీ కాంటే, జపాన్ ప్రధాని షింజో అబె.




### తూర్పు ఆర్థిక వేదిక

రష్యాలోని వ్లాదివొస్తోక్ నగరంలో 2019 సెప్టెంబర్ 4,5 తేదీల్లో ఐదవ తూర్పు ఆర్థిక వేదిక (ఈస్టర్న్ ఎకనమిక్ ఫోరం) సదస్సు జరిగింది. దీనిలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. రష్యాలోని దూరప్రాచ్య ప్రాంత అభివృద్ధికి భారత్ ఒక బిలియన్ డాలర్ల రుణాన్ని కేటాయించనున్నట్లు ఈ సదస్సులో మోదీ ప్రకటించారు. వ్లాదివొస్తోక్‌లోనే 20వ భారత్, రష్యా సదస్సు జరిగింది. ఇందులో మోదీతోపాటు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పాల్గొన్నారు.

### భారత్ - చైనా అనధికార సదస్సు

2019 అక్టోబర్ 11,12 తేదీల్లో తమిళనాడులోని మామల్లాపురం (మహాబలిపురం)లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌ల మధ్య రెండో అనధికార సదస్సు జరిగింది. ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టం చేసుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. తొలి అనధికార సదస్సు 2018 ఏప్రిల్‌లో చైనాలోని ఉహాన్ నగరంలో.. డోక్లాం సంక్షోభం నేపథ్యంలో జరిగింది. ఉహాన్ సదస్సుకు కొనసాగింపుగా మామల్లాపురం సదస్సు జరిగింది.

### అలీనోద్యమ సదస్సు

18వ అలీనోద్యమ దేశాధినేతల, ప్రభుత్వాధినేతల సదస్సు(నామ్)ను అజర్‌బైజాన్‌లోని బాకు నగరంలో 2019 అక్టోబర్ 25, 26 తేదీల్లో నిర్వహించారు. భారత్‌కు ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ప్రాతినిధ్యం వహించారు. 'సమకాలీన ప్రపంచం ఎదుర్కొనే సవాళ్లను అధిగమించడానికి బాండుంగ్ సూత్రాలను అనుసరించడం' అనే ఇతివృత్తంతో ఈ నామ్ సదస్సు జరిగింది.



### ఆసియాన్, తూర్పు ఆసియా సదస్సులు


ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య(ఆసియాన్), ఇతర సంబంధిత సదస్సులు 2019 నవంబర్ 2-4 తేదీల్లో థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగాయి. బ్రూనై, కాంబోడియా, ఇండోనేషియా, మలేషియా, సింగపూర్, లావోస్, వియత్నాం, మయన్మార్, థాయిలాండ్, ఫిలిప్పీన్స్ అనే పది దేశాలకు ఆసియాన్‌లో సభ్యత్వం ఉంది. 35వ ఆసియాన్ సదస్సుతోపాటు, 16వ ఆసియాన్-భారత్ సదస్సు బ్యాంకాక్‌లో జరిగాయి. ఆసియాన్-భారత్ సదస్సులో ఆసియాన్ దేశాల నేతలు, భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సదస్సులు ముగిసిన వెంటనే 14వ తూర్పు ఆసియా సదస్సు(ఈఏఎస్) బ్యాంకాక్‌లో జరిగింది. ఈఏఎస్‌లో 18 దేశాలకు సభ్యత్వం ఉంది. అవి... పది ఆసియాన్ దేశాలు, భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అమెరికా, రష్యా.




- మూడో ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య (ఆర్‌సీఈపీ) సదస్సు కూడా బ్యాంకాక్‌లోనే జరిగింది. ఇది పది ఆసియాన్ దేశాలు, భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల మధ్య ప్రతిపాదిత స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం. అయితే ఆర్‌సీఈపీలో చేరడం లేదని భారత్ బ్యాంకాక్‌లో జరిగిన ఈ సదస్సులోనే ప్రకటించింది. ఈ ఒప్పందంలో చేరితే చైనా వంటి దేశాల నుంచి చౌకైన దిగుమతులతో దేశీయ పరిశ్రమలు దెబ్బతింటాయని భారత ప్రభుత్వం ఆందోళన చెందుతోంది.

### బ్రిక్స్

అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐదు దేశాల కూటమే బ్రిక్స్. ఇందులో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌతాఫ్రికా సభ్య దేశాలు. 11వ బ్రిక్స్ సదస్సును బ్రెజిల్ రాజధాని బ్రెసీలియాలో 2019 నవంబర్ 13,14 తేదీల్లో నిర్వహించారు. 'నవావిష్కరణలతో కూడిన భవిష్యత్ కోసం ఆర్థిక వృద్ధి' అనే ఇతివృత్తంగా ఈ సదస్సు జరిగింది. బ్రెజిల్ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసాలు 11వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. ప్రధాని మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు జైర్ బొల్సొనారోతో ద్వైపాక్షిక సమావేశం జరిపారు. 2020 జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనాలని మోదీ ఆహ్వానించగా, జైర్ అంగీకరించారు.



### నాటో

నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్(నాటో) ప్రపంచంలోనే అతిపెద్ద మిలిటరీ కూటమి. ఇందులో 29 సభ్యదేశాలున్నాయి. ఈ సంస్థ ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఒక ప్రత్యేక సదస్సును లండన్‌లో 2019 డిసెంబర్3,4 తేదీల్లో నిర్వహించారు.

### వాతావరణ మార్పుల సదస్సు

ఐక్యరాజ్య సమితి వాతావరణ మార్పుల సదస్సు స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో 2019 డిసెంబర్ 2 నుంచి 13వ తేదీ వరకూ జరిగింది. దీనినే కాప్-25 సదస్సు అంటారు.



ఎన్.విజయేందర్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

# కొత్త కొత్తగా ఉన్నదీ..!

ఎన్నో కలలతో మరెన్నో ఆకాంక్షలతో కొత్త దశాబ్దంలోకి అడుగు పెట్టబోతున్నాం. గ్రాండ్‌గా న్యూ ఇయర్‌కి వెల్కమ్ చెప్పబోతున్నాం. కొత్త ఏడాదంటేనే కొత్త ఉత్సాహం, కొత్త ఉల్లాసం, కొత్త ఉత్తేజం. అంత జోష్‌లోనూ కొత్త సంవత్సరమంటే కొన్ని నమ్మకాలు ఉన్నాయి. వివిధ దేశాల ప్రజలు పాటించే ఆ సంప్రదాయాలు ఆసక్తిని రేపుతున్నాయి. అవేంటో ఓ సారి చూద్దాం.



### స్పెయిన్

డిసెంబర్ 31 అర్ధరాత్రి వరకు మేల్కొని గడియారం ముల్లు సరిగ్గా 12 మీదకి రాగానే స్పెయిన్ దేశస్తులు 12 ద్రాక్షపళ్లు తింటారు. అలా తింటే అదృష్టం కలిసొస్తుందని వారి నమ్మకం.



### చెక్ రిపబ్లిక్

న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో భాగంగా చెక్ రిపబ్లిక్‌లో యాపిల్ కట్ చేస్తారు. అదీ కొత్త ఏడాది తమ అదృష్టం ఎంతో తెలుసుకోవడం కోసం. యాపిల్‌ను మధ్యకి కోస్తారు. యాపిల్ మధ్య భాగంలో విత్తనాలు ఉన్న చోట స్టార్ వస్తే కొత్త ఏడాదంతా మంచే జరుగుతుందని, అదే క్రాస్ వస్తే చెడు జరుగుతుందని వారి నమ్మకం.



### ఇటలీ

ఇటలీలో కొత్త సంవత్సరం కాస్త వినూత్నంగా ఉంటుంది. చెత్త సామాను వదిలించుకోవడానికి ఈ ఉత్సవాల్ని నిర్వహిస్తారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి ఇంట్లో ఉన్న చెత్త సామానంతటినీ బయట పడేస్తారు. అంటే మనసుల్లో ఉన్న చెడు జ్ఞాపకాల్ని వదిలించుకోవడం అన్నమాట. దక్షిణాఫ్రికావంటి దేశాలూ ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నాయి.



### ఈక్వెడార్

ఈక్వెడార్‌లో డిసెంబర్ 31 రాత్రి ఎవరూ ఇళ్లల్లో ఉండరు. అందరూ రోడ్లపైనే గడుపుతారు. ప్రధాన కూడళ్లలో మంటలు రాజేసి రాజకీయ నాయకుల దిష్టి బొమ్మలను తగుల బెడతారు. ఈ చర్యతో గత ఏడాది కాలంలో జరిగిన చెడు అంతా పోయినట్టుగా భావిస్తారు. ఈ సంప్రదాయం 1895 నుంచి వస్తోంది.



### జపాన్

జపాన్‌లో కొత్త సంవత్సరం అంటే అర్ధరాత్రి గంటల్ని గణగణమని మోగిస్తారు. రాత్రి 12 అవగానే 108 సార్లు గంటలు మోగుతాయి. అలా చేస్తేనే తమ జీవితం ఆనందంగా సాగుతుందని అంటారు.



### చిలీ

కొత్త ఏడాది ఉత్సవాల్ని వివిధ దేశాల ప్రజలు చర్చిల్లో జరుపుకుంటే చిలీ వాసులు తమ రూటే సెపరేటు అంటున్నారు. తమకు అత్యంత ప్రియమైన వారి సమాధుల వద్ద ఈ సంబరాలు నిర్వహిస్తారు. సమాధుల్ని పూలతో అలంకరించి, దీపాలు ఉంచుతారు. ఈ లోకంలో లేకపోయినా సరే కొత్త సంవత్సరం ప్రియమైన వారిని తలచుకోవడం కంటే మించినదేదీ ఉండదని చిలీ వాసులు 1995 నుంచి ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నారు.



### గ్రీస్

గ్రీస్‌లో జనవరి 1న చర్చికి వెళ్లి వచ్చిన వాళ్లందరికీ అక్కడ ఉల్లిపాయలు పంచుతారు. వాటిని తీసుకువచ్చి దండలా తయారు చేసి ఇంటి గుమ్మానికి వేళ్లాడతీస్తారు. ఉల్లిపాయలు అంటే ఆరోగ్యానికి, సంతానం వృద్ధికి, ఆయుఃప్రమాణాలు పెంచడానికి ప్రతీకగా భావిస్తారు. అందుకే కొత్త సంవత్సరం ఉల్లిపాయల దండ గుమ్మానికి వేళ్లాడదీయడం శుభ పరిణామంగా విశ్వసిస్తారు.



### డెన్మార్క్

డెన్మార్క్‌లో రకరకాల పింగాణి పాత్రలు (క్రాకరీ)ని బద్దలు కొడతారు. ప్లేట్లు, కప్పులు, స్పూన్‌లు లాంటివన్నీ డిసెంబర్ 31 అర్ధరాత్రే విరగ్గొట్టేస్తారు. అప్పుడే అదృష్టం తమకి కలిసివస్తుందని వారి నమ్మకం.

# ‘ఫాల్కే’ అందుకున్న బిగ్‌బీ



రాష్ట్రపతి కోవింద్ నుంచి అవార్డు అందుకుంటున్న అమితాబ్‌బచ్చన్

**న్యూఢిల్లీ:** బాలీవుడ్ మెగాస్టార్, బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్నారు. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో కోవింద్ ఈ అవార్డును ప్రదానం చేశారు. వాస్తవంగా బిగ్‌బీ ఈ అవార్డును కొద్ది రోజుల క్రితమే అందుకోవాల్సి ఉన్నా అనారోగ్య కారణాల రీత్యా కార్యక్రమానికి హాజరుకాలేకపోయారు. దీంతో ఆదివారం జరిగే ప్రత్యేక కార్యక్రమంలో బిగ్‌బీకి అవార్డు అందిస్తామని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ ఇటీవల ప్రకటించారు. జాతీయ సినీ పురస్కారాలు అందుకున్న నటులకు రాష్ట్రపతి తన నివాసంలో ఆదివారం తేనీటి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమితాబ్‌కు అవార్డు అందజేశారు. భారతీయ సినీ రంగానికి విశిష్ట సేవలు అందించినందుకు గానూ.. బిగ్‌బీకి ఈ పురస్కారం లభించింది. భారతీయ సినిమాలో ఇది అత్యున్నత పురస్కారం. ఈ అవార్డు కింద రూ.10 లక్షలతో పాటు స్వర్ణ కమలం అందజేస్తారు. కాగా.. ఈ అవార్డుకు అర్హుడిగా తనను ఎంపిక చేసిన నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరీ సభ్యులకు, కేంద్ర ప్రభుత్వం, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖలకు అమితాబ్ కృతజ్ఞతలు తెలిపారు. తనతో సినిమాలు తీసిన నిర్మాతలు, దర్శకులు, తోటి కళాకారులు, తనను ఆరాధిస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమితాబ్ సతీమణి, ఎంపీ జయా బచ్చన్, కుమారుడు అభిషేక్ బచ్చన్ తదితరులు పాల్గొన్నారు. భారతీయ సినిమా పితామహుడు ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే పేరు మీదుగా 1969 నుంచి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును అందజేస్తున్నారు. అదే ఏడాది అమితాబ్ ‘సాత్ హిందుస్తానీ’అనే హిందీ సినిమాతో అరంగేట్రం చేశారు.

# జార్ఖండ్ 11వ సీఎంగా హేమంత్

- కేబినెట్ మంత్రులుగా మరో ముగ్గురు ప్రమాణ స్వీకారం
- ప్రతిపక్ష పార్టీల నాయకులంతా హాజరు



ప్రమాణస్వీకార కార్యక్రమంలో సంఘీభావం తెలుపుతున్న డి.రాజా, స్టాలిన్, శరద్‌యాదవ్, మమతా బెనర్జీ, అశోక్ గహ్లోత్, రాహుల్ గాంధీ, హేమంత్, భూపేష్ బఘేల్, శిబూసోరెన్ తదితరులు

**రాంచీ:** జార్ఖండ్ 11వ ముఖ్యమంత్రిగా జేఎంఎం నాయకుడు హేమంత్ సోరెన్ ఆదివారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రతిపక్ష నాయకులు, కేంద్రంలో అధికార బీజేపీని వ్యతిరేకించే ప్రాంతీయ పార్టీల అధినేతలు ఎందరో తరలిరాగా అట్టహాసంగా జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన సీఎంగా ప్రమాణం చేశారు. తెల్లరంగు కుర్తా పైజామా, ముదురు నీలం రంగు నెహ్రూ జాకెట్ ధరించి వచ్చిన 44 ఏళ్ల ఈ ఆదివాసీ నేత అందరినీ ఆకర్షించారు. గవర్నర్ ద్రౌపది ముర్ము ఆయన చేత పదవీ ప్రమాణం చేయించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీజేపీ ఆరు నెలలు తిరక్కముందే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూట కట్టుకోవడంతో విపక్షాల్లో ఆత్మ విశ్వాసం పెరిగింది. జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి 47 స్థానాలతో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించింది. ప్రమాణ స్వీకారానికి హాజరైన వారిలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ బఘేల్, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్, ఆయన సోదరి కనిమొళి, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌లు ఉన్నారు. విపక్షాల బలం పెరుగుతూ ఉండడంతో వీరంతా చిరునవ్వుతో ఒకరినొకరు పలకరించుకున్నారు. సోరెన్‌తో పాటు కాంగ్రెస్ నాయకుడు అలంఘీర్ ఆలమ్, జార్ఖండ్ పీసీసీ అధ్యక్షుడు రామేశ్వర్ ఒరాయన్, ఆర్జేడీ ఎమ్మెల్యే సత్యానంద భోక్త కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు.

**ప్రధాని అభినందనలు**

జార్ఖండ్ సీఎంగా పదవీ ప్రమాణం చేసిన సోరెన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం తరపు నుంచి వీలైనంత సాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**సీఎంగా రెండోసారి**

జార్ఖండ్ ముక్తి మోర్చా వ్యవస్థాపకుడు, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన శిబూసోరెన్ వారసుడిగా హేమంత్ సోరెన్ రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నారు. ఆయన రాష్ట్ర పగ్గాలను చేపట్టడం ఇది రెండోసారి. సోరెన్ గతంలో ఉప ముఖ్యమంత్రిగా, ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు. అయితే సీఎంగా కేవలం 14 నెలలు మాత్రమే ఉన్నారు. బీజేపీయేతర పార్టీలను ఒక్కతాటిపైకి తీసుకురావడానికి హేమంత్ పకడ్బందీ వ్యూహాలనే రచించారు.

## క్లుప్తంగా...

### ఈజిప్టులో రోడ్డు ప్రమాదం

**ముగ్గురు భారతీయుల మృతి**

**కైరో:** ఈజిప్టులోని ప్రముఖ పర్యాటక ప్రాంతం సూయజ్ కెనాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భారతీయులు మృతి చెందగా, 13 మంది గాయాలపాలయ్యారు. ఈ నెల 28న తీరప్రాంత పట్టణం హర్ఘాడా వైపు 16 మంది భారతీయులతోపాటు వివిధ దేశాల పర్యాటకులతో వెళ్తున్న రెండు బస్సులు అయిన్‌సోఖ్నా సమీపంలో ట్రక్కును ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు భారతీయులు, ఇద్దరు మలేషియన్లు, ముగ్గురు ఈజిప్టు దేశీయులు మృతి చెందారు. క్షతగాత్రులు 24 మందిలో 13 మంది భారతీయులున్నట్లు భారత రాయబార కార్యాలయం తెలిపింది.

### మహారాష్ట్ర-కర్ణాటక మధ్య మళ్లీ ఉద్రిక్తత

**సాక్షి, ముంబై:** మహారాష్ట్ర –కర్ణాటక సరిహద్దు వివాదం మరోసారి ముదిరింది. మహారాష్ట్ర ఏకీకరణ సమితి నేతలను రాష్ట్ర సరిహద్దుల్లో నిలబెట్టి తుపాకీతో కాల్చి పారేయాలంటూ కర్ణాటక నవనిర్మాణ సేన అధ్యక్షుడు భీమాశంకర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలు తాజా చిచ్చుకు కారణమయ్యాయి. ఆందోళనకారులు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కొల్హాపూర్‌లో కన్నడ సినిమా ప్రదర్శనలు అడ్డుకున్నారు. దీంతో ముందు జాగ్రత్తగా బస్సు సర్వీసులను రద్దు చేశారు.

### కొత్తగా 24 సబ్‌మెరైన్లు

**న్యూఢిల్లీ:** నౌకాదళ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా మరో 24 జలాంతర్గాములను నిర్మించనున్నట్లు భారతీయ నౌకాదళం వెల్లడించింది. అందులో 6 జలాంతర్గాములు అణ్వస్త్ర సామర్థ్యమున్నవని పేర్కొంది. ఈ మేరకు పార్లమెంటరీ కమిటీకి సమర్పించిన ఒక నివేదికలో వివరించింది. ప్రస్తుతం నౌకాదళం వద్ద 15 సాధారణ జలాంతర్గాములు, రెండు అణ్వస్త్ర సామర్థ్యమున్న జలాంతర్గాములు ఉన్నాయని తెలిపింది. 15 సాధారణ జలాంతర్గాముల్లో అనేకం 25 ఏళ్లు పైబడినవేనని వెల్లడించింది. హిందూ మహా సముద్రంలో చైనా నేవీ కార్యకలాపాలు పెరిగిన నేపథ్యంలో భారత నౌకాదళ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపింది.

### కాల్పుల విరమణకు తాలిబన్ అంగీకారం

**కాబూల్:** అఫ్గానిస్తాన్‌లో తాత్కాలికంగా కాల్పుల విరమణకు ఉగ్ర సంస్థ తాలిబన్ కౌన్సిల్ అంగీకారం తెలిపింది. అమెరికాతో శాంతి ఒప్పందం కుదుర్చుకునే దిశగా మార్గం సుగమం చేసింది. తాలిబన్, అమెరికాల మధ్య శాంతి ఒప్పందం కుదిరితే.. అఫ్గానిస్తాన్ నుంచి అమెరికా తన దళాలను వెనక్కు తీసుకువెళ్తుంది. 18 ఏళ్లుగా అమెరికా అఫ్గానిస్తాన్‌లో మిలటరీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

# పెజావర స్వామీజీ అస్తమయం

- ఆదివారం ఉదయం కన్నుమూత
- 8 దశాబ్దాలుగా ఆధ్యాత్మిక సేవ
- బెంగళూరులో అంత్యక్రియలు
- కర్ణాటకలో 3రోజులు సంతాప దినాలు



బెంగళూరులో విశ్వేశతీర్థ స్వామీజీ పార్థివ దేహాన్ని తరలిస్తున్న భక్తులు

**సాక్షి, బెంగళూరు:** దక్షిణాది ఆధ్యాత్మిక ప్రముఖుల్లో ఒకరైన ఉడుపి పెజావర మఠాధిపతి శ్రీ విశ్వేశతీర్థ స్వామీజీ(88) ఆదివారం ఉదయం కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో 9 రోజులుగా మణిపాల్ లోని కేఎంసీ ఆస్పత్రిలో స్వామీజీ చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం స్వామీజీ ఆరోగ్యం మరింత విషమించడంతో మఠానికి తీసుకుని వెళ్లారు. అనంతరం, ఉదయం 9.20 గంటల సమయంలో స్వామీజీ తుదిశ్వాస విడిచారు. స్వామీజీ మృతికి ప్రధాని మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. స్వామీజీ భౌతిక కాయంపై కర్ణాటక సీఎం యెడియూరప్ప జాతీయ జెండా కప్పి నివాళులర్పించారు. పలువురు మంత్రులు, బీజేపీ, ఆరెస్సెస్ నేతలు స్వామీజీకి నివాళులర్పించారు. ప్రభుత్వ లాంఛనాల మధ్య బెంగళూరులోని విద్యాపీఠ ఆవరణలో అంత్యక్రియలు ముగిశాయి. ప్రభుత్వం 3 రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది.

**స్వామీజీ కోరిక మేరకు..**

శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో ఈ నెల 20న స్వామీజీని మణిపాల్‌లోని కేఎంసీ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. శనివారం రాత్రి ఆయన శరీరంలోని కీలక అవయవాలు స్పందించడం ఆగిపోయింది. తుది శ్వాస మఠంలోనే విడవాలన్న స్వామీజీ కోరిక మేరకు ఆదివారం ఉదయం పెజావర మఠానికి తరలించారు.

**ప్రధాని సంతాపం**

స్వామీజీ మరణం పట్ల ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ‘లక్షలాది ప్రజల హృదయాల్లో స్వామీజీ ధ్రువతారగా నిలిచి ఉంటారు. ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో ఎంతో కృషి చేశారు. ఓం శాంతి’ అని ట్వీట్ చేశారు.

**ఉడుపి నుంచి బెంగళూరుకు**

స్వామీజీ మరణవార్త విన్న అశేష భక్తులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. కేంద్ర మాజీ మంత్రి ఉమాభారతి ఉదయమే మఠానికి చేరుకున్నారు. భక్తుల సందర్శనార్థం భౌతిక కాయాన్ని ఉడుపిలోని అజ్జనగూడు మహాత్మాగాంధీ మైదానంలో ఉంచారు. తర్వాత హెలికాప్టర్‌లో బెంగళూరుకు తరలించారు. బసవనగుడిలోని నేషనల్ కాలేజీ మైదానంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. తర్వాత సంప్రదాయాల ప్రకారం పూర్ణ ప్రజ్ఞ విద్యా పీఠంలో అంతిమ సంస్కారాలను పూర్తి చేశారు.

**మధ్వాచార్యుడు స్థాపించిన మఠం**

800 ఏళ్ల క్రితం శ్రీ మధ్వాచార్యుడు స్థాపించిన ఉడుపి అష్ట మఠాల్లో పెజావర మఠం ఒకటి. ప్రసిద్ధ ఉడుపి శ్రీకృష్ణ ఆలయ బాధ్యతలను ఈ మఠాలు విడతల వారీగా పర్యవేక్షిస్తుంటాయి. పెజావర మఠ పెద్దల్లో విశ్వేశ స్వామీజీ 33వ వారు. 1931 ఏప్రిల్ 27న రామ కుంజలోని బ్రాహ్మణ కుటుంబంలో ఆయన జన్మించారు. 1938లో సన్యాసం స్వీకరించారు.

### హిందూజాతికి తీరని లోటు

**- స్వరూపానందేంద్ర సరస్వతి**

పెజావర మఠాధిపతి విశ్వేశతీర్థ పరమపదించడం పట్ల విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విశ్వేశతీర్థ మరణం హిందూజాతికి తీరని లోటన్నారు. హిందూ సమాజం గర్వించదగ్గ మత గురువుల్లో ఆయన ఒకరన్నారు. హిందూధర్మ పరిరక్షణకు విశ్వేశతీర్థ విశేష కృషి చేశారన్నారు. బెంగళూరులో పూర్ణప్రజ్ఞ విద్యా పీఠాన్ని ఏర్పాటు చేసి 63 ఏళ్లుగా వేదాంతంలో ఎంతోమందిని నిష్ణాతులను చేశారన్నారు.

### స్వామీజీ సేవలు చిరస్మరణీయం

**– ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి**

**సాక్షి, అమరావతి:** ఉడుపి పెజావర మఠాధిపతి శ్రీ విశ్వేశతీర్థ స్వామీజీ మృతికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలతో స్వామీజీ విశేష సేవలు అందించారని ఆయన పేర్కొన్నారు. సమాజ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి స్వామీజీ చేసిన నిరుపమాన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయన్నారు.

# నేడే ‘మహా’ మంత్రివర్గ విస్తరణ!

**సాక్షి, ముంబై:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే తొలి మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు సమాచారం. శివసేన చీఫ్ ఉద్ధవ్ సీఎంగా శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్‌ల నుంచి ఇద్దరు చొప్పున మంత్రులుగా నవంబర్ 28న ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. తాజాగా, డిసెంబర్ 30న ఉద్ధవ్ మంత్రివర్గాన్ని విస్తరించనున్నారని ఒక వార్తా చానెల్ వెల్లడించింది. ఆ చానెల్ ప్రకారం.. శివసేన నుంచి 13 మందిని, ఎన్సీపీ నుంచి 13 మందిని, కాంగ్రెస్‌కు చెందిన 10 మందిని మంత్రివర్గంలో చేర్చుకోనున్నారు. శివసేన, ఎన్సీపీలకు 10 కేబినెట్, 3 సహాయ మంత్రి పదవులు ..కాంగ్రెస్ నుంచి 8 మంది కేబినెట్, ఇద్దరు సహాయ మంత్రులు కానున్నారు. అయితే, ఉద్ధవ్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పదవి ఎవరిని వరించనుందనే విషయంపై స్పష్టత రాలేదు. ఎన్సీపీ నుంచి అజిత్ పవార్, జయంత్ పాటిల్‌ల పేర్లు వినిపిస్తున్నాయి.

# సీడీఎస్ గరిష్ట వయో పరిమితి 65 ఏళ్లు



**న్యూఢిల్లీ:** రక్షణ బలగాల అధిపతి(సీడీఎస్) బాధ్యతలు చేపట్టే వ్యక్తి గరిష్ట వయో పరిమితిని కేంద్రం 65 ఏళ్లకు పెంచింది. ఈ మేరకు సైనిక, నేవీ, వైమానిక దళం నిబంధనలు–1954లో మార్పులు చేస్తూ రక్షణ శాఖ ఆదివారం నోటిఫికేషన్ వెలువరించింది. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ అధిపతులను నియమించిన సందర్భాల్లో ఈ నిబంధన వర్తిస్తుంది. త్రివిధ దళాలకు సంబంధించిన అన్ని అంశాలపై రక్షణ మంత్రికి ప్రధాన సలహాదారుగా సీడీఎస్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కేబినెట్ భేటీ ఇటీవల ఆమోదించిన విషయం తెలిసిందే. ప్రస్తుత నిబంధనల ప్రకారం త్రివిధ దళాల అధిపతులు గరిష్టంగా మూడేళ్లపాటు, లేదా 62 ఏళ్ల వయస్సు వచ్చే వరకు బాధ్యతల్లో కొనసాగుతారు. కాగా, దేశ మొట్టమొదటి సీడీఎస్‌గా ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్‌ను ప్రభుత్వం మంగళవారం ప్రకటించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.కాగా, సీడీఎస్‌గా చేపట్టే వ్యక్తే చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్‌పర్సన్‌గానూ కొనసాగుతారు.

# ఎక్స్ సర్వీస్‌మెన్ డేటాబేస్ మాయం

**న్యూఢిల్లీ:** 45 లక్షల మంది త్రివిధ దళాల మాజీ సిబ్బందికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని తిరిగి ఇవ్వలేదంటూ ఒక ప్రైవేటు సంస్థపై ఢిల్లీలో కేసు నమోదు అయింది. రక్షణ శాఖ ఫిర్యాదు మేరకు ‘స్కోర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లిమిటెడ్(ఎస్ఐటీఎల్)’ సంస్థపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నౌకాదళ మాజీ అధికారి లోకేశ్ బత్రా ఈ వివరాలను సమాచార హక్కుచట్టం(ఆర్టీఐ) ద్వారా సంపాదించారు. ఎక్స్ సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్(ఈసీహెచ్ఎస్) అమలు కోసం స్మార్ట్ కార్డ్స్‌ను రూపొందించేందుకు ఎస్ఐటీఎల్ కు 2010లో కాంట్రాక్ట్ ఇచ్చారు. ఇందులో భాగంగా, సాయుధ దళాల మాజీ సిబ్బంది వ్యక్తిగత సమాచారాన్ని వారికి ఇచ్చారు. 2015లో ఆ కాంట్రాక్ట్ ముగిసింది. ఆ తరువాత, డేటాలో మార్పుచేర్పులకు అవసరమైన సోర్స్ కోడ్, కీ సహా మొత్తం డేటాబేస్‌ను రక్షణ శాఖకు తిరిగి ఇచ్చేయాల్సి ఉంది. కానీ, ఎస్ఐటీఎల్ అలా చేయలేదు. కనీసం ఆ డేటా తమ వద్ద లేదన్న విషయాన్ని కూడా ఆ సంస్థ చెప్పడం లేదని పేర్కొంది.

# అరాచకం, అస్థిరతలపై అసహనం

- వ్యవస్థలో లోపాలుంటే యువత ధైర్యంగా నిలదీస్తోంది
- వచ్చే దశాబ్దాలన్నీ యువతరానివే
- మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** వచ్చే దశాబ్దాలన్నీ యువతరానివేనని, వ్యవస్థపై వారికి అపారమైన నమ్మకం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వ్యవస్థలు సరిగా స్పందించకపోతే యువతలో ప్రశ్నించే ధోరణి కనిపిస్తోందని కొనియాడారు. ఆకాశవాణిలో ఆదివారం నాడు ఈ ఏడాది చివరి మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మాట్లాడారు. అరాచకత్వం, అనిశ్చితి పరిస్థితుల్ని నేటి తరం ద్వేషిస్తున్నారని ప్రధాని అన్నారు. కులతత్వం, బంధుప్రీతిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని వ్యాఖ్యానించారు. పౌరసత్వ చట్ట సవరణలకు, ప్రతిపాదిత ఎన్నార్సీకి వ్యతిరేకంగా ఇటీవల యూనివర్సిటీల్లో నిరసనలు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ‘నాకు తెలిసినంతవరకు నేటి తరం వ్యవస్థలపైనే నమ్మకం ఉంచింది. వాటిని అనుసరించాలనీ భావిస్తోంది. వ్యవస్థలు సరిగా స్పందించనప్పుడు వారిలో అసహనం పెరిగిపోతోంది. ధైర్యంగా ప్రశ్నించే తత్వం కూడా కనబడుతోంది’’అని మోదీ అన్నారు. దేశంలో యువత అరాచకం ఏ రూపంలో ఉన్నా సహించలేరని, పాలనా వైఫల్యాలను, అస్థిరతను తట్టుకోలేక పోతున్నారని అన్నారు.

**జాతి నిర్మాణంలో పాల్గొనాలి**

ధైర్యసాహసాలు, ఉత్తేజపూరిత స్వభావం కలిగిన యువతే మార్పుకి బాటలు వేస్తుందని స్వామి వివేకానంద మాటల్ని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుకు తెచ్చుకున్నారు. జనవరి 12 వివేకానందుడి జయంతిని పురస్కరించుకొని యువత జాతి నిర్మాణంలో తమ వంతు బాధ్యతని తలకెత్తుకోవాలని, దేశ పురోగతికి కావల్సిన ఆలోచనలు చేయాలని పిలుపునిచ్చారు. దేశాన్ని అత్యున్నత శిఖరాలకు తీసుకువెళ్లే సత్తా యువతకే ఉందన్నారు.

**దేశీయ ఉత్పత్తులకి ప్రాచుర్యం కల్పించాలి**

వచ్చే రెండు మూడేళ్లు దేశీయ ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. 2022లో భారత్ 75ఏళ్ల స్వాతంత్ర్య సంబరాలను పూర్తి చేసుకున్నంతవరకు స్వదేశీ ఉత్పత్తులనే వాడాలని అన్నారు. భారత్‌లో భారతీయుల చేతులతో, వారి స్వేదాన్ని చిందించి తయారు చేసిన ఉత్పత్తుల్ని ఒక రెండేళ్లు వాడేలా యువతే ముందుకు రావాలని అన్నారు.

### అవసరమైతే తీసుకుంటాం

**ఎన్ఆర్‌సీ-ఎన్‌పీఆర్ లింకుపై కేంద్ర మంత్రి**



**న్యూఢిల్లీ:** కేంద్ర న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఎన్‌పీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఎన్‌పీఆర్ డేటాను ఎన్ఆర్‌సీకోసం ఉపయోగించుకునే అవకాశాన్ని తోసిపుచ్చలేమని ఆయన ఆదివారం ప్రకటించారు. ఎన్‌పీఆర్‌కి, ఎన్ఆర్‌సీకి ఎలాంటి సంబంధం ఉండబోదని గత వారం హోంమంత్రి అమిత్‌షా ప్రకటించిన నేపథ్యంలో రవిశంకర్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం లభించింది. ‘జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌పీఆర్) కోసం సేకరించిన డేటాను జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ) అవసరాల కోసం ఉపయోగించొచ్చు.. లేదా ఉపయోగించకపోవచ్చు’అని రవిశంకర్ ప్రసాద్ ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. ‘పాస్‌పోర్ట్‌లు, పాన్ కార్డు కోసం డేటా సేకరించినప్పుడు లేని సమస్య ఎన్ఆర్‌సీకి మాత్రమే ఎందుకు వస్తోంది, ప్రజలు ప్రభుత్వ విధానాన్ని అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారు’అని రవిశంకర్ ప్రసాద్ అన్నారు.

# గ్లోబల్ 2019 వార్నింగ్స్

# సంచలనాలమయం



## మంటలు రేపిన మాటలు...

రాజకీయాలంటేనే ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడం... నోటికి ఏదొస్తే అది మాట్లాడటంగా మారిపోయింది. 2019 సంవత్సరం ఎన్నికల ఏడాది కూడా కావడంతో ఎందరో నేతలు నోరు జారారు. దిగజారుడుకు హద్దుల్లేవని నిరూపించారు. అలాంటి మాటలు కొన్ని చూస్తే...



మేకిన్ ఇండియా కాదు రేపిన్ ఇండియా
- రాహుల్ గాంధీ, కాంగ్రెస్



ముస్లింలీగ్ గ్రీన్ వైరస్
- యోగి ఆదిత్యనాథ్, యూపీ సీఎం



గాడ్సే దేశభక్తుడు
- ప్రజ్ఞాఠాకూర్, బీజేపీ ఎంపీ



జయప్రద లోదుస్తులు ఖాకీ
- ఆజంఖాన్, ఎస్పీ నాయకుడు

## తీరైన తీర్పులు


దశాబ్దాలే కాదు... కొన్ని శతాబ్దాల సందిగ్ధానికి కూడా సర్వోన్నత న్యాయస్థానం తెరదించిన సంవత్సరమిది. శ్రీరాముడి జన్మభూమిగా భావించే అయోధ్య అంశం మొదలుకొని... రాజకీయ యవనికను కుదిపేసిన రాఫెల్ డీల్ వరకు ఎన్నెన్నో కీలకమైన తీర్పులు వెలువడ్డాయి. వీటిలో మత ప్రాధాన్యమైనవే కాదు!!. మహిళల హక్కులకు సంబంధించినవి... ఆఖరికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయాన్ని కూడా సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకువచ్చే తీర్పులూ ఉన్నాయి. ఆ మేటి తీర్పులు సంక్షిప్తంగా...



### జన్మభూమి... రాముడిదే!

దేశ చరిత్రలోనే సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న అయోధ్యలోని రామ జన్మభూమి – బాబ్రీ మసీదు వివాదంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం నవంబర్ 9న తుది తీర్పు వెలువరించింది. 2.77 ఎకరాల వివాదాస్పద భూమిలో హిందువులు రామ మందిరాన్ని నిర్మించుకోవడానికి అనుమతించింది. ముస్లింలకు మసీదు నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలాన్ని వేరొకచోట కేటాయించాలని యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. మందిర నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ట్రస్ట్‌ని ఏర్పాటు చేయాలని కూడా కోర్టు స్పష్టం చేసింది.

### శబరిమలకు మహిళలు...



కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి దేవాలయంలోకి మహిళల ప్రవేశంపై దాఖలైన రివ్యూ పిటిషన్లను ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనానికి బదిలీచేస్తూ 3:2 మెజారిటీతో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అయితే వయసు రీత్యా కొన్ని వర్గాలకు చెందిన మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ 2018 సెప్టెంబర్ 28న ఇచ్చిన తీర్పుపై మాత్రం కోర్టు ఎలాంటి స్టే విధించలేదు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ నారిమన్, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఇందూ మల్హోత్రాలతో కూడిన ధర్మాసనం నవంబర్ 14న ఈ తీర్పుని వెలువరించింది.

### రాఫెల్... విచారణకు నో!


రాఫెల్ ఫైటర్ జెట్‌లను కొనుగోలు చేయటానికి ఆ కంపెనీతో కేంద్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందంపై విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ప్రభుత్వానికి క్లీన్ చిట్ ఇచ్చిన గత తీర్పులను పునఃపరిశీలించాలన్న డిమాండ్‌ని కోర్టు తోసిపుచ్చింది. న్యాయవాది ప్రశాంత్ భూషణ్, కేంద్ర మంత్రులు యశ్వంత్ సింగ్, అరుణ్ శౌరి దాఖలు చేసిన పిటిషన్లపై మే 10న కోర్టు విచారణ ముగించి తన ఉత్తర్వులను రిజర్వులో ఉంచింది. నవంబరు 14న తీర్పు వెలువరించింది.

### న్యాయమా! నువ్వు 'ఉన్నావ్'...



ఢిల్లీలో నిర్భయ ఘటన అనంతరం ఉత్తర ప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో మైనర్ బాలికపై ఘోర అత్యాచారం జరగటంతో దేశం నిర్ఘాంతపోయింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి అధికార బీజేపీ ఎమ్మెల్యే కావటంతో కేసు ఎన్నెన్నో మలుపులు తిరిగింది. పార్టీ అతన్ని బహిష్కరించింది. అయితేనేం!! నేరాన్ని కప్పిపుచ్చే యత్నాలు ఆగలేదు. బాధిత మహిళను కిడ్నాప్ చేయటం... ఆమె తండ్రి లాకప్ హత్య... బాధితురాలు సహా బంధువులను యాక్సిడెంట్ రూపంలో చంపే ప్రయత్నాలు... ఇలా ఎన్నో ఘటనలు చోటుచేసుకున్నాయి. రాజకీయ నాయకుడు నిందితుడైతే కేసు ఎన్ని మలుపులు తిరుగుతుందో అన్ని మలుపులూ తిరిగింది. దీంతో ఈ కేసుపై యావద్దేశం ఒక్కటయింది. చివరికి సర్వోన్నత న్యాయ స్థానం జోక్యం చేసుకుంది. 45 రోజుల్లో విచారణ పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఫలితం... బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌ను దోషిగా నిర్ధారిస్తూ ఢిల్లీ తీస్‌హజారీ కోర్టు తీర్పునిచ్చింది. డిసెంబర్ 19న సెంగార్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

## 'సోషల్'.. వైరల్!



సెకన్లు, నిమిషాల వ్యవధిలో కార్చిచ్చులా వ్యాపించి అందరినీ చేరుకునే సత్తా ఉండటం సోషల్ మీడియాలో కొత్త పోకడలకు ఆస్కారమిస్తోంది. ఆ సిత్రాలు కొన్ని చూస్తే...

### బాటిల్ క్యాప్ చాలెంజ్

సీసా మూతను కాలితో తీసే చాలెంజ్ పేరే బాటిల్ క్యాప్ చాలెంజ్. టైక్వాండో ఇన్‌స్ట్రక్టర్ ఫరాబీ డవ్లెట్‌చిన్ దీన్ని ప్రారంభించారు. నేలపైనగానీ, బల్లపైన గానీ ఒక సీసాని ఉంచి, దాని మూతను వదులుగా పెట్టాలి. కాలితో సీసా మూత ఊడిపోయి కిందపడేలా చేయాలి. సీసా మాత్రం పడకూడదు. బాలీవుడ్ నటులు అక్షయ్‌కుమార్, గోవింద, పరిణీతి చోప్రా, సుస్మితా సేన్ లాంటి ప్రముఖులు ఈ చాలెంజ్‌లో పాల్గొన్నారు.

### కికీ చాలెంజ్

కదులుతున్న కారులోంచి దిగడం.. పాటకు తగ్గట్టు డ్యాన్స్ చేయడం... ఇదీ కికీ ఛాలెంజ్!!. యువత ఈ చాలెంజ్‌ను క్షణాల్లో వైరల్‌గా మార్చేసినా.. చాలా చోట్ల ఈ చేష్టలు ప్రమాదాలకూ కారణమయ్యాయి. దేశంలోని ప్రధాన నగరాల్లోనూ ఇలాంటి ఘటనలు నమోదు కావడంతో పోలీసులు.. ఈ చాలెంజ్‌లో పాల్గొనవద్దంటూ హెచ్చరికలు జారీచేయాల్సిన పరిస్థితులొచ్చాయి.

### ఫిట్‌నెస్ చాలెంజ్

ఈ చాలెంజ్ ప్రకారం యోగా చేస్తున్న దృశ్యాల వీడియోలను సోషల్ మీడియాలో పంచుకోవాలి. ప్రధాని మోదీ యోగా వీడియోలూ మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. క్రీడాకారులూ, బాలీవుడ్ నటులు ఇంకా ఎందరో ఇందులో పాల్గొన్నారు.

## మృగాళ్లు... చెలరేగిపోయారు




ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన పురుషులను చీల్చి చెండాడిన 'మీటూ' ఉద్యమం ఈ ఏడాది మహిళలకు కొత్త శక్తినిచ్చింది. ఈ చైతన్యమే మహిళా ఉద్యమంలో 2019ని మైలురాయిగా నిలిపింది. అక్రమాలపై, అత్యాచారాలపై నిర్భయంగా గళమెత్తేలా చేసింది. మరోవంక ఇన్ని జరిగినా మృగాళ్లు మాత్రం చెలరేగిపోతూనే వచ్చారు.

### యావద్దేశానికీ... ఒక 'దిశ'

నవంబర్ 27, 2019న తెలంగాణలోని శంషాబాద్ టోల్‌ప్లాజా దగ్గర వెటర్నరీ వైద్యురాలిని నలుగురు యువకులు దారుణంగా అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటన యావద్దేశాన్నీ అట్టుడికించింది. ఈ ఘాతుకానికి పాల్పడ్డ దుర్మార్గులను తక్షణం ఉరితీయాలంటూ ప్రాంతాలకతీతంగా యావద్దేశం ఒక్కటైంది. ఆ తరువాత ఈ దారుణానికి పాల్పడిన నలుగురు యువకులను పోలీసులు ఎదురు కాల్పుల్లో కాల్చి చంపడం వేగంగా జరిగిపోయింది. యువతుల్లో, మహిళల్లో చైతన్యాన్ని నింపే అనేక కార్యక్రమాలకు ఈ ఘటన దారితీసింది. 'దిశ' పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కఠినమైన చట్టాన్ని కూడా తెచ్చింది.

### అత్యాచార బాధితురాలిని కాల్చేశారు

ఉత్తరప్రదేశ్‌లోని 'ఉన్నావ్'లో తనపై అత్యాచారానికి పాల్పడిన వారిని శిక్షించాలంటూ కోర్టుకెళ్లిన ఓ మహిళ... వారి దౌర్జన్యానికి బలైపోయింది. ఐదుగురు నిందితుల్లో బెయిల్‌పై వచ్చిన ఇద్దరితోపాటు మరో ముగ్గురు బాధితురాలిని సజీవ దహనం చేసే యత్నం చేశారు. అగ్ని కీలల్లో దగ్ధమవుతూనే ఆసరా కోసం చుట్టుపక్కల జనాన్ని ప్రాధేయపడిన బాధితురాలు... చివరకు పోలీసులకు స్వయంగా ఫోన్ చేసి సాయం కోరడం అందర్నీ కలచి వేసింది. ఈ కేసులో నిందితుడు శుభం త్రివేదీ ఆమెను పెళ్ళి చేసుకుంటానని నమ్మించి, తన సోదరుడితో కలసి ఆమెపై 2018లో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు తన మరణ వాంగ్మూలంలో ఇదే చెప్పింది. చివరికామె ఆసుపత్రిలో కన్నుమూసింది.

## అంతర్జాతీయం

అంతర్జాతీయంగా ఈ ఏడాది ఎన్నెన్నో ప్రభావవంతమైన ఘటనలకు వేదికయింది. ఆ వివరాలు చూస్తే...

### అమెరికా - ఉత్తర కొరియా అణు సంక్షోభం

ఉత్తర కొరియాను అణ్వస్త్ర రహిత దేశంగా మార్చాలని అగ్రరాజ్యం భావిస్తూ ఉంటే, దేశ అధ్యక్షుడు కిమ్ మరిన్ని అణు పరీక్షలు నిర్వహిస్తూ ఉద్రిక్తత్లని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ ఉత్తర కొరియాలో జూన్ 30న అడుగు పెట్టడం ఈ ఏడాది అతి పెద్ద విశేషంగా చెప్పుకోవాలి. ఉత్తర కొరియాకు వెళ్లిన తొలి అమెరికా అధ్యక్షుడిగానూ ఆయన రికార్డు సృష్టించారు. ఉత్తర కొరియాలో జరిగిన సమావేశంలో ఇరు దేశాధినేతలు అణు చర్చలు జరపాలని నిర్ణయించారు. కానీ అక్టోబర్ 1 వరకు అది సాధ్యం కాలేదు. అయితే ఐక్యరాజ్య సమితి తీర్మానాన్ని ఉల్లంఘించి మరీ ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణి పరీక్షలు నిర్వహించింది. దీంతో ఇరు దేశాల ప్రతినిధులు అక్టోబర్ 5న సంప్రదింపులు జరిపారు. అవి కూడా ముందుకు వెళ్లలేదు.



### ట్రంప్ అభిశంసనకు ఓకే!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభిశంసనని ఎదుర్కొన్నారు. డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి పోటీదారు అయిన జో బైడెన్‌పై ఉన్న అవినీతి ఆరోపణలకు తగు ఆధారాలు సంపాదించి, విచారణ జరపాలని... తనకు రాజకీయంగా సహకరించాలని ఉక్రెయిన్‌పై ట్రంప్ ఒత్తిడి తెచ్చినట్టు ఆరోపణలున్నాయి. ట్రంప్ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, కాంగ్రెస్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొంటూ ప్రతినిధుల సభలో విచారణ సాగింది. ప్రతినిధుల సభ అభిశంసనకి అనుకూలంగా ఓటు కూడా వేసింది. ఈ అభిశంసన తీర్మానం కొత్త ఏడాది జనవరిలో సెనేట్‌లో చర్చకు రానుంది.

### హాంగ్‌కాంగ్ భగ్గు

హాంగ్‌కాంగ్‌లో భగ్గుమన్న నిరసనలు ఈ ఏడాది ప్రపంచ దేశాల్లో మరెన్నో పోరాటాలకి స్ఫూర్తిగా నిలిచాయి. చైనా చేసిన నేరస్తుల అప్పగింత బిల్లుపై హాంగ్‌కాంగ్‌లో అగ్గి రాజుకుంది. ఈ బిల్లు నిందితుల్ని చైనాలో విచారించడానికి వీలు కల్పిస్తుంది. చైనా ప్రభుత్వ విధానాలపై కొన్నేళ్లుగా పేరుకుపోయిన అసంతృప్తి అగ్నికి ఆజ్యం పోసినట్టయింది. హాంగ్‌కాంగ్ ప్రత్యేక ప్రతిపత్తిని నిర్వీర్యం చేసేలా చైనా ప్రభుత్వం వ్యవహరిస్తోందని నిరసిస్తూ రోడ్డెక్కారు. ప్రభుత్వం కూడా పోలీసు బలగాలతో నిరసనలు అణచివేయాలని అనుకుంది కానీ అంతకంతకూ అవి తీవ్రమయ్యాయి.

### బ్రెగ్జిట్ గెలుపు.. బోరిస్ జాన్సన్

2019 చివరలో బ్రిటన్ ఒక స్పష్టమైన వైఖరిని కనబరిచింది. యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలిగే ప్రక్రియను (బ్రెగ్జిట్) 2020 మార్చి 29 నాటికి పూర్తి చేయాలని డెడ్‌లైన్ కూడా విధించుకుంది. దీనికి తగ్గట్టుగా దేశంలో రాజకీయంగా భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. బ్రిటన్ ప్రధానిగా మూడు సార్లు బ్రెగ్జిట్ ఒప్పందాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో విఫలమైన థెరెస్సా మే... తన పదవికి రాజీనామా చేయగా అప్పటికే కన్జర్వేటివ్ పార్టీలోని బోరిస్ జాన్సన్ ఈయూతో ఏ ఒప్పందం లేకుండా బ్రిటన్ నుంచి వైదొలుగుతామని చెప్పారు. దీంతో పార్టీ ఆయన్ను ప్రధానిని చేసింది. అయితే సభలో బ్రెగ్జిట్‌ను వ్యతిరేకించే సంప్రదాయవాదులు కూడా ఉండడంతో జాన్సన్ సభను రద్దు చేసి ఎన్నికలకు వెళ్లారు. అఖండ మెజార్టీతో నెగ్గారు. జనవరి 31లోగా బ్రెగ్జిట్‌కు అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందిస్తానని జాన్సన్ వెల్లడించారు.



### అమెజాన్ చిచ్చు

పుడమికి ఊపిరితిత్తులుగా పేరొందిన బ్రెజిల్‌లోని అమెజాన్ అడవుల్లో ఏర్పడిన కార్చిచ్చు ప్రపంచవ్యాప్తంగా గుబులు పుట్టించింది. ఇక్కడ కార్చిచ్చులు సర్వసాధారణమైనా 2019లో 80 వేల చోట్ల చెలరేగిన కార్చిచ్చులు రికార్డు సృష్టించాయి.



## ఎన్నికలు.. ఆందోళనలు

ఈ ఏడాది రాజకీయంగా, సామాజికంగా జరిగిన మార్పులు మామూలువి కావు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరున్న భారతదేశంలో ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో సార్వత్రిక ఎన్నికల క్రతువు ముగిసింది. 543 లోక్‌సభ స్థానాలతో పాటు కొన్ని అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరగ్గా భారతీయ జనతా పార్టీ 303 లోక్‌సభ స్థానాలతో కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకుంది. ఒక రాజకీయ పార్టీ సొంతంగా పూర్తిస్థాయి మెజారిటీ సాధించడం 30 ఏళ్ల తరువాత ఇదే తొలిసారి కూడా.

### ఆర్థికంగా వెనుకబడ్డ వారికి రిజర్వేషన్లు..

విద్యా, ఉపాధి రంగాల్లో ఆర్థికంగా వెనుకబడ్డ అగ్రవర్ణాల వారికి పదిశాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రాజ్యాంగాన్ని 124వ సారి మార్చారు కూడా. ఏడాదికి రూ.8 లక్షల కంటే తక్కువ ఆదాయం కలిగి ఉండి... ప్రభుత్వమిచ్చే ఇతర రిజర్వేషన్లు (ఎక్స్ సర్వీస్ మెన్, వికలాంగులు తదితరాలు) ఉపయోగించుకోని అగ్రవర్ణాల వారికి ఈడబ్ల్యూఎస్ కోటా వర్తిస్తుంది. ఏడాది మొదట్లో, లోక్‌సభ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఈ నిర్ణయం తీసుకోవడం ఎన్డీయేపై కొన్ని విమర్శలు వచ్చేందుకూ కారణమైంది.

### పౌరసత్వ చట్ట సవరణ....

దేశవ్యాంతం ఆందోళనలకు, హింసాత్మక ఘటనలకు తావిచ్చిన చట్ట సవరణ ఇది. 1955 నాటి చట్టం ప్రకారం భారతీయ పౌరులయ్యేందుకు ఉన్న ఐదు అవకాశాల్లో కొన్ని సవరణలు చేయడం మొత్తం వివాదానికి కారణమైంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లకు చెందిన హిందు, సిక్కు, పార్శీ, క్రైస్తవ, జైన, బౌద్ధ మతాల వారు ఆయా దేశాల్లో మతపరమైన హింస ఎదుర్కొంటే వారికి భారతీయ పౌరసత్వం కల్పించేందుకు ఈ సవరణ వెసులుబాటు కల్పించింది. ఈ జాబితాలో ముస్లింల ప్రస్తావన లేకపోవడం, ఇతర ప్రాంతాలు, దేశాల నుంచి వచ్చే ముస్లిమేతరుల పరిస్థితీ అగమ్యగోచరంగా మారడంతో పెద్ద ఎత్తున ఆందోళనలు రేగాయి. ఈ ఆందోళనపూరిత వాతావరణం కొనసాగుతుండగానే కేంద్రం జాతీయ జనాభా పట్టిక తయారీకి ఏర్పాట్లు చేయడంతో పరిస్థితి ఇంకా సద్దుమణగలేదు.

### కాంగ్రెస్‌లో నేతల కరవు

సార్వత్రిక ఎన్నికల తరువాత రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవడంతో ఆ పార్టీలో కొంత గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. గాంధీ కుటుంబానికి చెందని వారినెవరినైనా పార్టీ అధ్యక్షుడిగా నియమించుకోవాలని రాహుల్ స్వయంగా విజ్ఞప్తి చేసినప్పటికీ కొన్ని నెలల పాటు అధ్యక్ష ఎన్నికపై తర్జనభర్జనలు కొనసాగాయి. చివరకు సోనియాగాంధీ మరోసారి అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. రాహుల్ గాంధీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న సమయంలోనే ఉత్తరప్రదేశ్‌లోని ఒక ప్రాంతానికి ఇన్‌చార్జ్‌గా ప్రియాంక గాంధీ నియమితులవడం, అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగానూ ఆమెకు పదవి దక్కడం ఆ పార్టీలో జరిగిన ముఖ్యపరిణామాల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు.

### కేంద్రపాలిత ప్రాంతాలుగా జమ్మూ కశ్మీర్, లద్దాఖ్...



జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దుతోపాటు జమ్మూ కశ్మీర్ నుంచి లద్దాఖ్‌ను వేరు చేసి కేంద్ర పాలిత ప్రాంతాలుగా ప్రకటించడం ఈ ఏడాది జరిగిన అత్యంత కీలకమైన రాజకీయ ఘట్టాల్లో ఒకటి. దశాబ్దాలుగా దేశంలో ఒకరకమైన అసంతృప్తికి కారణమైన ఆర్టికల్ 370ని ఈ ఏడాది ఆగస్టు 5న రద్దు చేశారు. ఆ తరువాత అక్కడ పెద్ద ఎత్తున ఆంక్షలు విధించడం, 145 రోజుల వరకూ ఇంటర్నెట్‌పై నిషేధం విధించటం వంటి అంశాలు ప్రపంచదేశాలు దృష్టి పెట్టేలా చేశాయి.

### పుల్వామా దాడులు...




పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలకు తాజా తార్కాణంగా చెప్పుకునే పుల్వామా దాడులు ఈ ఏడాది దాయాది దేశాలు మరోసారి కత్తులు నూరేందుకు కారణమయ్యాయి. ఫిబ్రవరి 14న జమ్మూ కశ్మీర్‌లో ఓ మిలటరీ కాన్వాయ్‌పై ఉగ్రవాదులు దాడి చేయగా అందులో సుమారు 40 మంది భారతీయ సైనికులు మరణించారు. ఈ ఘటనకు ప్రతీకారంగా అదే నెల 26న భారత సైన్యం పాకిస్తాన్ లోపలికి చొరబడి బాలాకోట్ వద్ద ఉగ్రవాద స్థావరాలపై బాంబులు వేసింది. ఈ క్రమంలో భారతీయ యుద్ధ విమాన పైలెట్ అభినందన్ వర్ధమాన్ పాకిస్తాన్ చేతికి చిక్కాడు. అంతర్జాతీయ ఒత్తిడికి తలొగ్గిన పాకిస్తాన్ కొన్ని రోజుల వ్యవధిలోనే అభినందన్‌ను సగౌరవంగా భారత్‌కు అప్పగించింది.

## జాబిల్లిని చేరుకున్నాం.. కానీ!!

భారత శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాలు ఈ ఏడాది ఘనవిజయాలే నమోదు చేశాయి. ప్రతిష్టాత్మక చంద్రయాన్–2 ప్రయోగం చివరి క్షణంలో వైఫల్యం ఎదుర్కోవడాన్ని మినహాయిస్తే ఇస్రో ఈ ఏడాది అభివృద్ధివైపు పురోగమించిందనే చెప్పాలి. పూర్తి స్వదేశీ టెక్నాలజీతో సిద్ధం చేసుకున్న నావిగేషన్ మైక్రో ప్రాసెసర్లతో రాకెట్లు నడవడం ఒక విజయమైతే... పీఎస్ఎల్వీ తన 50వ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేయడం, వివిధ దేశాలకు చెందిన 50 వరకూ ఉపగ్రహాలను కక్ష్యల్లోకి ప్రవేశపెట్టడం ఇస్రో కీర్తి కిరీటంలో కలికి తురాయిలే. చెన్నై సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ షణ్ముఖ సుబ్రమణియన్ విక్రమ్ ల్యాండర్ అవశేషాలను గుర్తించి నాసా ప్రశంసలు అందుకోవడం ఈ ఏడాది హైలైట్!.

**ఇక చంద్రయాన్ -2 గురించి...** జాబిల్లిపై ఓ రోవర్‌ను దింపేందుకు, మన సహజ ఉపగ్రహానికి వంద కిలోమీటర్ల దూరంలో ఓ ఆర్బిటర్‌ను ప్రవేశపెట్టేందుకు ఉద్దేశించిన చంద్రయాన్ -2 ప్రయోగం జూలై 22న జరిగింది. జీఎస్ఎల్వీ మార్క్–3 రాకెట్ ద్వారా 3840 కిలోల బరువున్న చంద్రయాన్–2 పలుమార్లు భూమి చుట్టూ చక్కర్లు కొట్టి.. జాబిల్లి కక్ష్యలోకి చేరింది. ఆ తరువాత క్రమేపీ జాబిల్లిని చేరుకుంది. ఆర్బిటర్ నుంచి ల్యాండర్ విజయవంతంగా విడిపోయినప్పటికీ జాబిల్లిపైకి దిగుతున్న క్రమంలో కొంత ఎత్తు లోనే సంబంధాలు తెగిపోయాయి. ఆ తరువాత కొద్ది కాలానికి ల్యాండర్ జాబిల్లి ఉపరితలాన్ని ఢీకొట్టి కుప్పకూలిపోయింది.



### భారతీయ శాస్త్రవేత్త పేరుతో నక్షత్రం

- సౌర కుటుంబానికి ఆవల ఉన్న ఒక గ్రహం తిరుగుతున్న నక్షత్రానికి ఈ ఏడాది భారత శాస్త్రవేత్త బిభా ఛౌదరీ పేరు పెట్టారు.
- ప్రపంచంలోనే అతిపెద్ద రేడియో టెలిస్కోపుగా పేరొందిన థర్టీ మీటర్ టెలిస్కోపు ద్వారా పరిశీలనలు జరిపేందుకు భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిందీ ఈ ఏడాదే.
- ప్రభుత్వ రంగ సీఎస్ఐఆర్‌కు చెందిన సంస్థ కాలుష్యం వెదజల్లని టపాసులను సిద్ధం చేయగా, బొగ్గును మండించడం ద్వారా వచ్చే కాలుష్యాన్ని తగ్గించే పరిశోధనలు చేపట్టేందుకు బెంగళూరులో ఓ కేంద్రం ఏర్పాటైంది.
- కేంద్ర బయోటెక్నాలజీ విభాగం ఈ ఏడాది మానవ అట్లాస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 'మానవ్' పేరుతో జరుగుతున్న ఈ ప్రయత్నంలో శరీరంలోని కణస్థాయి నెట్‌వర్క్ తాలూకూ వివరాలు ఉంటాయి.
- వెయ్యి మంది భారతీయుల జన్యుక్రమ నమోదును ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జినోమిక్స్, హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ శాస్త్రవేత్తలు విజయవంతంగా పూర్తి చేశారు.

**స్టాక్ మార్కెట్లు** శుక్రవారం ముగింపు

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 411 ▲ | 119 ▲ |
| 41,575 | 12,246 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

| సూచీ | ముగింపు | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 9,007 | ▼ | 15 |
| డోజోన్స్ | 28,645 | ▲ | 24 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,645 | ▲ | 13 |
| డాక్స్ | 13,337 | ▲ | 36 |
| షాంఘై | 3,005 | ▼ | 2 |
| నికాయ్ | 23,838 | ▼ | 87 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.52 | 72.16 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.11 | 94.35 |
| యూరో | ఎస్‌బీఐ | 77.89 | 80.78 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.98 | 66.38 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 48.59 | 50.76 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.80 | 53.61 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.24 | 19.84 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.96 | 19.97 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.57 | 10.98 |

# ఫ్రీ.. వాళ్ల పాలసీ! మీరేం చేయాలి?

క్రెడిట్, డెబిట్ కార్డులపై ఉచిత బీమా • మ్యూచువల్ ఫండ్స్ సిప్ పెట్టుబడులపైనా.. • టర్మ్, ప్రమాద, పర్యాటక, ఆరోగ్య బీమాలు నియమ, నిబంధనలు తెలుసుకోవడం అవసరం • అవగాహనతోనే వీటివల్ల ప్రయోజనం



బీమా పాలసీలు ఉచితంగా రావడం ఏంటి... అని ఆశ్చర్యపోతున్నారా..? ఇది నిజమే. ఆర్థిక ఉత్పత్తులు, పెట్టుబడి సాధనాలకు అనుబంధంగా ఉచిత బీమా పాలసీలను కంపెనీలు ఆఫర్ చేయటం కొత్తేమీ కాదు. బ్యాంకు ఖాతాలు, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు, మ్యూచువల్ ఫండ్స్ ఇలా ఎన్నింటికో బీమా పాలసీలను కూడా జతచేసి బండిల్డ్‌గా ఆఫర్ చేస్తున్నాయి కంపెనీలు. అంతేకాదు.. భారతీ ఎయిర్‌టెల్ సంస్థ కొన్ని ప్రీపెయిడ్ ప్లాన్లపైనా టర్మ్ లైఫ్ పాలసీలను ఆఫర్ చేస్తోంది. అదీ ఉచితంగా. నెలసరి రీచార్జ్ ప్లాన్‌పై అంతే కాల వ్యవధికి కస్టమర్ బీమా కవరేజీ అందుకోవచ్చు. ఈ సంస్థలు గ్రూపు ఇన్సూరెన్స్ కవరేజీ తీసుకుని, కస్టమర్లకు ఉచితంగా, తక్కువ చార్జీలకు లేదా ఫ్రీగా ఆఫర్ చేస్తుంటాయి. కానీ, ఇలా ఉచితంగా లభించే పాలసీ ప్రయోజనాలపై చాలా మందికి ఇప్పటికీ అవగాహన లేదు. ఇతర ఉత్పత్తులతో పాటు ఉచితంగా వచ్చే బీమా పాలసీలను చాలా మంది వినియోగించుకోవడం లేదు. నిజం చెప్పాలంటే... ఇలాంటి పాలసీలపై పూర్తిగా ఆధారపడటం సరికాదు. ఎందుకంటే వీటి ప్రయోజనాలు మీ అవసరాలను తీర్చే విధంగా ఉండకపోవచ్చు. వీటిని అదనపు కవరేజీలుగానే చూడాలి. కాకపోతే అవసరం వచ్చినపుడు ఉపయోగించుకోవటం మాత్రం చేయాలి. ఈ తరహా బండిల్డ్ బీమా కవరేజీల గురించి అవగాహన కల్పించే కథనమే ఇది.



## ఎలాంటి పాలసీ ఇస్తున్నారు...



సాధారణంగా ఇతర ఉత్పత్తులతో విక్రయించే పాలసీలు.. వ్యక్తిగత ప్రమాద బీమా, పర్యాటక బీమా, ఆరోగ్య బీమా, జీవిత బీమాకు సంబంధించినవే ఉంటాయి. ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఎస్‌బీఐ తమ క్రెడిట్ కార్డు దారులకు వ్యక్తిగత ప్రమాదబీమాను ఆఫర్ చేస్తున్నాయి. ఎంచుకున్న క్రెడిట్ కార్డు రకాన్ని బట్టి వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీ రూ.50,000– 3,00,000 వరకు ఉంటోంది. బ్యాంకు ఖాతాలు, డెబిట్ కార్డులకు అనుబంధంగానూ ఇవే వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీలు ఉంటున్నాయి. కానీ, ఈ కవరేజీలను యాక్టివ్‌గా (మనుగడలో) ఉంచుకోవాలనుకుంటే నిర్ణీత కాల వ్యవధిలోపు డెబిట్ కార్డు ద్వారా లావాదేవీలు నిర్వహించాలన్న నిబంధనలను కంపెనీలు విధిస్తున్నాయి. ఉదాహరణకు ఎస్‌బీఐ డెబిట్‌కార్డుపై కనీసం 90 రోజులకు ఒక లావాదేవీ అయినా చేయాలి. అప్పుడే ఈ వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీకి అర్హులవుతారు. ఈ కవరేజీ రూ.2–1 0 లక్షల వరకు ఉంది. ఐసీఐసీఐ బ్యాంకు అయితే సమగ్ర బీమా పాలసీని అందిస్తోంది. ఇందులో క్రెడిట్ కార్డుల చోరీపైనా బీమా రక్షణ ఉంటుంది. డైమండ్, సఫైర్, రూబిక్స్ క్రెడిట్ కార్డులపై ఐసీఐసీఐ బ్యాంకు ఈ కవరేజీతో పాటు బర్గలరీ (దొంగతనం వల్ల కలిగే నష్టం) కవరేజీని ఆఫర్ చేస్తోంది. విమాన ప్రమాదాలు, ఇతర ప్రమాదాల కారణంగా ఆస్పత్రిలో చేరాల్సి వస్తే కవరేజీ లభిస్తుంది. అలాగే, పర్యటనలో డాక్యుమెంట్లు, బ్యాగేజీ కోల్పోవడం, విమాన ఆలస్యం వల్ల కలిగే నష్టం, క్రెడిట్ కార్డులపై అనధికారిక లావాదేవీలకు బీమా రక్షణను అందిస్తోంది. రూ.50,000– 3,00,000 మధ్య వీటికి బీమా కవరేజీ ఉంటుంది. బ్యాంకు తరఫున ఐసీఐసీఐ లాంబార్డ్ ఈ కవరేజీలను ఆఫర్ చేస్తోంది. కొన్ని రకాల క్రెడిట్ కార్డులపై హెల్త్ పాలసీలను కూడా కొన్ని సంస్థలు ఆఫర్ చేస్తున్నాయి. కాకపోతే మొదటి ఏడాది కాలానికే ఇవి ఉచితం. తర్వాత రెన్యువల్ ప్రీమియం చెల్లిస్తేనే అది కొనసాగుతుంది. నేరుగా బీమా కంపెనీల నుంచి తీసుకునే హెల్త్ పాలసీలతో పోలిస్తే, ఇలా క్రెడిట్ కార్డులకు అనుబంధంగా వచ్చే వాటి ప్రీమియం కొంత తక్కువగా ఉంటుంది. ఆర్‌బీఎల్ బ్యాంకు, రెలిగేర్ హెల్త్ ఇన్సూరెన్స్ సాయంతో ఇటువంటి ప్లాన్‌ను ఆఫర్ చేస్తోంది.

### మొబైల్ ఫోన్ ప్లాన్లకు కూడా...



టెలికం పరిశ్రమలో తొలిగా భారతీ ఎయిర్‌టెల్ కొన్ని నెలల క్రితమే దీన్ని ప్రవేశపెట్టింది. రూ.599 రీచార్జ్ చేసుకున్న కస్టమర్లు భారతీ ఆక్సా లైఫ్ నుంచి ఉచితంగా జీవిత బీమా ప్లాన్ అందుకోవచ్చు. రూ.599 రీచార్జ్‌పై కస్టమర్లకు వాయిస్, ఇంటర్నెట్ సేవలతోపాటు రూ.4 లక్షల బీమా కవరేజీ లభిస్తుంది. మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) పెట్టుబడులపై జీవిత బీమా కవరేజీని ఆఫర్ చేయడం కూడా ఒకటి. యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ ఇటీవలే రిటైర్మెంట్ సేవింగ్స్ ఫండ్‌ను తీసుకొచ్చింది. యూటీఐతోపాటు మరికొన్ని ఫండ్ కంపెనీలు కూడా ఇదే తరహాలో సిప్ ప్లాన్లపై బీమా కవరేజీని ఆఫర్ చేస్తున్నాయి. సిప్ రూపంలో చేసే పెట్టుబడులపై ఈ కవరేజీ మొత్తం ఆధారపడి ఉంటుంది. ఎంత కాలానికి సిప్ పెట్టుడులకు కట్టుబడి ఉన్నారనే దాని ఆధారంగా బీమా కవరేజీని కంపెనీలు నిర్ణయిస్తున్నాయి. కనీసం 2–3 ఏళ్ల కాలానికి సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసిన తర్వాతే బీమా కవరేజీ అమల్లోకి వస్తుందన్న నిబంధనలను విధిస్తున్నాయి. యాక్సిస్ ఫండ్ అయితే.. ఇన్వెస్టర్ సిప్ పెట్టుబడుల కాల వ్యవధి సమయంలో మరణిస్తే.. మిగిలిన కాలానికి బీమా పరిహారాన్ని చెల్లించే విధంగా నిబంధనలు రూపొందించింది. ఉదాహరణకు ఇన్వెస్టర్ పదేళ్ల కాలాన్ని ఎంచుకుని, ఐదేళ్ల పాటు సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసిన తర్వాత మరణించినట్టయితే.. అప్పుడు మిగిలిన ఐదేళ్ల కాలానికి అంటే 60 నెలల సిప్ మొత్తానికి సరిపడా బీమా పరిహార చెల్లింపులు లభిస్తాయి.

### వీటిపై దృష్టి పెట్టాలి...



ఏదేనీ ఆర్థిక సాధనంతో పాటు ఉచితంగా బీమా పాలసీ ఇచ్చినప్పుడు మొదట చేయాల్సిన పని ఒకటుంది. వెంటనే నామినీని రిజిస్టర్ చేసుకోవాలి. ఎందుకంటే ఒకవేళ ఆకస్మిక మరణం చోటు చేసుకుంటే పరిహారం నామినీకి లభిస్తుంది. ముఖ్యంగా టర్మ్ పాలసీలకు ఇది అవసరం. తర్వాత ఎవరి పేరును నామినీగా నమోదు చేశారో, వారికి మీ పాలసీ వివరాల గురించి వెంటనే తెలియజేయాలి. టర్మ్ పాలసీలు, వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీలు, పర్యాటక బీమా పాలసీలకు ఇది చేయాలి. నామినీలకు క్లెయిమ్ ప్రక్రియ గురించి తెలియజేయడం కూడా అవసరమే. ఇలా వేరే ఉత్పత్తులకు అనుబంధంగా వచ్చే పాలసీలకు సంబంధించి అన్ని షరతులు, ప్రయోజనాల గురించి పూర్తిగా తెలుసుకోవడం ఎంత అవసరమో.. ఈ వివరాలను నామినీకి తెలియజేయడం అంతే అవసరం. దీనివల్ల ప్రయోజనాలు ఉంటాయి.

# ఆర్థికాంశాలే దిక్సూచి..!

**ఈ వారంలోనే తయారీ పీఎంఐ, వాహన విక్రయాల డేటా**




**ముంబై:** స్థూల ఆర్థిక గణాంకాలు, వాహన పరిశ్రమ అమ్మకాలు వంటి అంశాలు ఈ వారంలో దేశీ స్టాక్ మార్కెట్‌కు దిశా నిర్దేశం చేయనున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. నవంబర్ నెలకు సంబంధించి.. ఎనిమిది కీలక రంగాల ఉత్పత్తి, తయారీ పీఎంఐ వంటి అంశాలు మార్కెట్ కదలికలను ప్రభావితం చేయనున్నాయని ఎడెల్వీజ్ ప్రొఫెషనల్ ఇన్వెస్టర్ రీసెర్చ్ చీఫ్ మార్కెట్ స్ట్రాటజిస్ట్ సాహిల్ విశ్లేషించారు. ఈ వారంలో తక్కువ వాల్యూమ్స్‌తో కన్సాలిడేషన్‌కు అవకాశం ఉన్నట్లు భావిస్తున్నట్లు చెప్పారు. మొత్తంగా చూస్తే మార్కెట్ బ్రెడ్త్ పాజిటివ్‌గా ఉందని, అప్ ట్రెండ్‌కు సంకేతాలు కనిపిస్తున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది ద్వితీయార్థం చివరికి నిఫ్టీ 13,500 పాయింట్లకు చేరే అవకాశం ఉందని తాను భావిస్తున్నట్లు చెప్పారు. ఇక అమెరికా–చైనాల వాణిజ్య ఒప్పందం అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూలతను నింపిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం చీఫ్ వినోద్ నాయర్ విశ్లేషించారు.

## సెన్సెక్స్ తక్షణ అవరోధం 41,810

**మార్కెట్ పంచాంగం**


మార్కెట్ ట్రాకింగ్ కోసం విదేశీ ఇన్వెస్టర్లు, దేశీయ ఫండ్స్...అధికంగా అనుసరించే నిఫ్టీ–50 సూచి ఈ ఏడాది పలు సందర్భాల్లో 11,700–12,160 పాయింట్ల మధ్య కొత్త రికార్డుల్ని నెలకొల్పినా, రికార్డుస్థాయి దాటిన ప్రతీ సందర్భంలోనూ మరింత ముందడుగువేయలేక, పెద్ద కరెక్షన్‌కు లోనవుతూ వచ్చింది. తాజాగా డిసెంబర్ చివరివారంలో 12,158 గరిష్టస్థాయిని దాటిన తర్వాత 1 శాతం వరకూ నిఫ్టీ పైకి ఎగరగలిగింది. మళ్లీ యథాప్రకారం వెనువెంటనే దిద్దుబాటు బాటలో పడిపోయింది. సాంకేతికంగా ఈ తరహా ర్యాలీలు నిలదొక్కుకోలేవు. కొత్త రికార్డును నెలకొల్పినంతనే, కనీసం 4–5 శాతం వేగంగా పరుగులు తీస్తేనే....విస్తృత ర్యాలీ సాధ్యపడుతుంది. లేకపోతే కొత్త ఏడాదిలో కూడా 10 శాతం కదలికలకే సూచి పరిమితమవుతుంది. తద్వారా ఈ ఏడాదిలానే కొద్ది షేర్లే లబ్దిపొందుతాయి. అధికశాతం షేర్లు నష్టాలకు లోనవుతాయి. ఇక స్టాక్ సూచీల స్వల్పకాలిక సాంకేతికాలు ఇలా వున్నాయి.

### సెన్సెక్స్ సాంకేతికాంశాలు...




డిసెంబర్ 27తో ముగిసిన నాలుగు రోజుల ట్రేడింగ్‌వారంలో తొలుత 41,132 పాయింట్ల వరకూ కరెక్షన్‌కు లోనైన బీఎస్‌ఈ సెన్సెక్స్..ఆ కనిష్టస్థాయి నుంచి వేగంగా కోలుకుని 41,575 పాయింట్ల వద్ద ముగిసింది. చివరకు అంతక్రితం వారం ముగింపుతో పోలిస్తే 107 పాయింట్ల స్వల్పనష్టాన్ని చవిచూసింది. ఈ వారం మార్కెట్ పెరిగితే తొలుత 41,810 పాయింట్ల వద్ద అవరోధం కలగవచ్చు. ఈ స్థాయిని దాటితే 41,980 పాయింట్ల వరకూ పెరగవచ్చు. ఈ స్థాయిపైన ముగిస్తే క్రమేపీ 42,200 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. ఈ వారం మార్కెట్ ఒడిదుడుకులకు లోనైతే సెన్సెక్స్ 41,265 పాయింట్ల వద్ద తొలి మద్దతును పొందవచ్చు. ఈ లోపున వేగంగా 41,130 పాయింట్ల వద్దకు క్షీణించవచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే 41,000 పాయింట్ల వరకూ తగ్గుదల కొనసాగవచ్చు.

### నిఫ్టీ తక్షణ నిరోధం 12,295...




గత కాలమ్‌లో ప్రస్తావించిన రీతిలో తొలి నిరోధాన్ని అధిగమించలేక ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 12,118 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. అటుతర్వాత వేగంగా కోలుకుని 12,246 పాయింట్ల వద్ద ముగిసింది. అంతక్రితం వారంతో పోలిస్తే 27 పాయింట్ల స్వల్పనష్టాన్ని చవిచూసింది. ఈ వారం నిఫ్టీ పెరిగితే 12,295 పాయింట్ల స్థాయి తొలుత నిరోధించవచ్చు. ఈ స్థాయిని దాటితే 12,360 పాయింట్ల వరకూ పెరగవచ్చు. అటుపై 12,425 పాయింట్ల వరకూ ర్యాలీ కొనసాగే ఛాన్స్ వుంటుంది. ఈ వారం తొలి నిరోధస్థాయిని దాటలేకపోతే 12,160 పాయింట్ల స్థాయికి వేగంగా తగ్గవచ్చు. ఈ లోపున 12,115 పాయింట్ల వద్దకు క్షీణించవచ్చు. ఈ స్థాయి దిగువన 12,070 పాయింట్ల వరకూ తగ్గవచ్చు.

– పి. సత్యప్రసాద్

### స్టాక్స్ వ్యూ

**టాటా కెమికల్స్** | బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్ | **కొనొచ్చు**

ప్రస్తుత ధర: రూ.668 | టార్గెట్ ధర: రూ.811

**ఎందుకంటే:** ఉత్తర అమెరికాలో ఉన్న జాయింట్ వెంచర్ కంపెనీ (టాటా కెమికల్స్ సోడా యాష్ పార్ట్‌నర్స్ హోల్డింగ్స్–టీసీసాప్)లో 25 శాతం వాటాను టాటా కెమికల్స్ కొనుగోలు చేసింది. దీంతో టీసీసాప్‌లో వంద శాతం వాటా టాటా కెమికల్స్ పరమైంది. ఈ వాటా కొనుగోలు కోసం టాటా కెమికల్స్ కంపెనీ 19.5 కోట్ల డాలర్లు వెచ్చించింది. దీంట్లో 17.5 కోట్ల డాలర్లను రుణాల ద్వారా సమీకరించింది. మిగిలిన మొత్తాన్ని అంతర్గత వనరుల ద్వారా సమకూర్చుకుంది. టీసీసాప్ నేచురల్ సోడా యాష్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2.5 మెట్రిక్ మిలియన్ టన్నులు. నేచురల్ సోడా యాష్ ఉత్పత్తికి అవసరమైన ట్రోనా రిజర్వ్‌లు ఉత్తర అమెరికాలోనే అధికంగా ఉన్నాయి. ఫలితంగా ఉత్పత్తి వ్యయాలు 25–30% రేంజ్‌లో తగ్గుతాయి. 2019లో కన్సూమర్ బిజినెస్‌ను డీమెర్జ్ చేసింది. మిథాపూర్ ప్లాంట్ విస్తరణ నిమిత్తం రూ.2,400 కోట్లు పెట్టుబడులు పెట్టింది. ఈ పెట్టుబడులు ఫలితాలు 2022 నుంచి కనిపించనున్నాయి. కంపెనీకి కామధేనువు లాంటి సోడా యాష్, సోడియమ్ బైకార్బొనేట్ వ్యాపారం నిలకడగా ఉంది. ఈ వ్యాపారానికి సంబంధించి డిమాండ్–సరఫరా పరిస్థితులు సమతూకంగానే ఉండటం సానుకూలాంశం. ఈ వ్యాపారం నుంచి వచ్చే నిధులను మార్జిన్లు అధికంగా ఉండే స్పెషాల్టీ కెమికల్స్ వ్యాపారంలోకి మళ్లిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నికర లాభం 5% పెరుగుతుందని అంచనా వేస్తున్నాం.


**జుబిలంట్ ఫుడ్‌వర్క్స్** | బ్రోకరేజ్ సంస్థ: ఐడీబీఐ క్యాపిటల్ | **కొనొచ్చు**

ప్రస్తుత ధర: రూ.1,630 | టార్గెట్ ధర: రూ.1,836

**ఎందుకంటే:** జుబిలంట్ ఫుడ్‌వర్క్స్ కంపెనీ డొమినోస్ పిజ్జా, డంకిన్ డొనట్, హాంగ్స్ కిచెన్ బ్రాండ్ల కింద రెస్టారెంట్లను నిర్వహిస్తోంది. ఇటీవలనే హాంగ్స్ కిచెన్ పేరుతో చైనీస్ ఫాస్ట్ ఫుడ్ అవుట్‌లెట్లను అందుబాటులోకి తెచ్చింది. వీటి మెనూలో 40 శాతం ఉత్పత్తులు రూ.100–200 రేంజ్‌లోనే ఉన్నాయి. పిజ్జా మార్కెట్ కన్నా చైనీస్ ఫాస్ట్‌ఫుడ్ మార్కెట్ మూడు రెట్లు (రూ.15,000 కోట్లు) ఉంటుందని అంచనా. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ ఎస్ఎస్‌ఎస్‌జీ(సేమ్ స్టోర్స్ సేల్స్ గ్రోత్) 16.4 శాతంగా ఉంది. మందగమనం కారణంగా రానున్న రెండేళ్లలో ఇది 11–14శాతంగానే ఉండొచ్చని భావిస్తున్నాం. గత 4–5 ఏళ్లలో టెక్నాలజీపై భారీగా ఇన్వెస్ట్ చేసింది. 2012లో ఆరంభమైన డంకిన్ డొనట్స్ విభాగం గత ఆర్థిక సంవత్సరంలోనే బ్రేక్‌ఈవెన్ సాధించింది. ఓవెన్‌స్టోరీ వంటి క్లౌడ్ కిచెన్ రిటైలర్లు జోరుగా విస్తరిస్తుండటం, వీటి నుంచి పోటీ తీవ్రత పెరుగుతుండటం, ఉల్లిపాయలు, చికెన్, చీజ్ వంటి ముడి పదార్థాల ధరలు పెరుగుతుండటం వల్ల స్థూల మార్జిన్లపై ఒత్తిడి పెరిగే అవకాశాలు.... ప్రతికూలాంశాలు. వ్యయ నియంత్రణ పద్ధతులు, ధరలు పెంచడం ద్వారా ముడి పదార్థాల ధరల పెంపు ప్రభావాన్ని తగ్గించుకోనున్నది. రెండేళ్లలో ఆదాయం 14 శాతం, నిర్వహణ లాభం 19 శాతం, నికర లాభం 23 శాతం మేర చక్రగతిన వృద్ధి చెందుతాయని అంచనా. 2019–20 ఆర్థిక సంవత్సరంలో 75.1 శాతంగా ఉన్న స్థూల మార్జిన్లు 2021–22 నాటికి 75.4 శాతానికి పెరుగుతాయని భావిస్తున్నాం.

**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

### రూ.45 రీచార్జ్‌తోనే ఎయిర్‌టెల్ నంబర్ రింగింగ్!



**న్యూఢిల్లీ:** ఇక మీదట ఎయిర్‌టెల్ కస్టమర్లు ప్రతీ 28 రోజులకు చేసుకోవాల్సిన కనీస రీచార్జ్ మొత్తాన్ని కంపెనీ రూ.23 నుంచి రూ.45కు పెంచింది. "ప్రతీ 28 రోజులకు కనీసం రూ.45 లేదా అంతకు మించి రీచార్జ్ చేసుకుంటేనే సేవలు లభిస్తాయి" అని ఎయిర్‌టెల్ ప్రకటించింది. ఈ నెల 29 నుంచే ఇది అమల్లోకి వస్తుందని కూడా తెలిపింది. ప్రస్తుత టారిఫ్ గడువు ముగిసే నాటికి రూ.45 లేదా అంతకుమించిన రీచార్జ్ చేసుకోకపోతే.. సంబంధిత ప్లాన్ ప్రయోజనాలను తదుపరి 15 రోజుల గ్రేస్ పీరియడ్‌లో అందించడం అన్నది కంపెనీ అభీష్టంపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేసింది.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 30-12-2019

| | |
|---|---|
| విశాఖ | 475–00 |
| చిత్తూరు | 478–00 |
| వరంగల్ | 461–00 |
| విజయవాడ | 468–00 |
| గోదావరి | 468–00 |
| 29–12–2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 458–00 |

# అమెరికా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటే..

## ఫ్రాంక్లిన్ ఇండియా ఫీడర్ – ఫ్రాంక్లిన్ యూఎస్ అపార్చునిటీస్

పెట్టుబడులపై రిస్క్ తగ్గించుకునేందుకు పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యం ఎంతో అవసరం. ఇన్వెస్టర్లు తప్పకుండా అనుసరించాల్సిన సూత్రం ఇది. పెట్టుబడులు అన్నింటినీ తీసుకెళ్లి ఈక్విటీలో లేక రియల్ ఎస్టేట్‌లో.. ఇలా ఏ ఒక్క విభాగంలోనే ఇన్వెస్ట్ చేయడం వైవిధ్యానికి వ్యతిరేకం. ఇక ఈక్విటీల్లోనూ పెట్టుబడులన్నింటినీ ఒకే విభాగంలో ఇన్వెస్ట్ చేయడం కూడా వైవిధ్యం అనిపించుకోదు. కనుక వైవిధ్యం కోరుకునే వారు మన దేశ కంపెనీలతోపాటు, అమెరికాలో మంచి పనితీరు చూపిస్తున్న స్టాక్స్‌లోనూ కొంత పెట్టుబడులు పెట్టడం ద్వారా వైవిధ్యం ఉండేలా చూసుకోవచ్చు. ఎందుకంటే గత రెండేళ్లలో మన మార్కెట్లు ఎన్నో అస్థిరతలు ఎదుర్కొంటే, అమెరికా మార్కెట్లు మంచి పనితీరు చూపించాయి. ఒకవేళ అక్కడ కూడా ఇన్వెస్ట్ చేసి ఉంటే, గత రెండళ్ల కాలంలో మన మార్కెట్లలో ఉన్న అస్థిరతలను అధిగమించి మెరుగైన రాబడులు పొందే వారు. అమెరికన్ స్టాక్స్‌లో పెట్టుబడుల అవకాశాలను పలు మ్యూచువల్ ఫండ్స్ పథకాలు అందుబాటులోకి తీసుకొచ్చాయి. వాటిల్లో ఫ్రాంక్లిన్ ఇండియా ఫీడర్ – ఫ్రాంక్లిన్ యూఎస్ అపార్చునిటీస్ పథకం కూడా ఒకటి.

**వైవిధ్యం..**




టెక్నాలజీ దిగ్గజాలు ఆల్ఫాబెట్ (గూగుల్ మాతృ సంస్థ), ఫేస్‌బుక్, యాపిల్‌తోపాటు రిటైల్ దిగ్గజం అమెజాన్ తదితర కంపెనీల పనితీరు ప్రత్యేకంగా వివరించనక్కర్లేదు. ఇంతటి విజయవంతమైన కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే.. మ్యూచువల్ ఫండ్స్ పథకాల ద్వారా అదిప్పుడు సాధ్యమే. విదేశీ స్టాక్స్‌లో పెట్టుబడులతో వైవిధ్యమే కాదు మరో ప్రయోజనం కూడా ఉంది. భవిష్యత్తులో విదేశీ కరెన్సీ రూపంలో వ్యయాలు చేయాలనుకునే వారికి మంచి ఐడియానే అవుతుంది. అదెలా అంటే మీ పిల్లలను ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపించాలనుకుంటే డాలర్లను ఖర్చు చేయాలి కదా. అలాగే, విదేశాల్లో మంచి చికిత్స తీసుకోవాలనుకున్నా సరే అది డాలర్ డినామినేషన్‌లోనే ఖర్చు చేయాల్సి వస్తుంది. కనుక భవిష్యత్తులో విదేశీ కరెన్సీ రూపంలో ఎదురయ్యే ఖర్చులకు విదేశీ ఈక్విటీ పెట్టుబడుల రూపంలో ముందుగానే హెడ్జ్ చేసుకున్నట్టు అవుతుంది. భవిష్యత్తులో డాలర్‌తో రూపాయి మారకం మరింత క్షీణించినట్టయితే అప్పుడు ఈ పెట్టుబడుల వల్ల ప్రయోజనం పొందొచ్చు.



**పెట్టుబడుల విధానం–రాబడులు**

ఫ్రాంక్లిన్ ఇండియా ఫీడర్ – ఫ్రాంక్లిన్ యూఎస్ అపార్చునిటీస్ అన్నది ఓపెన్ ఎండెడ్ మ్యూచువల్ ఫండ్ పథకం. నిజానికి ఇది నేరుగా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే పథకం కాదు. ఫ్రాంక్లిన్ యూఎస్ అపార్చునిటీస్ ఫండ్ అనే మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లను కొనుగోలు చేసే ఫండ్ ఆఫ్ ఫండ్. అందుకే పేరులో ఫ్రాంక్లిన్ ఇండియా ఫీడర్ అని పేర్కొనడం జరిగింది. 2012లో ఈ పథకం ఆరంభమైంది. ఫ్రాంక్లిన్ యూఎస్ అపార్చునిటీస్ ఫండ్ అన్నది ప్రధానంగా అమెరికన్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఫ్రాంక్లిన్ ఇండియా ఫీడర్ ఫండ్ తన నిర్వహణలోని క్లయింట్ల పెట్టుబడుల్లో 95 శాతానికి తక్కువ కాకుండా ఫ్రాంక్లిన్ యూఎస్ అపార్చునిటీస్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. ప్రస్తుతానికి అయితే 99 శాతానికి పైగా పెట్టుబడులను ఫ్రాంక్లిన్ యూఎస్ అపార్చునిటీస్‌లో ఇన్వెస్ట్ చేసి ఉంది. ఈ పథకానికి మంచి రాబడుల చరిత్ర ఉంది. ఏడాది కాలంలో రాబడుల శాతం 3.2గా ఉంది. కానీ మూడేళ్లలో వార్షికంగా 17.8 శాతం, ఐదేళ్లలో వార్షికంగా 13.6 శాతం చొప్పున రాబడులను అందించింది. ఉదాహరణకు మూడేళ్ల క్రితం రూ.లక్ష పెట్టుబడి నేటికి రూ.1.6 లక్షలు అయ్యేది. ప్రతీ నెలా రూ.10,000 ఇన్వెస్ట్ చేసి ఉంటే మూడేళ్లలో రూ.4.7లక్షలు సమకూరేది. కనుక దీర్ఘకాలానికి, మరీ ముఖ్యంగా పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యం కోసం ఈ పథకంలో సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేయడాన్ని పరిశీలించొచ్చు.

**ఏ రంగాలకు ప్రాధాన్యం?**

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| టెక్నాలజీ | 33.4 |
| ఫైనాన్షియల్ సర్వీసెస్ | 18.2 |
| హెల్త్‌కేర్ | 13.8 |
| కన్స్యూమర్ డ్యురబుల్స్ | 11 |
| ఇండస్ట్రియల్స్ | 10 |
| ఇతర రంగాల్లో | 13.6 |



# ముర్రే అవుట్

## ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు బ్రిటన్ స్టార్ దూరం

**లండన్:** ప్రపంచ మాజీ నంబర్‌వన్, మూడు సార్లు గ్రాండ్‌స్లామ్ విజేతగా నిలిచిన ఆండీ ముర్రే వచ్చే నెలలో జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. గత నెలలో బ్రిటన్ తరఫున 32 ఏళ్ల ముర్రే డేవిస్ కప్ మ్యాచ్ ఆడాడు. ఆ సమయంలో తన పాత గాయం తిరగబెట్టిందని అతను వెల్లడించాడు. 'అత్యున్నత స్థాయిలో మళ్లీ పోటీ పడేందుకు ఎంతో శ్రమించాను. అయితే దురదృష్టవశాత్తూ ఇప్పుడు ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు దూరం కావాల్సి వస్తోంది. నేను చాలా నిరాశ చెందాను. అయితే ఇటీవలి పరిణామాల తర్వాత ముందు జాగ్రత్తగానే నేను ఈ నిర్ణయం తీసుకుంటున్నాను' అని ముర్రే చెప్పాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఐదు సార్లు ఫైనల్ చేరిన ముర్రే ఒక్కసారి కూడా విజేతగా నిలవలేకపోయాడు.

# హైదరాబాద్ ఖాతాలో ఏడో పరాజయం



**ముంబై:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) సీజన్–6 ఫుట్‌బాల్ టోర్నీలో హైదరాబాద్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే ఆరు ఓటములను ఖాతాలో వేసుకున్న హైదరాబాద్... ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 1–2 గోల్స్ తేడాతో ముంబై చేతిలో ఓడింది. దీంతో టోర్నీలో ఏడో పరాభవాన్ని మూటగట్టుకుంది. ముంబై ఆటగాడు సౌగౌ (6వ, 78వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించాడు. హైదరాబాద్ తరఫున నమోదైన ఏకైక గోల్‌ను బోబో (81వ నిమిషంలో) చేశాడు. నాలుగు రోజుల విరామం తర్వాత జనవరి 3వ తేదీన బెంగళూరు ఎఫ్‌సీతో ఎఫ్‌సీ గోవా తలపడుతుంది.

# 'వారిపై ఆరోపణల్లో అర్థం పర్థం లేదు'

## అన్షుమన్, శాంతా రంగస్వామిలకు క్లీన్‌చిట్

**న్యూఢిల్లీ:** 'కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రస్ట్' వివాదానికి సంబంధించి మాజీ క్రికెటర్లు, క్రికెట్ సలహా కమిటీ సభ్యులైన అన్షుమన్ గైక్వాడ్, శాంతా రంగస్వామిలకు ఎథిక్స్ ఆఫీసర్ జస్టిస్ డీకే జైన్ క్లీన్ చిట్ ఇచ్చారు. వారిపై ఆరోపణలకు అర్థం పర్థం లేదని ఆయన వ్యాఖ్యానించారు. 'కాన్‌ఫ్లిక్ట్' అంశంపై గైక్వాడ్ స్వయంగా జైన్ ముందు హాజరై తన వివరణ ఇచ్చారు. 'అన్షుమన్, శాంత తమ పదవులకు రాజీనామా చేశారు కాబట్టి వారిద్దరిపై నమోదైన ఫిర్యాదును కొట్టివేస్తున్నాం' అని జైన్ పేర్కొన్నారు. అయితే సలహా కమిటీలో మరో సభ్యుడైన మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్‌పై మాత్రం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఈ అంశంపై ఫిర్యాదు చేసిన మధ్యప్రదేశ్ క్రికెట్ సంఘం ప్రతినిధి సంజీవ్ గుప్తా అదనపు సమాచారం ఇచ్చేందుకు మరికొంత సమయం కోరడంతో జైన్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

# ఈ విజయం ఎంతో మధురం



ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగి... అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని... గతంలో ఏ భారతీయ క్రీడాకారిణికి సాధ్యంకాని ఘనతను సొంతం చేసుకొని... అంతర్జాతీయ వేదికపై మరోసారి అబ్బురపరిచే ప్రదర్శనతో భారత చెస్ పతాకాన్ని రెపరెపలాడించి... అందరిచేతా శభాష్ అనిపించుకుంది ఆంధ్రప్రదేశ్ చెస్ గ్రాండ్ మాస్టర్ (జీఎం), భారత మహిళల నంబర్‌వన్ ప్లేయర్ కోనేరు హంపి. మాస్కోలో జరుగుతున్న ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో భాగంగా శనివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన మహిళల ర్యాపిడ్ విభాగంలో హంపి విశ్వవిజేతగా అవతరించింది. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా ఆమె కొత్త చరిత్ర సృష్టించింది. గతంలో నాలుగుసార్లు సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన హంపికి సీనియర్ విభాగంలో మాత్రం విశ్వకిరీటం ఊరిస్తూ వస్తోంది. అయితే తనకెంతో పట్టున్న క్లాసికల్ విభాగంలో కాకుండా ధనాధన్ పద్ధతిలో జరిగే ర్యాపిడ్ విభాగంలో హంపి విశ్వవిజేతగా నిలిచి తన స్వప్నాన్ని సాకారం చేసుకుంది.

- ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌షిప్ టైటిల్ గెలుస్తానని అనుకోలేదు
- అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నా
- వ్యవస్థ నుంచి కాకుండా వ్యక్తిగత కృషితోనే విజేతలు వస్తున్నారు

## 'సాక్షి' ఇంటర్వ్యూలో తెలుగు తేజం కోనేరు హంపి

**సాక్షి, హైదరాబాద్ :** ఒకదశలో టాప్–3లో నిలిస్తే చాలు అనుకునే స్థితిలో ఉన్నప్పటికీ...ఒకవైపు ఫేవరెట్స్‌గా భావించిన క్రీడాకారిణుల ఫలితాలు చివరి రెండు రౌండ్‌లలో తారుమారు కావడం... మరోవైపు తాను వరుసగా రెండు విజయాలు సాధించడంతో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ (జీఎం) కోనేరు హంపికి ఒక్కసారిగా ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం కోసం, ప్రపంచ టైటిల్ కోసం పోటీపడే అవకాశం వచ్చింది. ఊహించని ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్న హంపి... ఏమాత్రం సంయమనం కోల్పోకుండా, స్థిరచిత్తంతో ఆడి ప్రత్యర్థి ఆట కట్టించింది. 18 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. ఊహించనిరీతిలో అద్భుత విజయం సొంతం కావడం ఎంతో మధురంగా అనిపిస్తోందని... ఈ గెలుపు తన ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందని మాస్కో నుంచి 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో హంపి వ్యాఖ్యానించింది. పలు అంశాలపై హంపి వెలిబుచ్చిన అభిప్రాయాలు ఆమె మాటల్లోనే...

### ఊహించలేదు...

ర్యాపిడ్ విభాగం చివరి రోజు గేమ్‌లు మొదలయ్యే సమయానికి నేను ఐదో స్థానంలో ఉన్నా. మిగిలిన నాలుగు గేముల్లో మంచి ప్రదర్శన చేసి టాప్–3లోకి రావాలనుకున్నా. కానీ నేను రెండు గేముల్లో నెగ్గడం... ఇతర క్రీడాకారిణులు ఓడిపోవడంతో నాతోపాటు మరో ఇద్దరు లీ టింగ్‌జి (చైనా), ఎకతెరీనా అతాలిక్ (టర్కీ) 9 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలోకి వచ్చారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా తొలి రెండు స్థానాల్లో నిలువడంతో నేను, లీ టింగ్‌జి ప్రపంచ టైటిల్ కోసం టైబ్రేక్ గేమ్‌లు ఆడాల్సి వచ్చింది. సీనియర్ విభాగంలో తొలి ప్రపంచ టైటిల్ గెలిచే అవకాశం వచ్చిందని భావించాను. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాను. టైబ్రేక్ తొలి గేమ్‌లో ఓడిపోయినా... రెండో గేమ్‌లో పుంజుకొని గెలిచాను. నిర్ణాయక 'అర్మగెడాన్' గేమ్‌లో నల్లపావులతో ఆడాల్సి రావడం... 'డ్రా' చేసుకుంటే టైటిల్ ఖాయమయ్యే స్థితిలో ఈ గేమ్‌లో ఆరంభం నుంచే మంచి స్థితిలో నిలిచి చివరకు అనుకున్న ఫలితం సాధించాను.

### ఫలించిన నిరీక్షణ...

2001లో నేను అండర్–20 ప్రపంచ జూనియర్ చాంపియన్‌గా నిలిచా. ఆ తర్వాత పలుమార్లు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో పాల్గొన్నాను. కొన్నిసార్లు ఆరంభ దశలోనే వెనుదిరిగాను. మరి కొన్నిసార్లు కాంస్యం, రజతంతో సరిపెట్టుకున్నాను. ఐదేళ్ల క్రితం పెళ్లి కావడం... ఆ తర్వాత పాప పుట్టడంతో రెండేళ్లపాటు ఆటకు దూరమయ్యాను. గత ఏడాది పునరాగమనం చేశా. సంవత్సరం తిరిగేలోపు ప్రపంచ టైటిల్ సాధించడంతో చాలా సంతోషంగా ఉన్నాను. 18 ఏళ్ల విరామం తర్వాత మళ్లీ ప్రపంచ చాంపియన్ కావడం గొప్ప అనుభూతినిస్తోంది. ర్యాపిడ్ ఫార్మాట్‌లో విశ్వకిరీటం లభించినప్పటికీ.... క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రపంచ టైటిల్ వేటను కొనసాగిస్తాను.



హంపి, లీ టింగ్‌జి ఫైనల్ గేమ్

### నా కుటుంబ సభ్యులకు అంకితం...

ఈ ప్రపంచ టైటిల్‌ను నా కుటుంబ సభ్యులకు అంకితం ఇస్తున్నాను. పునరాగమనంలో తల్లిదండ్రులు కోనేరు అశోక్, లత... భర్త దాసరి అన్వేష్ ఎంతో మద్దతు ఇస్తున్నారు. వారి సహకారం లేకపోయుంటే నేను మళ్లీ కెరీర్ కొనసాగించేదాన్ని కాదు. ఇప్పటికీ నేను రోజూ ఐదారు గంటలు నాన్న అశోక్ పర్యవేక్షణలోనే ప్రాక్టీస్ చేస్తున్నాను. నా ఆటతీరులోని లోపాలను ఎప్పటికప్పుడు ఆయన సరిదిద్దుతున్నారు. నేను టోర్నమెంట్‌లు ఆడేందుకు విదేశాలకు వెళ్లిన సమయంలో నా రెండేళ్ల పాప అహానాను అమ్మా, నాన్న చూసుకుంటారు.

### కొన్నేళ్లు తీవ్రంగా కష్టపడాల్సిందే...

దాదాపు 25 ఏళ్లుగా చెస్ ఆడుతున్నాను. నాటి పరిస్థితులతో పోలిస్తే ఇప్పుడు ఎంతో మార్పు వచ్చింది. మనలో సహజసిద్ధమైన ప్రతిభ ఉంటే కొన్నేళ్లు తీవ్రంగా కష్టపడితే తప్పకుండా ఉన్నతస్థితికి చేరుకుంటాం. కెరీర్ ఆరంభంలో ఎదురయ్యే ఒడిదుడుకులకు తట్టుకొని స్థిరంగా నిలబడాలి. అప్పుడే మంచి భవిష్యత్ ఉంటుంది. అయితే విదేశీ కోచ్‌ల వద్ద శిక్షణ వ్యవహారం చాలా ఖరీదుతో కూడుకున్నది. నాన్న అశోక్ రూపంలో నాకు మంచి కోచ్ లభించడంతో నా కెరీర్‌లో విదేశీ కోచ్‌ల వద్ద శిక్షణ తీసుకోవాల్సిన అవసరం రాలేదు.

### హంపికి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందన



**సాక్షి, అమరావతి:** ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ గెల్చుకున్న తొలి భారతీయ చెస్ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించిన ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. మాస్కోలో శనివారం రాత్రి జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో చైనా ప్లేయర్ లీ టింగ్‌జిపై హంపి గెలిచి విశ్వవిజేతగా అవతరించింది. హంపి సాధించిన విజయం రాష్ట్ర, దేశ ప్రజలకు గర్వకారణమని జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. హంపికి ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ కూడా అభినందనలు తెలిపారు.

### పక్కా వ్యవస్థ ఉండాలి....

గతంతో పోలిస్తే ఇప్పుడు భారత్‌లో చెస్‌కు ఆదరణ ఎంతో పెరిగింది. అయితే ఇప్పటికీ మనవద్ద చెస్ చాంపియన్‌లను తయారు చేసే పక్కా వ్యవస్థ లేదనే చెప్పాలి. బ్యాడ్మింటన్‌లో పుల్లెల గోపీచంద్ అకాడమీ మాదిరిగా చెస్‌లోనూ ఉంటే బాగుంటుంది. చైనా, రష్యాలలో జాతీయ జట్లకు రెగ్యులర్ కోచ్‌లు ఉంటారు. అందుకే ఆ దేశాల నుంచి రెగ్యులర్‌గా మేటి ఆటగాళ్లు తెరపైకి వస్తుంటారు. భారత్‌లో ఇప్పటివరకు వచ్చిన గ్రాండ్‌మాస్టర్లు, చాంపియన్స్ తమ స్వశక్తితో పైకి వచ్చిన వాళ్లే. విజయాలు సాధించాక సన్మానాలు చేసే బదులు చాంపియన్స్ తయారయ్యేలా వ్యవస్థను రూపొందించాలి. ఇప్పటికైతే వ్యక్తిగతంగా చెస్ అకాడమీ ఏర్పాటు చేసే ఆలోచన లేదు. వచ్చే ఏడాది కోసం ప్రత్యేకంగా ఎలాంటి లక్ష్యాలను నిర్దేశించుకోలేదు. బరిలో దిగే టోర్నీలలో గొప్ప ప్రదర్శన చేయాలని అనుకుంటున్నాను.

### 'బ్లిట్జ్'లో సంయుక్తంగా రెండో స్థానంలో...

ర్యాపిడ్ విభాగంలో చాంపియన్‌గా నిలిచిన కోనేరు హంపి బ్లిట్జ్ విభాగంలోనూ ఆకట్టుకుంది. నిర్ణీత 17 రౌండ్లకుగాను ఆదివారం తొమ్మిది రౌండ్‌లు జరిగాయి. తొమ్మిది రౌండ్‌ల పూర్తయ్యాక హంపి 7 పాయింట్లతో అలెగ్జాండ్రా కొస్టెనిక్ (రష్యా), దరియా చరోచ్‌కినా (రష్యా), అలీనా కష్లిన్‌స్కాయ (రష్యా)లతో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉంది. 8 పాయింట్లతో కాటరీనా లాగ్నో (రష్యా) అగ్రస్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 6.5 పాయింట్లతో మరో ఆరుగురితో కలిసి సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచింది. నేడు మిగతా ఎనిమిది రౌండ్‌లు జరుగుతాయి. బ్లిట్జ్ ఓపెన్ విభాగంలో 10 రౌండ్‌లు పూర్తయ్యాక భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్ గుజరాతి 7.5 పాయింట్లతో మరో ముగ్గురితో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. నేడు మిగతా 11 రౌండ్‌లు జరుగుతాయి.

# సఫారీలకు సంతోషం

- తొలి టెస్టులో ఇంగ్లండ్‌పై 107 పరుగులతో గెలుపు
- ఐదు ఓటముల తర్వాత మొదటి విజయం

**సెంచూరియన్:** సొంతగడ్డపైనే శ్రీలంకలాంటి జట్టు చేతిలో వరుసగా రెండు టెస్టుల్లో ఓటమి. భారత్‌లో ఆడిన సిరీస్‌లో 0–3తో చిత్తయితే ఇందులో రెండు ఇన్నింగ్స్ పరాజయాలు. కీలక ఆటగాళ్లు జట్టుకు దూరం, తప్పుకున్న టీమ్ ప్రధాన స్పాన్సర్. ఇలా వేగంగా పతనమైపోతూ వచ్చిన దక్షిణాఫ్రికా క్రికెట్‌కు కాస్త ఊరట! దిగ్గజ క్రికెటర్లు గ్రేమ్ స్మిత్, మార్క్ బౌచర్, జాక్వస్ కలిస్ టీమ్ డైరెక్టర్, కోచ్, సలహాదారుల పాత్రలోకి వచ్చిన తర్వాత బరిలోకి దిగిన మొదటి పోరులోనే ఆ జట్టు విజయాన్ని రుచి చూసింది. ఆదివారం ఇక్కడ ముగిసిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా 107 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. 376 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 268 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 121/1తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ ఒక దశలో 204/3తో పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే 64 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి 7 వికెట్లు కోల్పోయింది. రోరీ బర్న్స్ (154 బంతుల్లో 84; 11 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలవగా, కెప్టెన్ జో రూట్ (48) మాత్రమే కొద్దిగా పోరాడాడు. సఫారీ పేస్ బౌలర్లు రబడ 4, నోర్జే 3 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశారు. నాలుగు టెస్టుల ఈ సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1–0తో ఆధిక్యంలో నిలవగా... జనవరి 3 నుంచి కేప్‌టౌన్‌లో రెండో టెస్టు జరుగుతుంది. తాజా విజయంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో కూడా డు ప్లెసిస్ సేన ఖాతా తెరిచింది. ఈ గెలుపు అనంతరం దక్షిణాఫ్రికాకు 30 పాయింట్లు లభించాయి.



రబడ



ఆసీస్ ఆటగాళ్ల సంబరం



బ్లన్‌డెల్

# ఆస్ట్రేలియా ఘన విజయం

**మెల్‌బోర్న్:** న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా 247 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. దాదాపు అసాధ్యమైన 488 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ మ్యాచ్ నాలుగో రోజు ఆదివారం తమ రెండో ఇన్నింగ్స్‌లో 240 పరుగులకే ఆలౌటైంది. టామ్ బ్లన్‌డెల్ (210 బంతుల్లో 121; 15 ఫోర్లు) వీరోచిత శతకం సాధించగా... ఇతర బ్యాట్స్‌మెన్ పూర్తిగా విఫలమయ్యారు. ఆరంభంలోనే జేమ్స్ ప్యాటిన్సన్ 9 బంతుల వ్యవధిలో లాథమ్ (9), విలియమ్సన్ (0), టేలర్ (2)లను అవుట్ చేయడంతో కివీస్ ఆశలు గల్లంతయ్యాయి. ఆసీస్ బౌలర్లలో నాథన్ లయన్ 4, ప్యాటిన్సన్ 3 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశారు.

### ట్రాన్స్-టాస్మన్ ట్రోఫీ సొంతం

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 137/4తో ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా మరో 9.2 ఓవర్లు మాత్రమే ఆడింది. 5 వికెట్లకు 168 పరుగుల వద్ద తమ రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. వాగ్నర్‌కు 3 వికెట్లు దక్కాయి. ట్రావిస్ హెడ్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. 3 టెస్టుల సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లలో నెగ్గిన ఆస్ట్రేలియా 'ట్రాన్స్–టాస్మన్ ట్రోఫీ'ని నిలబెట్టుకుంది. ఇరు జట్ల మధ్య చివరి టెస్టు వచ్చే నెల 3 నుంచి సిడ్నీలో జరుగుతుంది.



# సిడిల్ గుడ్‌బై

## రిటైర్మెంట్ ప్రకటించిన ఆసీస్ పేసర్


**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా పేస్ బౌలర్ పీటర్ సిడిల్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. ఆదివారం న్యూజిలాండ్‌తో ముగిసిన రెండో టెస్టు కోసం అతడిని ఎంపిక చేసినా... తుది జట్టులో స్థానం దక్కలేదు. 11 ఏళ్ల కెరీర్‌లో 20 వన్డేలు, 2 టి20లు ఆడినా సిడిల్‌కు టెస్టు స్పెషలిస్ట్‌గానే ఎక్కువ గుర్తింపు దక్కింది. 67 టెస్టుల్లో ఆసీస్‌కు ప్రాతినిధ్యం వహించిన 35 ఏళ్ల సిడిల్ 30.66 సగటుతో 221 వికెట్లు పడగొట్టాడు. ఇందులో 8 సార్లు ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి. కంగారూల తరఫున అత్యధిక టెస్టు వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో 13వ స్థానంతో సిడిల్ తన కెరీర్ ముగించాడు. 2008లో మొహాలిలో తన తొలి టెస్టు ఆడిన సిడిల్ కెరీర్‌లో సచిన్ టెండూల్కర్ వికెట్ మొదటిది. తర్వాతి ఏడాది ఐసీసీ ఎమర్జింగ్ ప్లేయర్‌గా కూడా అవార్డు అందుకున్న అతను అందరి దృష్టినీ ఆకర్షించాడు. అయితే వరుస గాయాలతో అతని కెరీర్ సక్రమంగా సాగలేదు. అనేక సార్లు ఆసీస్ తరఫున ఆడి జట్టుకు దూరం కావడం, మళ్లీ పునరాగమనం చేయడం తరచుగా జరిగింది.

# ఢిల్లీ క్రికెట్‌లో గల్లీ గొడవ



**న్యూఢిల్లీ:** ఢిల్లీ క్రికెట్ సంఘం (డీడీసీఏ)లో సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న విభేదాలు రచ్చకెక్కాయి. ఆదివారం జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) సందర్భంగా సభ్యులు ఒకరిపై మరొకరు నేరుగా చేయి చేసుకున్నారు. అధికార వర్గానికి చెందిన సంయుక్త కార్యదర్శి రంజన్ మన్‌చందాను ప్రత్యర్థి వర్గం ప్రతినిధి మఖ్సూద్ ఆలమ్ చెంపదెబ్బ కొట్టగా... స్థానిక ఎమ్మెల్యే కూడా అయిన ఓం ప్రకాశ్ శర్మపై కూడా వినోద్ తిహారాకు చెందిన వ్యక్తులు దాడికి దిగారు. ఇంత గొడవ మధ్యలో కూడా అన్ని తీర్మానాలకు ఆమోదం లభించినట్లు ఢిల్లీ క్రికెట్ సంఘం అధికారికంగా ప్రకటించింది. జస్టిస్ బదర్ అహ్మద్ స్థానంలో కొత్తగా జస్టిస్ దీపక్ వర్మను కొత్త అంబుడ్స్‌మన్‌గా నియమించారు. 'ఢిల్లీ క్రికెట్ సంఘం అతి ఘోరంగా సున్నాకే ఆలౌటైంది. కొందరు సంఘం పరువు తీస్తున్నారు. ఈ సంఘాన్ని వెంటనే రద్దు చేయాలని బీసీసీఐ, గంగూలీకి విజ్ఞప్తి చేస్తున్నా. అవసరమైతే తప్పు చేసినవారిపై జీవితకాల నిషేధం కూడా విధించండి' అని భారత మాజీ క్రికెటర్, ఈస్ట్ ఢిల్లీ ఎంపీ గౌతం గంభీర్ తాజా ఘటనపై వ్యాఖ్యానించాడు.

### రసాభాసగా మారిన ఏజీఎం



# ఎప్పుడు ఫిట్‌గా మారతానో చెప్పలేను

## భువనేశ్వర్ వ్యాఖ్య

**సాక్షి, హైదరాబాద్:** టి20 ప్రపంచకప్‌కు ఇంకా చాలా సమయం ఉంది కాబట్టి దాని గురించి తాను ప్రస్తుతానికి ఆలోచించడం లేదని భారత పేస్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ అన్నాడు. గాయం నుంచి కోలుకొని పూర్తి ఫిట్‌గా మారే వరకు బౌలింగ్ ప్రదర్శనపై దృష్టి పెట్టాల్సిన అవసరం లేదని అతను అభిప్రాయ పడ్డాడు. 'స్పోర్ట్స్ హెర్నియా' కారణంగా వెస్టిండీస్‌తో సిరీస్‌కు భువీ దూరమయ్యాడు. స్పోర్ట్స్ వేర్ సంస్థ 'అసిక్స్' ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం అతను నగరానికి వచ్చాడు. 'టి20 ప్రపంచకప్‌కు తొమ్మిది నెలల సమయం ఉంది. నేను ఫిట్‌గా మారడంపైనే ప్రస్తుతం దృష్టి పెట్టాను. అయితే ఎప్పుడు పూర్తిగా కోలుకుంటానో చెప్పలేను. జట్టులో నా స్థానం గురించి ఈ దశలో ఆలోచించడం కూడా అనవసరం. బాగా ఆడటమే నా చేతుల్లో ఉంది. సెలెక్టర్లు ఏం చేస్తారనేది వారిష్టం' అని అన్నాడు. కొన్నాళ్ల క్రితం వరకు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లోనే కోలుకొని సాధన చేసిన భువీ గాయం మళ్లీ తిరగబెట్టింది. ఎన్‌సీఏలో ఉన్న సౌకర్యాల గురించి కూడా విమర్శలు వచ్చాయి. అయితే దీనిపై తాను ఏమీ చెప్పలేనని భువీ పేర్కొన్నాడు. 'ఎన్‌సీఏ తమ వంతుగా నా రీహాబిలిటేషన్‌కు ప్రయత్నించింది. లోపం ఎక్కడ జరిగిందో చెప్పలేను. డాక్టర్‌ను సంప్రదించిన తర్వాతే నా గాయానికి శస్త్ర చికిత్స అవసరమా కాదా అనేది తెలుతుంది' అని భువనేశ్వర్ స్పష్టం చేశాడు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com